
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 29

శుక్రవారం 13-10-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సఫారీ దెబ్బకు 'కంగారు'

డికాక్ సెంచరీ.. ప్రపంచకప్‌లో ఆసీస్‌కు వరుసగా రెండో ఓటమి - 13లో



ఐటీ షేర్లు పడేశాయ్


సూచీల రెండు రోజుల ర్యాలీకి బ్రేక్.. సెన్సెక్స్ 65 పాయింట్లు పతనం - 13లో



భారత్ స్వరం బలపడుతోంది

సవాళ్లతో నిండిన ప్రపంచంలో భారత్ వాణి మరింత బలపడిందని ప్రధాని మోదీ ఉత్తరాఖండ్‌లో జరిగిన సభలో చెప్పారు.


వివరాలు 6లో ▸



శిశువు ప్రాణాలు తీయలేం

26 వారాల గర్భాన్ని విచ్ఛిన్నం చేయడానికి అనుమతివ్వాలన్న ఓ వివాహిత పిటిషన్‌పై సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 6లో ▸



ఆకలి సూచీలో 111వ స్థానం

125 దేశాల జాబితాతో కూడిన ప్రపంచ ఆహార సూచీలో భారత్ 111వ స్థానంలో నిలిచింది. దీనిని కేంద్రం కొట్టిపారేసింది.

వివరాలు 6లో ▸



క్వార్టర్ ఫైనల్లో సింధు

ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 22వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ)పై గెలిచింది.

వివరాలు 13లో ▸

ఫ్యాక్ట్ చెక్

కరెంటుంది.. కోతల్లేవు

- రైతులను ఆందోళనకు గురిచేసేలా 'ఈనాడు' తప్పుడు కథనం
- 'ఈనాడు' కథనాన్ని ఖండించిన విద్యుత్ పంపిణీ సంస్థలు
- వ్యవసాయానికి కచ్చితంగా 9 గంటల విద్యుత్ సరఫరా
- అవసరాన్ని బట్టి ఎంత ఖర్చు అయినా విద్యుత్ కొనుగోలు

3లో

విద్యా సంస్కరణలపై వక్రభాష్యాలు



'రాష్ట్రంలోని విద్యా సంస్కరణలపై రాజకీయ విష ప్రచారం జరుగుతోంది. పేదింటి బిడ్డలను అంతర్జాతీయ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెస్తుంటే.. ఎల్లో మీడియా, విపక్షాలు విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వక్రభాష్యం పలుకుతున్నాయి' అని మంత్రి బొత్స మండిపడ్డారు.

- వివరాలు 3లో



కాకినాడ జిల్లా సామర్లకోటలో పేదల సామూహిక గృహ ప్రవేశాలను ప్రారంభించిన అనంతరం ఓ లబ్ధిదారు ఇంటిలోకి అడుగు పెడుతున్న సీఎం వైఎస్ జగన్



సామర్లకోటలో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

అక్కచెల్లెమ్మల కళ్లల్లో..

సంతోషం చూస్తున్నా

సామర్లకోట పేదల ఇళ్ల గృహ ప్రవేశాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- పేదల ఇళ్ల కోసం 72 వేల ఎకరాలను సేకరించాం
- ఇళ్ల స్థలాల కోసమే ఏకంగా రూ.75 వేల కోట్లు వ్యయం
- 30.75 లక్షల మంది అక్కచెల్లెమ్మల పేరుతో పట్టాలిచ్చాం
- రాష్ట్రవ్యాప్తంగా 17 వేల వైఎస్సార్ జగనన్న కాలనీలు
- తొలివిడతగా సిద్ధమైన 7.43 లక్షల ఇళ్లలోకి సామూహిక గృహ ప్రవేశాలు
- శరవేగంగా కొనసాగుతున్న మరో 14.33 లక్షల గృహ నిర్మాణాలు
- బాబు హయాంలో సొంత ఇళ్లు లేని నిరుపేదలు కోటి మందికి పైనే
- కనీసం కుప్పంలోనైనా ఎవరికైనా సెంటు భూమి ఇచ్చాడా?
- పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వకుండా కేసులతో అడ్డుపడ్డారు

2లో

బాబు ముఖం చూస్తే స్కామ్‌లు గుర్తొస్తాయి

2లో

ఆయన ఎప్పుడైనా వరుసగా ఒక నెల రోజులు రాష్ట్రంలో ఉన్నాడా?: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

బాబు దత్తపుత్రుడి ఇల్లు హైదరాబాద్‌లో ఉంటుంది

ఆ ఇంటిలో ఇల్లాలు మాత్రం ప్రతి మూడు, నాలుగేళ్లకు మారిపోతోంది.. ఆడవాళ్లు, వివాహ వ్యవస్థ అంటే ఆయనకు చులకన భావం

సొంత పార్టీని, సొంత వర్గాన్ని అమ్ముకునే వ్యాపారిని ఇప్పుడే చూస్తున్నాం

రాజస్థాన్‌లో స్వింగ్ ఎటు?



రాజస్థాన్‌లో ప్రజలు వరసగా రెండుసార్లు ఏ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టిన దాఖలాలు లేవు. కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరాటంతో చెరో ఐదేళ్ల అధికారాన్ని పంచుకుంటున్నాయి. స్వింగ్ స్థానాలే కింగ్ మేకర్స్‌గా మారి అధికారంలోకి ఎవరు రావాలో నిర్ణయిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో ఈ స్వింగ్ స్థానాల్లో ఏ పార్టీకి ఎలా ఉంది?

- వివరాలు 12లో

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుకు ఎదురుదెబ్బ

ఆయనపై పీటీ వారెంట్ జారీకి ఏసీబీ కోర్టు అనుమతి

సోమవారం విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టాలని ఆదేశం

వివాదాస్పదంగా ప్రవర్తించిన టీడీపీ న్యాయవాదులు

ప్రత్యేక పీపీ వివేకానందపై దాడికి యత్నం.. అరుపులతో దద్దరిల్లిన కోర్టు

టీడీపీ న్యాయవాదుల తీరుపై న్యాయాధికారి తీవ్ర ఆగ్రహం

ఇలా అయితే కేసు విచారించలేనని చెప్పి బెంచ్‌దిగి వెళ్లిపోయిన జడ్జి



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణంలో నిందితుడు చంద్రబాబుకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆయనపై పీటీ వారెంట్ జారీచేసేందుకు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం అనుమతించింది. చంద్రబాబును సోమవారం విజయవాడ కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అరెస్ట్ అయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్న ఆయన్ని

మిగతా 10వ పేజీలో ▶



గాజాపై భూతల యుద్ధం!

హమాస్ మిలిటెంట్లను నిర్మూలించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ అడుగులు

ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం ఉధృతంగా మారింది. ఇజ్రాయెల్ సైన్యం గాజాపై శక్తివంతమైన రాకెట్లు ప్రయోగించగా.. హమాస్ మిలిటెంట్లు కూడా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డారు. దీంతో మృతుల సంఖ్య 2,600కు చేరింది. గాజాలో 1,350 మందికి పైగా మరణించారని పాలస్తీనా ప్రకటించగా.. తమ దేశంలో 222 మంది సైనికులు సహా 1,300 మంది మృతి చెందారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హమాస్ మిలిటెంట్లను నిర్మూలించడం, గాజాను హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ముందుకు కదులుతోంది. ఇజ్రాయెల్ నుంచి భారతీయులను క్షేమంగా తెచ్చేందుకు కేంద్రం ఆపరేషన్ అజయ్‌ను ప్రారంభించింది.

6లో



సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఆర్థిక భరోసా

'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం.. ప్రిలిమినరీలో క్వాలిఫై అయితే రూ.లక్ష

మెయిన్స్‌లో క్వాలిఫై అయితే రూ.50 వేలు.. యూపీఎస్సీ ఎన్నిసార్లు అనుమతించినా ఆర్థిక సాయానికి అర్హులే

సివిల్ సర్వీసెస్‌కు రాష్ట్రం నుంచి ఎక్కువ మందిని ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


5లో





అసైన్డ్ భూదోపిడీలో కొత్త కోణం..

గుట్టుగా జీఓ-41 జారీ



- కేబినెట్‌కు తెలియకుండా బాబు, నారాయణ బరితెగింపు
- ఇది సీఆర్డీఏ చట్టాన్ని ఉల్లంఘించడమే..
- తద్వారా అమరావతి పరిధిలోని 950 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టిన బాబు ముఠా
- సీఐడీ దర్యాప్తులో తాజాగా వెలుగులోకి..

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అమరావతి భూదోపిడీలో కొత్త కుట్రలు వెలుగులోకి వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు చెందిన అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించారన్నది ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వచ్చింది. అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టానికి విరుద్ధంగా జీఓ–41 జారీకి ఆ ద్వయం బరితెగించి మరీ వ్యవహరించింది. అందుకోసం ఏకంగా కేబినెట్‌కు తెలియకుండా.. సీఆర్డీఏ చట్టాన్ని ఉల్లంఘిస్తూ మరీ దోపిడీకి వారిద్దరూ కుట్ర పన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా.. సీఆర్డీఏ చట్టానికి విరుద్ధంగా జీఓ–41ను జారీచేశారని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తులో వెల్లడైంది. ముందుగా అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వరని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను బెదిరించి..

మిగతా 10వ పేజీలో ▶



ఇంటికి చేరువలోనే విద్యుత్ సేవలు

14 రకాల పనులు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పూర్తి

వినియోగదారులు మీ-సేవా కేంద్రాలకు వెళ్లనవసరం లేదు


ప్రజలకు అందుబాటులో 7,883 మంది ఎనర్జీ అసిస్టెంట్లు

ప్రతి ఎనర్జీ అసిస్టెంట్ 1,500 విద్యుత్ కనెక్షన్లకు బాధ్యుడు

ఇకపై మరింత త్వరగా విద్యుత్ సమస్యలు పరిష్కారం

- వివరాలు 14లో

టెక్ మహీంద్రా ఎండీ సీపీ గుర్నానికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం జగన్



రాష్ట్రంలో టెక్ మహీంద్రా స్టార్ హోటల్స్

విశాఖ సహా 3 ప్రాంతాల్లో ఏర్పాటు

ఫైవ్ స్టార్, సెవన్ స్టార్ హోటల్స్ నిర్మాణం

సీఎం జగన్‌ను కలిసిన టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నాని

3లో

ఇదం జగత్









ఊపిరి ఉన్నంత వరకూ మీ వెంటే జగనన్నా.. అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఓ స్టాఫ్ నర్సు.. సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న అక్కచెల్లెమ్మలు, గోదావరి నదిలో పడవపై సీఎం జగన్ ఫ్లెక్సీలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు, సుందరంగా జగనన్న కాలనీ

అక్కచెల్లెమ్మల కళ్లల్లో సంతోషాన్ని చూస్తున్నా..

సామర్లకోట పేదల ఇళ్ల గృహ ప్రవేశాల్లో సీఎం వైఎస్ జగన్

సామర్లకోట నుంచి సాక్షి ప్రతినిధి: ''నిరుపేద అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఎనలేని సంతోషాన్ని చూశా. బహుశా దేశ చరిత్రలో ఎక్కడా జరగని మహాయజ్ఞం పేదల సొంతింటి కలను మనం సాకారం చేశాం. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 31 లక్షల కుటుంబాల్లో అంటే రాష్ట్ర జనాభాలో 20 శాతం పైచిలుకు ఉన్న ఇళ్లు లేని నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని తాపత్రయపడ్డా. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి మంచి చేశాం. దేవుడి దయతో నా పేద అక్కచెల్లెమ్మలకు దాదాపు 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు దాదాపు 22 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13 వేల గ్రామ పంచాయతీలు ఉంటే ఈ రోజు 17 వేల వైఎస్సార్ జగనన్న కాలనీలు వస్తున్నాయి. కాసేపటి క్రితం ఇక్కడ కాలనీలలో ఇళ్లను చూశా. అవి ఇళ్లు కాదు ఊళ్లు అని గర్వంగా చెబుతున్నా. ఇవాళ్టి వరకు రాష్ట్రవ్యాప్తంగా 7.43 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి మీ బిడ్డగా మీతో ఆనందాన్ని పంచుకుంటున్నా'' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద తొలివిడతగా 7.43 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసిన నేపథ్యంలో సీఎం జగన్ గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో జరిగిన పేదల సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన సభలో లబ్ధిదారులైన మహిళలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

దేవుడిని ఇంతకన్నా ఏం అడగగలను?

మన ప్రభుత్వం అక్క చెల్లెమ్మలకు ఉచితంగా ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో 5.85 లక్షల సాధారణ ఇళ్లు, టిడ్కో కింద మరో 1,57,566 లక్షలు కలిపి మొత్తం సుమారు 7.43 లక్షల గృహాల నిర్మాణాన్ని ఇప్పటివరకు పూర్తి చేశాం. రాష్ట్రవ్యాప్తంగా మరో 14,33,000 ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రతి పేదవాడి ముఖంలోనూ, అక్కచెల్లెమ్మల ముఖంలోనూ చిరునవ్వులు చూస్తున్నాం. దేవుడిని నేను ఇంతకన్నా ఏం అడగగలను? దేవుడు నాచేత పేదింటి అక్కచెల్లెమ్మలకు ఇంత మంచి చేసే అవకాశాన్ని ఇచ్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా.



సభాప్రాంగణం నిండిపోవడంతో బయటే నిలిచిపోయిన అశేష జనవాహినిలో ఓ భాగం

మనసున్న ప్రభుత్వం...

ఇంతకు ముందెప్పుడూ జరగనిది ఈరోజు జరుగుతోందంటే అందుకు కారణం.. కేవలం ముఖ్యమంత్రి మారాడు. ఆనాడు ఉన్న ముఖ్యమంత్రికి, ఈనాడు ఉన్న ముఖ్యమంత్రికి మధ్య తేడా చూడండి. నేడు ఉన్న ముఖ్యమంత్రికి మనసు ఉంది. మీపట్ల అభిమానం, బాధ్యత ఉంది. ఇదొక్కటే గత ప్రభుత్వానికి, మీ బిడ్డకు ఉన్న తేడా. అలాంటి మనసున్న ప్రభుత్వం మనందరిది కాబట్టే ప్రతి అక్కచెల్లెమ్మకూ ఒక శాశ్వత చిరునామా ఉండాలని అనుకున్నా. ఆ శాశ్వత చిరునామా విలువ తెలిసిన ప్రభుత్వంగా నా పాదయాత్రలో చూసిన ప్రతి కష్టానికీ పరిష్కారాన్ని చూపుతూ ఈ 52 నెలలుగా పరిపాలన సాగింది. పేదింటి అక్కచెల్లెమ్మలకు మంచి చేసేందుకు తపనపడుతూ మీ బిడ్డ అడుగులు ముందుకు వేస్తున్నాడు. ఇలాంటి మనసు గత పాలకులకు లేదు. 2014–19 మధ్య చంద్రబాబు పాలన చూస్తే పేదవాడికి ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చిన పాపాన పోలేదు. తేడాను మీరే ఒకసారి గమనించండి.

రాష్ట్రంతో బాబు బంధం ఇదీ..

"ఆ పెద్దమనిషి చంద్రబాబుకు రూ.వేల కోట్ల సంపద ఉన్నా ఆయన ఎమ్మెల్యేగా ఉన్న కుప్పంలో సైతం పేదలకు ఒక్క సెంటు స్థలాన్ని కూడా ఇవ్వలేదు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశాడు. 35 ఏళ్లుగా కుప్పానికి ఎమ్మెల్యేగా ఉన్నాడు. మూడుసార్లు సీఎంగా చేశాడు. ఆయనకు ప్రజల మీద, రాష్ట్రం మీద, చివరికి కుప్పం మీద గానీ అభిమానం, అనురాగం, బాధ్యత లేదు. రాష్ట్రంలో కానీ, కుప్పంలో కానీ ఇల్లు కట్టుకున్న పరిస్థితి లేదు. చంద్రబాబు ఇల్లు పక్క రాష్ట్రం హైదరాబాద్‌లో కనిపిస్తుంది. అదీ ఈ రాష్ట్రంతో ఆ పెద్దమనిషికి ఉన్న అనుబంధం. కుప్పంలో దాదాపు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు, 8 వేల గృహ నిర్మాణాలు ఈరోజు జరిగాయి అంటే అది మీ బిడ్డ ప్రభుత్వంలోనే. పేదవాడి గడపకు మంచి జరిగిందంటే అది మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే"

– సామర్లకోట సభలో సీఎం జగన్

సామర్లకోటలో పేదల కోసం నిర్మించిన ఇళ్లను చూశా. ఆ ఇళ్లను చూసి లే అవుట్‌లో నాన్న గారి విగ్రహాన్ని ప్రారంభించి వస్తున్నప్పుడు ఇక్కడ ఇంటి స్థలం ధర ఎంత ఉందని దొరబాబును (హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్) అడిగా. కేవలం ఇంటి స్థలం విలువ అక్షరాలా రూ.12 లక్షలు పలుకుతోందని దొరబాబు చెప్పాడు. అక్కడ 54 ఎకరాల లేఅవుట్‌లో పేదలకు 2,412 ఇళ్ల స్థలాలిచ్చాం. ఇప్పటికే వెయ్యికిపైగా ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు చేశారు.

రూ.32 వేల కోట్లతో కనీస వసతులు..

రాష్ట్రంలో 21.76 లక్షల గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి పేదవాడికీ ఇచ్చే ఇల్లు కట్టడానికి అయ్యే ఖర్చు రూ.2.70 లక్షలు. ఇందులో రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తూ మరో రూ.35 వేలు పావలా వడ్డీకే రుణాలు వచ్చేటట్టు చేశాం. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నాం. దాని విలువ మరో రూ.15 వేలు ఉంటుంది. సిమెంట్, మెటల్ ఫ్రేమ్స్, స్టీల్ తదితర నిర్మాణ సామగ్రి అంతా కూడా ధర తగ్గించి ఇవ్వడం వల్ల ప్రతి అక్కచెల్లెమ్మకు మరో రూ.40 వేల దాకా మేలు జరుగుతోంది. మొత్తం కలిపి ఒక్కో ఇంటికి రూ.2.70 లక్షలవుతుంది. ఇంటి స్థలం, ఇళ్లు కట్టించి ఇవ్వడంతో పాటు డ్రెయినేజీ, రోడ్లు, నీటి సరఫరా, కరెంట్ సరఫరా లాంటి కనీస వసతుల కోసం మరో రూ.32 వేల కోట్లను ఖర్చు చేస్తున్నాం.

రాక్షసులు యాగాలను భగ్నం చేసినట్లుగా..

ఋషులు, మునులు, దేవతలు మంచి కోసం యజ్ఞం చేస్తుంటే రాక్షసులు భగ్నం చేయడానికి దుర్మార్గంగా కుట్రలు చేస్తారని విన్నాం. అలాగే మనందరి ప్రభుత్వం పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తున్నప్పుడు, అక్కచెల్లెమ్మలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే తపనతో అడుగులు వేస్తున్నప్పుడు ఆ పెద్ద మనిషి చంద్రబాబు వాటిని అడ్డుకుంటూ ఏకంగా కోర్టులకు వెళ్లి కేసులు వేసి ఎన్ని ప్రయత్నాలు చేశారో, ఎన్ని అవరోధాలు తలెత్తాయో మీకు తెలుసు. ఒకవైపు చంద్రబాబు లాంటి దుర్మార్గులు కోర్టుకు వెళ్లి ఆపాలని ప్రయత్నం చేయగా మరోవైపు మీ బిడ్డ ప్రభుత్వం రాగానే కోవిడ్ వచ్చి పడింది. కోవిడ్ కారణంగా రాష్ట్రానికి రెండేళ్ల పాటు రావాల్సిన వనరులు తగ్గిపోయాయి. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు పెట్టాల్సిన ఖర్చు పెరిగిపోయింది. అయినా కూడా మీ బిడ్డ ఎక్కడా సాకులు చెప్పలేదు. కారణాలు వెతకలేదు. మీ బిడ్డ కింద మీదా పడి ఏదో ఒకటి చేశాడు. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే తపనతో అడుగులు వేశాడు. 31 లక్షల ఇళ్ల స్థలాలలో దాదాపు 22 లక్షల ఇళ్లు వేగంగా నిర్మాణంలో ఉన్నాయి. 7.43 లక్షల ఇళ్లు ఇప్పటికే పూర్తయిన పరిస్థితుల మధ్య ఆ సంతోషాన్ని మీ అందరితో పంచుకునేందుకు ఇక్కడికి వచ్చా. నా అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాల కోసం ఎప్పుడూ జరగని విధంగా రాష్ట్రంలో 72 వేల ఎకరాలను సేకరించి 30.75 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వీటి మార్కెట్ విలువ ప్రాంతాన్ని బట్టి ఒక్కో ఇంటి స్థలం కనీసం రూ. 2.5 లక్షలతో మొదలు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల దాకా కనిపిస్తోంది. కనీసం రూ.2.50 లక్షలే అనుకున్నా దాదాపు 31 లక్షల ఇళ్ల పట్టాల రూపంలో సుమారు రూ.75 వేల కోట్లు విలువైన స్థిరాస్తిని నా అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాల రూపంలో ఇవ్వగలిగాం. ఇళ్ల పట్టాలివ్వడమే కాకుండా ఇళ్లు కూడా కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. నాకు ఇంత అదృష్టాన్ని ఇచ్చినందుకు దేవుడికి సదా రుణపడి ఉంటా.

పేదలపై ప్రేమ, బాధ్యతతో 35 కార్యక్రమాలు


ఒక్క ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణమే కాదు.. నవరత్నాల్లోని ఏ పథకాన్ని చూసినా, డీబీటీని తీసుకున్నా అంతే ప్రేమ, బాధ్యతతో అడుగులు వేశాం. అమ్మఒడి, ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకం, అవ్వాతాతలకు పెన్షన్లు, రైతు భరోసా.. ఇలా రాష్ట్రంలో 35 పైచిలుకు కార్యక్రమాలు మన ప్రభుత్వంలో అమలవుతున్నాయి. పేదవాడి మీద ప్రేమతో, వారి జీవితాలు మారాలి, మార్చాలనే తపన, తాపత్రయంతో 52 నెలలుగా అడుగులు వేస్తూ వస్తున్నాం. ఇంతకు ముందున్న ప్రభుత్వం ఏనాడూ ఇలా పేదల మీద ప్రేమ, బాధ్యత చూపలేదు. కాబట్టే మనం అధికారంలోకి వచ్చేటప్పటికి 31 లక్షల కుటుంబాలు అంటే రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి పైగా సొంత ఇళ్లు లేని నిరుపేదలుగా మిగిలిపోయిన పరిస్థితి ఉంది. నాడు కూడా ఇదే రాష్ట్రం, కేవలం సీఎం మాత్రమే మారాడు. ఇవాళ 31 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేశాం.



ముస్తాబైన జగనన్న ఇళ్లు



జగనన్న ఇల్లు

హాల్‌లోని దృశ్యాలు



బెడ్ రూమ్

బాబు ముఖం చూస్తే స్కామ్‌లు గుర్తొస్తాయి

- ఆయన ఎప్పుడైనా వరుసగా ఒక నెల రోజులు రాష్ట్రంలో ఉన్నాడా?: సీఎం జగన్
- 35 ఏళ్లు కుప్పం ఎమ్మెల్యేగా ఉంటూ పేదవాడికి ఒక్క ఇల్లూ కట్టలేదు

సామర్లకోట నుంచి సాక్షిప్రతినిధి: 'చంద్రబాబు ముఖాన్ని చూస్తేనే స్కామ్‌లు గుర్తుకొస్తాయి. ఆయన ముఖం చూస్తే లంచాలు, జన్మభూమి కమిటీలు, గజదొంగల ముఠా పంపకాలు, వెన్నుపోట్లు, పెత్తందారీతనం అహంకారం గుర్తుకొస్తుంది. అదే మీ జగన్‌ను చూస్తే స్కీమ్‌లు గుర్తొస్తాయి. మీ జగన్ ముఖం చూస్తే చిక్కటి చిరునవ్వు కనిపిస్తుంది. లంచాలు లేని డీబీటీ పాలన, నేరుగా బటన్ నొక్కడం, అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి వెళ్లే పాలన కనిపిస్తుంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీరును ఎండగడుతూ చురకలు అంటించారు.

చంద్రబాబు వరుసగా ఒక నెలైనా రాష్ట్రంలో ఉన్నాడా?

ఇంతకుముందు చంద్రబాబు ఇక్కడే (పెద్దాపురంలో) జగన్ ముఖాన్ని చూసి ఎవరైనా ఓట్లు వేస్తారా? అని వ్యాఖ్యానించినట్లు దొరబాబు చెప్పాడు. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చి 52 నెలలు అవుతుంది. ఈ 52 నెలల్లో చంద్రబాబు అనే వ్యక్తి కంటిన్యూస్‌గా ఒక నెల రోజులు ఎప్పుడైనా మన రాష్ట్రంలో కనిపించాడా? ఇప్పుడు మాత్రమే రాజమండ్రిలో కనిపిస్తున్నాడు. ఇంతకు ముందెప్పుడూ కనిపించలేదు. ఆయన ముఖాన్ని చూస్తే స్కామ్‌లు గుర్తుకొస్తాయి. మీ బిడ్డ ముఖాన్ని చూస్తే మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 99 శాతం వాగ్దానాలను నిలబెట్టుకున్న ప్రభుత్వం గుర్తుకొస్తుంది. మీ బిడ్డకు వీళ్ల మాదిరిగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 తోడుగా ఉండకపోవచ్చు. దత్తపుత్రుడి అండ లేకపోవచ్చు. కానీ మీ బిడ్డ వీళ్లను నమ్ముకోలేదు. మీ బిడ్డ అడిగేది ఒక్కటే! మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా ? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మీరే సైనికులుగా నిలబడండి. మీ బిడ్డ చేసిన మంచినే నమ్మాడు. మంచి చేసిన ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నాడు. రాష్ట్ర ప్రజలంతా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఆయనకు (చంద్రబాబు)గానీ, ఆయన్ను సమర్థించే వారికి గానీ వీళ్లెవరికైనా మన రాష్ట్రం మీద ప్రేమ ఉందా? వీళ్లెవరూ మన రాష్ట్రంలో ఉండరు. చంద్రబాబు ఉండడు. ఆయన పార్ట్‌నర్ దత్తపుత్రుడూ ఉండడు. ఆయన కుమారుడూ ఉండడు. ఆయన బావమరిదీ ఉండడు. గజదొంగల ముఠాలో పార్టనర్స్ అయిన ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ5 నాయుడూ ఉండడు. వీళ్లెవరూ మన రాష్ట్రంలో ఉండరు. వీరికి మన రాష్ట్రం, ప్రజలు ఎందుకు కావాలంటే దోచుకోవడానికి, దోచుకున్నది హైదరాబాద్‌లో పంచుకోవటానికే! ఇదీ వీరికి మనరాష్ట్రం మీద ఉన్న ప్రేమ. ఇవన్నీ నిజాలు అవునా? కాదా? (జనం ఒక్కసారిగా పైకి లేచి అవును నిజమే అంటూ బిగ్గరగా నినదించారు)

ఈసారి ఎక్కడికి వెళతాడో?

బాబు దత్తపుత్రుడి స్టోరీ మీ అందరికీ తెలిసిందే. శాశ్వతంగా దత్తపుత్రుడి ఇల్లు హైదరాబాద్‌లోనే. కానీ ఆ ఇంట్లో ఇల్లాలు మాత్రం ప్రతి మూడేళ్లకు, నాలుగేళ్లకు మారిపోతుంటారు. ఒకసారి లోకల్, ఒకసారి నేషనల్, మరోసారి ఇంటర్నేషనల్. మరి తర్వాత ఎక్కడికి పోతాడో? ఆడవాళ్లన్నా, పెళ్లిళ్ల వ్యవస్థ అన్నా ఈ పెద్దమనిషికి ఉన్న గౌరవం ఏమిటనేది అంతా ఆలోచన చేయాలి. మన ఇళ్లలో మన అక్కచెల్లెమ్మలను మనం గౌరవించలేకపోతే, మూడేళ్లకు, నాలుగేళ్లకు ఇల్లాళ్లను మారుస్తుంటే ఏమనుకోవాలి? ఆడవాళ్లపై ఇటువంటి చులకన భావం చూపిస్తుంటే ఎలాంటి నాయకులం మనం? అన్నది ఆలోచన చేయాలి.

ఎప్పుడూ రాని మనిషి రాజమండ్రిలో!

ఈ ప్యాకేజీ స్టార్ హోల్‌సేల్‌గా ఓట్లు అమ్ముకునేందుకు వస్తుంటాడు. మన రాష్ట్రం విషయంలో కూడా అంతే. ఆయన పోటీ చేసి ఓడిపోయిన భీమవరంతో సంబంధం లేదు. గాజువాకతో కూడా అనుబంధం లేదు. కేవలం ఈ నియోజకవర్గాలను ఒక పనిముట్లుగా మాత్రమే చూస్తాడు. యూజ్ అండ్ త్రోగానే భావిస్తాడు. తన అభిమానుల ఓట్లను హోల్‌సేల్‌గా అమ్ముకునేందుకు సినిమాకు, సినిమాకు గ్యాప్ వచ్చినప్పుడు, షూటింగ్‌ల విరామంలో మాత్రమే ఇక్కడికి అప్పుడప్పుడూ వస్తుంటాడు, పోతుంటాడు. ఎప్పుడూ రాని మనిషి ఇప్పుడు మాత్రమే రాజమండ్రిలో కనిపిస్తున్నాడు. నాకు ఆశ్చర్యం అనిపిస్తుంది. సరుకును అమ్ముకునే వాళ్లను చూశాం.. సరంజామా అమ్ముకునే వాళ్లనూ చూశాం. కానీ సొంత పార్టీని, సొంత వర్గాన్ని వేరే వారికి అమ్ముకునే వ్యాపారిని మాత్రం ఇక్కడే ఈ పెద్ద మనిషి రూపంలో చూస్తున్నాం. ఇలాంటి వ్యాపారం చేసే వ్యక్తికి, విలువలు లేని వ్యక్తికి మన రాష్ట్రమైనా, మన ప్రజలైనా, మన కాపులైనా ఏం ప్రేమ, ఆప్యాయత ఉంటుందో ఒక్కసారి ఆలోచన చేయాలి. వాళ్లకు అధికారం కావాల్సింది కేవలం దోచుకోవడానికి, దాన్ని హైదరాబాద్‌లో పంచుకోవడానికి మాత్రమే.

మన మట్టితో ఎలాంటి బంధం లేని మనుషులు..

మన రాష్ట్రంలోని లేని, రాష్ట్రంపై ప్రేమలేని ఇలాంటి మహానుభావులంతా అనుక్షణం ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడతారు. బాబుకు ప్రజలు అధికారం ఇవ్వలేదని వీళ్లంతా కోపంతో ఊగిపోతుంటారు. బాబుకు అధికారం పోయేసరికే వీళ్లందరికీ ఫ్యూజులు పోతాయి. ఎందుకంటే ఆదాయాలు పోతాయి కాబట్టి. మన మట్టితోగానీ, మనుషులతో గానీ, రాష్ట్రంతో గానీ ఏ రకమైన బంధం, అనుబంధం ఈ మనుషులకు లేదు. వీళ్లంతా మనతో చేసేది కేవలం వ్యాపారం మాత్రమే. మన ఎస్సీలను నా ఎస్సీలు అని కూడా వీళ్లు చెప్పుకోలేరు. మన బీసీలను నా బీసీలు అని, మన మైనార్టీలను నా మైనార్టీలు అని కూడా వీళ్లు చెప్పుకోలేరు. కాపులను కూడా నా కాపులు అని కూడా వీళ్లు చెప్పుకోలేరు. మన పేదవాడిని నా పేదవాడు అని చెప్పుకోలేరు. ప్రేమ, అభిమానం, బాధ్యతను వీళ్లు చూపించలేరు. పైపెచ్చు ఎస్సీ కులాల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అని అవహేళన చేస్తారు. బీసీలను తోకలు కత్తిరిస్తా.. ఖబడ్దార్! అంటారు. పేదలకు ఇంగ్లిష్ మీడియం వద్దంటారు. పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందని ఏకంగా కోర్టుల్లో కేసులు వేస్తారు. మన పిల్లల భవిష్యత్ గురించి ఆలోచన చేయరు. మన అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతల గురించి వీరికి పట్టనే పట్టదు. వీరి మనిషి సీఎంగా లేకపోతే అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎంత మంచి చేసినా మంటలు పెట్టి చలి కాచుకోవాలనుకుంటారు. అదే వారి మనిషి సీఎంగా ఉంటే ఎంతటి అన్యాయాలు, దుర్మార్గాలు చేస్తున్నా వీళ్లంతా ఏకమై సమర్థిస్తారు. మన రాష్ట్రంలో లేని వీరందరికీ, మన రాష్ట్రంపై మమకారం లేని వీరందరికీ ఉన్నది ఏమిటంటే ఒక అరడజను టీవీ చానళ్లు, రెండు పేపర్లు, ఎల్లో సోషల్ మీడియా. వీరికి అదనపు సపోర్టు ఒక దత్తపుత్రుడు. ఇలాంటి రాజకీయాలను మనం సమర్థించవచ్చా? అంతా ఆలోచన చేయమని కోరుతున్నా. రాజకీయాలంటే విలువలు, విశ్వసనీయత ఉండాలి. చనిపోయిన తర్వాత కూడా బతకాలనే తపన, తాపత్రయంతో అడుగులు వేయటాన్ని రాజకీయం అని అంటారు. చెప్పాడంటే చేస్తాడని, కష్టమొచ్చినా, నష్టమొచ్చినా తాను నిలబడతాడనే వాడే రాజకీయ నాయకుడు! అటువంటి విలువలు, విశ్వసనీయత వీరికి ఉన్నాయా?

గ్రామ గ్రామాన మార్పులు..

ఈ 52 నెలల్లో మన ప్రభుత్వం ఏం చేసిందో ఎక్కడికి వెళ్లినా కనిపిస్తుంది. ఏ పేదవాడి గడపలో చూసినా కనిపిస్తుంది. ప్రతి పేదవాడి గొంతులోనూ వినిపిస్తుంది. 99 శాతం వాగ్దానాలను మీ బిడ్డ ప్రభుత్వం నిలబెట్టుకుంది. రాష్ట్రంలో 87 శాతం ఇళ్లకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నాం. అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతున్నాయి. ఇలాంటి విప్లవాత్మక మార్పు ఇవాళ మీ బిడ్డ ప్రభుత్వంలో కనిపిస్తోంది. ఇంటి ముంగిటకే వస్తున్న రేషన్ కనిపిస్తుంది. ఇంటి వద్దకే బర్త్ సర్టిఫికెట్లు, క్యాస్ట్ సర్టిఫికెట్లు, ఇన్‌కమ్ సర్టిఫికెట్లను వలంటీర్లు తెచ్చి ఇస్తున్న పాలన కనిపిస్తుంది. ఇవాళ మీ బిడ్డ పాలనలో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. మన కళ్లెదుటే గ్రామాల్లో రైతన్నను చేయి పట్టుకొని నడిపించే ఆర్బీకేలు వచ్చాయి. మంచి చేసే సచివాలయ వ్యవస్థ కనిపిస్తుంది. 'నాడు–నేడు' ద్వారా విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. మన బడులన్నీ ఇంగ్లిష్ మీడియం బడులయ్యాయి. డిజిటల్ బోధన 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్ రూంలో కనిపిస్తోంది. 8వ తరగతి నుంచి పిల్లలకు ట్యాబ్‌లు అందుతున్నాయి. బైజూస్ కంటెంట్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలతో మన పిల్లలు చదువుకుంటున్నారు. అమ్మ ఒడి ఇస్తూ పిల్లల చదువులను ప్రోత్సహిస్తున్నాం. ప్రతి రోజూ మారుతున్న మెనూతో గోరుముద్ద కనిపిస్తోంది. విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన కనిపిస్తున్నాయి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే ఈరోజు కొత్తగా మరో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నాం. ఊరూరా 104, 108 వాహనాలు కనిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ గతంలో వెయ్యి ప్రొసీజర్లకు మాత్రమే ఉంటే ఇప్పుడు 3,300 పైచిలుకు విస్తరించింది. ఆపరేషన్ తర్వాత పేదలు జీవనోపాధికి ఇబ్బంది పడకుండా విశ్రాంతి సమయంలో నెలకు రూ.5 వేల చొప్పున ఆరోగ్య ఆసరా కూడా ఇస్తున్నాం. ఇవాళ గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చాం. ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఇంటిని జల్లెడ పడుతూ పేదవాడికి తోడుగా నిలబడుతోంది మీ బిడ్డ ప్రభుత్వం. పేదల ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం ఇది. రైతన్నలకు, అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకున్న ప్రభుత్వం మీ కళ్లెదుటే కనిపిస్తోంది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రం మొత్తమ్మీద 4 లక్షల ఉద్యోగాలు ఉంటే మీ బిడ్డ నాలుగేళ్ల పాలనలో మరో 2.07 లక్షల కొత్త ఉద్యోగాలిచ్చాం. ఇందులో 80 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ఇచ్చాం. రాష్ట్ర కేబినెట్‌లో 67 శాతం సామాజిక న్యాయం కనిపిస్తోంది. ఆపదలో ఉన్న 30,367 మంది అక్కచెల్లెమ్మలను దిశ యాప్‌తో పోలీస్ సోదరులు రక్షించిన పరిస్థితులను చూశాం. నాలుగేళ్లలో రూ.2.38 లక్షల కోట్లు బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాం. గతంలోనూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్ అయినా చంద్రబాబు హయాంలో ఇవన్నీ ఎందుకు జరగలేదు? అప్పుల గ్రోత్ రేట్ కూడా మీ బిడ్డ హయాంలోనే తక్కువ.

లీడర్ అంటే "దొరబాబు"

- సీఎం జగన్ ప్రశంసలు..

నియోజక వర్గానికి పలు వరాలు

నా పక్కనే తమ్ముడు దొరబాబు ఉన్నాడు. రేపు మీరందరూ ఆశీర్వదిస్తే ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా వస్తాడు. ఎన్నికల్లో పోటీ చేసి ఆ తర్వాత భీమవరం, గాజువాక అడ్రస్ మర్చిపోయిన కొంతమంది నాయకులు, దత్తపుత్రుడి లాంటి వ్యక్తి కాదు దొరబాబు. నిజమైన లీడర్. తాను ఈ నియోజకవర్గం అభివృద్ధి గురించి అడిగాడు. గడప గడపకూ తిరగమని చెప్పా. కేటాయించిన రూ.20 లక్షలు ఖర్చు చేసి సచివాలయం పరిధిలో మంచి చేయమని చెప్పా. ఇంకోసారి తిరగమన్నా. మరోసారి రూ.20 లక్షలు ఇస్తామని చెప్పా. కాండ్రకోట–తూర్పుపాకలు హైలెవల్ బ్రిడ్జి కావాలన్నాడు. దానికి రూ.4 కోట్లు ఖర్చవుతుందన్నాడు. మంజూరు చేస్తున్నా. కాండ్రకోట పరిధిలో డ్రాప్ కమ్ బెడ్ రెగ్యులేటర్ పునర్నిర్మాణం కోసం మరో రూ.6 కోట్లు ఖర్చు అవుతుందన్నాడు. అది కూడా మంజూరు చేస్తున్నా. సామర్లకోట జూనియర్ కాలేజిని డిగ్రీ కాలేజీగా మార్చేందుకు రూ.18 కోట్లు ఖర్చు అవుతుందన్నాడు. అది కూడా మంజూరు చేస్తున్నా.

ఇవి విశేషాలు..




- నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా గురువారం సంప్రదాయబద్ధంగా మొదలైన సామూహిక గృహ ప్రవేశాల వేడుకలకు కాకినాడ జిల్లా సామర్లకోట వేదికగా మారింది. ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీని సందర్శించి సర్వ హంగులతో నిర్మించిన ఇళ్లను సీఎం జగన్ పరిశీలించారు. బండి విశాలి అనే మహిళతో తొలుత గృహ ప్రవేశం చేయించి నూతన పట్టు వస్త్రాలను బహూకరించారు.
- సీఎం తాను ధరించిన పాద రక్షలను బయటే విడిచిపెట్టి కొత్త ఇంటిలోకి వెళ్లి అంతా కలియ తిరిగారు. సుందరంగా తీర్చిదిద్దుకున్న ఇంటిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. మిరియాల నరసరత్నం ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో కూడా పాల్గొని పట్టు వస్త్రాలు అందచేశారు.
- లే అవుట్‌లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఏర్పాటు చేసిన వైఎస్సార్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని రిమోట్ బటన్ నొక్కి సీఎం జగన్ ఆవిష్కరించారు. గృహ నిర్మాణాలపై ఏర్పాటైన ఎగ్జిబిషన్‌ను తిలకించారు.
- సీఎం రాక సందర్భంగా ఇసుక వేస్తే రాలనంత మందితో పెద్దాపురం–సామర్లకోట, సామర్లకోట–కిర్లంపూడి రోడ్లు కిక్కిరిసిపోయాయి. ముఖ్యమంత్రి సభా స్థలికి చేరుకోవడానికి అరగంట ముందుగానే జూనియర్ కాలేజీ ప్రాంగణంలో గ్యాలరీలు జనంతో నిండిపోయాయి. రహదారులకు ఇరువైపులా మహిళలు పూలవర్షంతో సీఎంకు స్వాగతం పలికారు.



- కార్యక్రమంలో మంత్రులు జోగి రమేష్, సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, వంగా గీతవిశ్వనాథ్, మార్గాని భరత్, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, భూదాన్ బోర్డు చైర్మన్ తాడి విజయభాస్కరరెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

– సామర్లకోట నుంచి సాక్షి ప్రతినిధి

కరెంటుంది.. కోతల్లేవు



ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో భారీగా విద్యుత్ డిమాండ్

వ్యవసాయానికి ఖచ్చితంగా 9 గంటలు విద్యుత్ సరఫరా

ఫలితంగా గ్రిడ్ లో ఫ్రీక్వెన్సీ అప్పుడప్పుడూ హెచ్చుతగ్గులు

దక్షిణ భారత లోడ్ డిస్పాచ్ సెంటర్ ద్వారా ఆటోమాటిక్ లోడ్ షెడ్డింగ్

బుధవారం రూ.62.554 కోట్లతో 69.789 మిలియన్ యూనిట్లు కొనుగోలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోటుపాట్లు లేవు. గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కరెంటు కోతలు లేవు. రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్తు అందుతోంది. అయినా ఈనాడు పత్రిక 'రైతులకు జగన్ షాక్' అంటూ ఓ పసలేని కథ అచ్చేసింది. రైతులను అనవసర ఆందోళనకు గురిచేసేలా తప్పుడు కథనాన్ని ఇచ్చింది. ఈ కథనాన్ని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీ తేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు ఖండించారు. వ్యవసాయానికి 9 గంటల పాటు కచ్చితంగా ఉచిత విద్యుత్‌ను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈనాడు గురువారం ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమని చెప్పారు. గ్రామాల్లో రోజుకి నాలుగైదు గంటలు మించి కరెంటు అందడంలేదన్నది పచ్చి అబద్ధమని, అనధికార కోతలు విధిస్తున్నారన్నదీ అవాస్తవమేనని తెలిపారు. అన్నదాతలకు రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా విషయంలో ఎటువంటి రాజీ లేదని,. ఒకవేళ ఏదైనా అత్యవసర పరిస్థితి వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే అదే రోజు మరొక సమయంలో భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. 'సాక్షి' ప్రతినిధికి సీఎండీలు వెల్లడించిన వివరాలు..

- గ్రిడ్ లో ఏర్పడే ఫ్రీక్వెన్సీ హెచ్చు తగ్గులను అదుపు చేయడానికి దక్షిణ భారత లోడ్ డిస్పాచ్ సెంటర్ (బెంగళూరు) ఆదేశాలతో ఆటోమాటిక్ లోడ్ షెడ్డింగ్ విధానం అప్పుడప్పుడు అమల్లోకి వస్తుంటుంది. వెంటనే సంబంధిత విద్యుత్ సంస్థల ఇంజనీర్లు పరిస్థితిని అదుపు చేసి సరఫరాలో అంతరాయం లేకుండా చేయడానికి కృషి చేస్తున్నారు.
- ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ అక్టోబర్ నెలలో రోజుకు 210 నుంచి 215 మిలియన్ యూనిట్లు ఉండాల్సిన విద్యుత్ వినియోగం దాదాపు 245 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గతేడాది ఇదే సమయానికి సరాసరి రోజువారీ వినియోగం 170 నుంచి 180 మిలియన్ యూనిట్లు ఉండేది. బుధవారం రాష్ట్రంలో 234 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఇది గతేడాది కంటే 37 శాతం ఎక్కువ. తక్కువ వర్షపాతం వల్ల తగినంత సాగు నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగం అంచనాలకు మించి పెరిగిపోయింది.వాతావరణ మార్పుల వల్ల పవన విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేదు. ఈ కారణాలతో రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌పై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది.
- ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సరఫరా గ్రిడ్ డిమాండ్‌కు అనుగుణంగా నిలకడగా ఉంది. ఏ విధమైన ఒడిదొడుకులు ఏర్పడినా పరిస్థితిని సరిదిద్దడానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎంత ఖర్చయినా వెనుకాడకుండా స్వల్పకాలిక మార్కెట్‌లో విద్యుత్ కొని, సరఫరా చేయడానికి డిస్కంలు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని విద్యుత్ కొరత ఏర్పడే సమయాల్లో అత్యవసరంగా మార్కెట్ కొనుగోళ్లకు వెళ్తున్నాయి. బహిరంగ మార్కెట్ నుంచి బుధవారం యూనిట్ సగటు రేటు రూ.8.963 చొప్పున రూ.62.554 కోట్లతో 69.789 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేశాయి.
- మన రాష్ట్రంలో విద్యుత్ కొరత పరిస్థితులు లేవు. బీహార్‌లో 7.60 మిలియన్ యూనిట్లు, ఉత్తరప్రదేశ్‌లో 5.73 మిలియన్ యూనిట్లు, కర్ణాటకలో 4.40 మిలియన్ యూనిట్లు, రాజస్థాన్‌లో 3.10 మిలియన్ యూనిట్లు, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లో 47.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉంది. కానీ మన రాష్ట్రంలో ఈ లోటు సున్నాగా ఉంది.

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ (మిలియన్ యూనిట్లలో)

ఏపీ జెన్‌కో థర్మల్	సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్లు	పవన విద్యుత్
65.752	33.636	3.761
ఏపీ జెన్‌కో హైడల్	ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్లు	సౌర విద్యుత్
5.662	35.994	19.763
ఏపీ జెన్‌కో సోలార్ 2.246		

బీజేపీని 'బావ' సారూప్య పార్టీగా మార్చిన పురందేశ్వరి



- అవినీతి మరిదికి శిక్ష పడకుండా కాపాడుకోవటమే ఆమె లక్ష్యం
- పురందేశ్వరీ.. మీ చుట్టం చట్టాన్ని ఉల్లంఘించాడు
- చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడు
- 13 సార్లు సంతకం కూడా పెట్టాడు
- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి విమర్శ

సాక్షి, అమరావతి: జాతీయ పార్టీ అయిన బీజేపీని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి 'బావ' సారూప్య పార్టీగా మార్చేశారని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి విమర్శించారు. 'అమ్మా పురందేశ్వరీ.. మీ చుట్టం చట్టాన్ని ఉల్లంఘించారు. మీ మరిది చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారు. 13 సార్లు సంతకం కూడా పెట్టారు. అయినా ఆయనకు చట్టం వర్తింపజేయటానికి వీల్లేదని మీరు ఢిల్లీలో క్యాంపెయిన్ చేస్తున్నారు. ఒక తప్పుడు ఒప్పందంతో స్కిల్ స్కాం చేశారని కేంద్ర ఈడీ కొందరిని అరెస్ట్ కూడా చేసింది. ఆ ఒప్పందం ఫేక్ అని, దానితో సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ కూడా ధ్రువీకరించింది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకున్న తరువాతే న్యాయస్థానం చంద్రబాబు అరెస్టును సమర్థించి, రిమాండ్ విధించింది. బాబు అరెస్ట్, రిమాండ్ సరికాదన్న వాదనల్ని హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా తిరస్కరించాయి' అని ఆయన ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. 'సాక్షాత్తు మీ మరిది చంద్రబాబు ఆ డబ్బును షెల్ కంపెనీల ద్వారా ఎలా రూట్ చేశారో ఆయన పీఏనే వెల్లడించినట్లు ఐటీ శాఖ నిర్ధారించింది. ఒక చిన్న కేసులో ఏకంగా రూ.119 కోట్ల ముడుపుల్ని నిర్ధారిస్తూ ఐటీ శాఖ మీ మరిది చంద్రబాబుకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ్ లూథ్రా, హరీష్ సాల్వే చంద్రబాబు కోసం చేసిన వాదనల్ని న్యాయస్థానాలూ తిరస్కరిస్తున్నాయి కాబట్టి, 'బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్' అన్న విధంగా మీ మరిది కోసం మీరు రంగంలోకి దిగారు. అన్ని ఆధారాలు కనిపిస్తుంటే దీన్ని రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు అని అబద్ధం చెపుతూ, లోకేశ్‌ని వెంటబెట్టుకుని బాబు తరపున మధ్యవర్తిత్వం చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని కలిశారు. ఇంతకీ మీరు టీడీపీలో ఉన్నారా? బీజేపీలో ఉన్నారా? మీరు గతంలో కాంగ్రెస్‌లో ఉన్నా ఇప్పుడు బీజేపీలో ఉన్నానని అంటున్నా మీ టాప్ ప్రయారిటీ మీ అవినీతి మరిదికి శిక్ష పడకుండా కాపాడుకోవటమే అని బాగా నిరూపిస్తున్నారు' అని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలో టెక్ మహీంద్రా స్టార్ హోటల్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం సహా మూడు ప్రాంతాల్లో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మించేందుకు మహీంద్రా హాలిడేస్ చైర్మన్, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నాని సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆయన గురువారం సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. స్టార్ హోటల్స్ ఏర్పాటు గురించి సీఎం జగన్‌కు ఆయన వివరించారు. ఒక్కో హోటల్ నిర్మాణానికి రూ.250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.పర్యాటక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రోత్సాహకాల గురించి సీఎం జగన్ వివరించారు. విశాఖ సహా 3 పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటల్స్ నిర్మాణం చేపట్టనున్నామని.. వచ్చే 2 నెలల్లో శంకుస్థాపన చేపడతామని మహీంద్రా ప్రతినిధులు వెల్లడించారు. మహీంద్రా గ్రూప్ గ్లోబల్ హెడ్, అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ సీవీఎస్ వర్మ, క్లబ్ మహీంద్రా సీవోవో సంతోష్ రామన్, టెక్ మహీంద్రా విజయవాడ అడ్మిన్ మేనేజర్ బిరుదుగడ్డ జయపాల్ పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలపై వక్రభాష్యాలు

- బైజూస్, టోఫెల్‌పై ఎల్లో మీడియా, ప్రతిపక్షాల దుష్ప్రచారం
- మంత్రి బొత్స సత్యనారాయణ ఫైర్
- 35 లక్షల మందికి విద్యార్థులకు ఉచితంగా బైజూస్ కంటెంట్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యా సంస్కరణలపై రాజకీయ విష ప్రచారం జరుగుతోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పేదింటి బిడ్డలను అంతర్జాతీయ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంటే.. ఎల్లో మీడియా, విపక్షాలు విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వక్రభాష్యం పలుకుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఎల్లో మీడియా రాతల ఆధారంగా సెలబ్రిటీ పార్టీ (జనసేన) టోఫెల్ శిక్షణపై కాకిలెక్కలతో బహిరంగ లేఖ విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. సచివాలయంలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. బైజూస్, టోఫెల్‌పై ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయి. బహిరంగ లేఖ రాసే ముందు కొంచెమైనా వాస్తవాలు ధ్రువీకరించుకోవాలి. దావోస్ పర్యటనలో భాగంగా ఏపీ విద్యా సంస్కరణల్లో సీఎం జగన్ విజన్ నచ్చి.. బైజూస్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఉచితంగా కంటెంట్ అందించేందుకు ముందుకొచ్చింది. బైజూస్ ఒప్పందంలో ఎక్కడా ఆర్థిక లావాదేవీలకు చోటులేదు. ఆ తర్వాత 5.18 లక్షల ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్‌ను ఇన్‌స్టాల్ చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా అందించాం. దీనివల్ల 35 లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

3,295 అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్..

ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపక పోస్టులను భర్తీచేస్తున్నాం. వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో కలిపి మొత్తం 3,295 అధ్యాపక పోస్టులకు సోమవారం నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది. డీఎస్సీపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇక ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధి కోసమే సీఎం జగన్ విశాఖ కేంద్రంగా ఉంటూ పర్యవేక్షించడానికి సన్నాహాలు చేస్తున్నారు. రాయలసీమ అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. వచ్చే ఉగాదికి టీడీపీ, సెలబ్రిటీ పార్టీ రాష్ట్రంలో వాష్ అవుట్ అవడం ఖాయం. ఇక లోకేశ్, పురందేశ్వరి కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసి తమ బాధలు చెప్పుకోవడంలో తప్పేముంది. వాళ్ల కలయిక మా పార్టీకి చర్చనీయాంశం కాదు.

ఒక్కో విద్యార్థికి టోఫెల్ టెస్టు ఫీజు రూ.7.50 మాత్రమే..

విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధనతో పాటు ప్రాథమిక స్థాయి నుంచే స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పెంచేలా టోఫెల్ పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఇందుకోసం అంతర్జాతీయ సంస్థ ఈటీఎస్ (ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసు)తో ఒప్పందం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లోని 3–9వ తరగతి విద్యార్థులకు టోఫెల్ ప్రైమరీ, జూనియర్ శిక్షణ ఇస్తున్నాం. ప్రైమరీలో 6.31లక్షలు, జూనియర్‌లో 14.39లక్షల మంది విద్యార్థులు కలిపి మొత్తం 20.70 లక్షల మందికి శిక్షణ ఇస్తున్నాం. ఒక్కో విద్యార్థికి ఆన్‌లైన్ టెస్టు ఫీజు కింద కేవలం రూ.7.50 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందుకు రూ.1.50 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. ఇందులో అర్హత సాధించిన వారిలో ఆ తర్వాతి దశలో ప్రైమరీ, జూనియర్ విభాగాల్లో 40వేల మంది చొప్పున మాత్రమే ఓరల్ టెస్టు (సర్టిఫికేషన్)కు హాజరవుతారు. వీరికి టోఫెల్, ఏపీ ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికేషన్ కోసం రూ.600 చెల్లిస్తాం. ఇందుకు రూ.4.80 కోట్లు వెచ్చిస్తున్నాం. ఈ లెక్కన తొలి ఏడాది రూ.6.35 కోట్లు మాత్రమే టోఫెల్ శిక్షణకు ఖర్చుచేస్తున్నాం. కానీ, ఎల్లో మీడియా, సెలబ్రిటీ పార్టీ మాత్రం ఏ లెక్కన రూ.వెయ్యికోట్లు అవుతుందని రాస్తున్నారో చెప్పాలి.

2027–28 నాటికి రూ.145కోట్లే ఖర్చు..

ఇక విద్యార్థులకు టోఫెల్‌లో రెండో ఏడాది నుంచి జూనియర్ స్పీకింగ్ టెస్టు ఉంటుంది. ఇందుకు రూ.2,500 చెల్లిస్తాం. 5వేల విద్యార్థులతో స్పీకింగ్ టెస్టు మొదలుపెట్టి ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచుతాం. ఇంతచేసినా 2027–28 నాటి కి టోఫెల్ శిక్షణకు రూ.145 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. అలాగే, తమ ప్రభుత్వంలో నాణ్యమైన ఇంటరాక్టీవ్ ప్యానల్‌ను రూ.1.25లక్షలకు కొనుగోలు చేయగా.. టీడీపీ హయాంలో రూ.3 లక్షల నుంచి రూ.4లక్షలు వెచ్చించినప్పుడు ఎల్లో మీడియా ఎందుకు మాట్లాడలేదు.

అమెరికాలో అలా.. ఆసియాలో ఇలా?

జన్యు, వాతావరణ సంబంధిత వైవిధ్యతపై శాస్త్రవేత్తల దృష్టి

- అమెరికాలో ఊబకాయుల్లో టైప్ 2 మధుమేహం
- భారత్ లాంటి దేశాల్లో సన్నగా ఉన్నా సోకుతున్న వ్యాధి
- జన్యువుల పైభాగంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్లే ఈ తేడాలు
- ఈ పరిస్థితిని అధిగమించడం, వ్యాధి ముప్పును తగ్గించడం లక్ష్యంగా 'డీప్' ప్రాజెక్టు
- అందరికీ సమర్థంగా ఉపయోగపడే మందుల తయారీకి దోహదం!



సాక్షి, హైదరాబాద్: మధుమేహంతో పాటు గుండెజబ్బులు, మానసిక ఆరోగ్య సమస్యలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ పెరుగుతున్నాయి. మరి ముఖ్యంగా భారత్ ఇతర ఆసియా దేశాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. కానీ వ్యాధి సోకడం, లక్షణాల వంటివి ప్రాంతాన్ని బట్టి మారిపోతున్నాయి. మధుమేహాన్ని తీసుకుంటే టైప్ 2 మధుమేహం అమెరికా లాంటి దేశాల్లో ఊబకాయం ఉన్నవారిలో కన్పిస్తుంది. కానీ భారత్‌లాంటి కొన్ని దేశాల్లో బక్కపలుచగా ఉన్నప్పటికీ దీనిబారిన పడుతున్నారు. అందరిలోనూ జన్యువులు ఒకే రకంగా ఉన్నప్పటికీ జన్యువుల పైభాగంలో వాతావరణం, సూక్ష్మ పోషకాల లోపం వల్ల చోటు చేసుకుంటున్న కొన్ని మార్పుల కారణంగా ఈ తేడాలు చోటు చేసుకుంటున్నట్లు తేలింది. మరోవైపు వీటి కోసం తయారు చేసిన ఔషధాలు ఒక ప్రాంతంలో పనిచేస్తే మరొక ప్రాంతంలో పని చేయడం లేదు. మధుమేహంతో పాటు గుండె జబ్బులు, మానసిక సమస్యలకు పైన పేర్కొన్న తేడాలు కారణమవుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, అందరికీ సమర్థంగా ఉపయోగపడే మందులు కనిపెట్టేలా, మానవజాతి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ఓ మహా ప్రయత్నం మొదలైంది. భారత్ సహా నాలుగు దేశాల్లోని 13 వేల మంది నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా వ్యాధి ముప్పును తగ్గించే ప్రాజెక్టుకు శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. డైవర్స్ ఎపిజెనిటిక్, ఎపిడిమియాలజీ పార్ట్‌నర్‌షిప్ (డీప్) అని పిలుస్తున్న ఈ అంతర్జాతీయ ప్రాజెక్టులో ఇరవై పరిశోధక బృందాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరవై సంస్థలు భాగస్వాములు కానున్నాయి.

ఇప్పటివరకు 'యూరప్' సమాచారమే ఆధారం

ప్రజారోగ్యం విషయంలో ఇప్పటివరకూ జరిగిన పరిశోధనలకు అత్యధికంగా యూరోపియన్ మూలాలున్న మానవుల నుంచి సేకరించిన సమాచారమే ఆధారం. అంటే ఆరోగ్య సమస్యల పరిశోధనల్లో ఇతర ప్రాంతాల వారి భాగస్వామ్యం చాలా తక్కువన్నమాట. అంతేకాకుండా జన్యుపరమైన, వాతావరణ సంబంధిత వైవిధ్యతను కూడా ఇప్పటివరకూ పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. కొంచెం వివరంగా చెప్పాలంటే మన జన్యువులు, మనం ఉన్న వాతావరణం ప్రభావం.. మనకొచ్చే వ్యాధులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఇప్పటివరకూ స్పష్టంగా తెలియదన్నమాట. కాగా 'డీప్' ప్రాజెక్టు ఈ లోటును భర్తీ చేస్తుందని అంచనా వేస్తున్నారు. దాదాపు రూ.25 కోట్ల ఖర్చుతో ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టు కొనసాగనుంది. సీసీఎంబీ నేతృత్వంలో యూకేలోని బ్రిస్టల్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్,, ఎంఆర్‌సీ యూనిట్, ద గాంబియాలు ఇందులో పాల్గొననున్నాయి. అధ్యయనంలో భాగంగా కొన్ని వ్యాధులు కొన్ని ప్రాంతాల వారికి లేదా సమూహాలకు మాత్రమే ఎందుకు వస్తాయన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. దీనిద్వారా ఒక ప్రాంత ప్రజల కోసం తయారు చేసిన మందులు ఇతర ప్రాంతాల వారికీ సమర్థంగా ఉపయోగపడతాయా? లేదా? అన్నది స్పష్టమవుతుందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహిస్తున్న శాస్త్రవేత్త ఆర్.గిరిరాజ్ ఛాందక్ తెలిపారు.

సీసీఎంబీ ఎప్పుడో చెప్పింది...

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) చాలాకాలంగా భారతీయుల జన్యు నిర్మాణంలోని తేడాలు.. టైప్–1, టైప్–2 మధుమేహం, క్లోమగ్రంథి వ్యాధులపై వాటి ప్రభావం గురించి పరిశోధనలు చేస్తోంది. విటమిన్ బీ–12, ఫొలేట్ తదితర సూక్ష్మ పోషకాలు, పర్యావరణాలు.. వ్యాధులు సోకేందుకు ఉన్న అవకాశాలపై ప్రభావం చూపుతున్నట్లు కూడా సీసీఎంబీ నిరూపించింది. పర్యావరణం నుంచి అందే సంకేతాల ఆధారంగా డీఎన్ఏలో వచ్చే కొన్ని రకాల మార్పులు మనిషి ఆరోగ్యం, వ్యాధులకు కారణమవుతున్నట్టుగా కూడా సీసీఎంబీ ప్రయోగాత్మకంగా రుజువు చేసింది. అంటే ఇప్పటివరకూ జరిగిన పరిశోధనలన్నీ యూరోపియన్లపై ఆధారపడి జరిగినవి కావడంతో వారికి పనిచేసే మందులు, చికిత్స పద్ధతులు కచ్చితంగా మనకూ పనిచేస్తాయన్న గ్యారెంటీ లేదన్నమాట. అలాగే మనకు పనిచేసే మందులు బ్రిటిష్ వారికి లేదా అమెరికన్లను అక్కరకు వస్తాయా? అన్నది కూడా ప్రశ్నార్థకమే అన్నమాట.

భారతీయులకూ భాగస్వామ్యం

జన్యువులు – జన్యువులకు మధ్య, జన్యువులకు పర్యావరణానికి మధ్య జరుగుతున్న కార్యకలాపాలు అర్థం చేసుకునేందుకు మధుమేహం, గుండెజబ్బుల వంటి అసాంక్రమిక వ్యాధులకూ వీటికి ఉన్న సంబంధాలను అర్థం చేసుకునేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టులో భారతీయులను కూడా చేర్చుకోవడం ఎంతో ఆసక్తికరమైన అంశం.

– డాక్టర్ ఆర్.గిరిరాజ్ ఛాందక్, 'డీప్' ప్రాజెక్ట్ హెడ్

మాన్యువల్‌గా కొలతలు తీసుకునేలా ఆదేశాలివ్వాలి

హైకోర్టులో ఎస్ఐ అభ్యర్థులు.. తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: ఎస్ఐ నియామక ప్రక్రియలో భాగమైన శారీరకదారుఢ్య పరీక్షకు సంబంధించిన అభ్యర్థుల ఛాతి, ఎత్తును డిజిటల్ మీటర్‌తో కొలవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డిజిటల్ మీటర్‌తో కొలవడం వల్ల పెద్ద సంఖ్యలో అనర్హులయ్యారని, మాన్యువల్‌గానే కొలతలు తీసుకునేలా పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించాలని వారు కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత గురువారం విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టుకున్న నగదు, వస్తువులు రూ.37కోట్లపైనే!

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు
- రూ.20కోట్లపైన నగదు, రూ.14 కోట్లపైన బంగారం, వజ్రాలు, వెండి స్వాధీనం
- మరో రూ. మూడు కోట్లపైన ఇతర వస్తువులు పట్టివేత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చినప్పటి నుంచీ పెద్ద ఎత్తున నగదు, బంగారం, మద్యం, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. మొత్తంగా 1,196 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపింది. తనిఖీల కోసం 89 అంతర్రాష్ట్ర సరిహద్దులు, 169 ఇతర రాష్ట్రాలతో ఉన్న సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని వివరించింది. ఇప్పటివరకు కమిషన్ నేతృత్వంలో సాగిన నిఘా, స్వాధీనాలు, కేసుల వివరాలను వెల్లడించింది. ఆ వివరాల మేరకు.. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.20,43,38,375 నగదును, రూ.14,65,50,852 విలువైన బంగారం, వెండి, వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.86,92,533 విలువైన 31,730 లీటర్ల మద్యం, వెయ్యి కిలోల నల్లబెల్లం, 501 కిలోల అల్లం స్వాధీనం చేసుకున్నారు. రూ.89,02,825 విలువైన 310 కిలోల గంజాయిని తనిఖీల్లో పట్టుకున్నారు. ప్రలోభాలకు గురి చేసేందుకు తరలిస్తున్నారనే అనుమానంతో 7,040 కిలోల బియ్యం, 440 చీరలు, 80 కుట్టు మెషీన్లు, 87 కుక్కర్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.22,51,963. మొత్తంగా నగదు, వస్తువులన్నీ కలిపి విలువ రూ.37,07,36,548 అని కమిషన్ గుర్తించింది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనపై 34,388 కేసులు నమోదు చేసినట్టు ఈసీ తెలిపింది.

- గురువారం హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.33.55 లక్షలను, జూబ్లీహిల్స్‌లో మణిపూర్‌కు చెందిన మహిళ నుంచి రూ. 5.50 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ ప్రాంతంలో చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.5లక్షల నగదు, అమీర్‌పేటలో మరొకరి నుంచి రూ.9.9లక్షలను, మియాపూర్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి 448.96 గ్రాముల బంగారు ఆభరణాలను సీజ్ చేశారు.
- నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురంలో చేపట్టిన వాహన తనిఖీల సందర్భంగా ఎలాంటి పత్రాలు చూపకుండా తరలిస్తున్న రూ.30లక్షల నగదును సీజ్ చేశారు.

నేడు విశాఖకు ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రోడక్ట్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు సోనియా దుహానా, ఆకాంక్ష శుక్రవారం విశాఖలో పర్యటించి జిల్లా నుంచి వన్ ప్రొడెక్ట్‌గా ఎంపికైన సీ ఫుడ్ క్లస్టర్‌ని పరిశీలిస్తారు. విశాఖ కంటైనర్ టెర్మినల్, ఫిషింగ్ హార్బర్, సీఎంఎఫ్ఆర్ఐ, హేచరీస్, ష్రింప్ ప్రాసెసింగ్ యూనిట్‌లను సందర్శిస్తారు. అలాగే బీచ్‌రోడ్డులో కేంద్రం సహకారంతో నిర్మించనున్న యూనిటీ మాల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తారని జిల్లా చేనేత, జౌళి పరిశ్రమల శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

వీసీల నియామక జీవోల అమలు నిలుపుదల

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు


సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీతో పాటు శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీ నియామకానికి సంబంధించిన జీవోల అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వీసీల నియామకాలకు సంబంధించిన విధి విధానాలతో ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ డాక్టర్ పి.నర్సింహరావు, మహ్మద్ హఫీజ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై గురువారం జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది గొట్టిపాటి కవిత వాదనలు వినిపిస్తూ.. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీల నియామకం విషయంలో ప్రభుత్వం నిబంధనలను అనుసరించలేదన్నారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. సెర్చ్ కమిటీని ఏర్పాటు చేయలేదని తెలిపారు. అంతేకాక యూనివర్సిటీ బోర్డును సైతం ఏర్పాటు చేయలేదన్నారు. అందువల్ల రెండు విశ్వవిద్యాలయాల వీసీల నియామక జీవోల అమలును నిలుపుదల చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి జీవోల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

ఎమ్మెల్యే గొట్టిపాటి బంధువు క్వారీల్లో ఐటీ సోదాలు

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని జొన్నతాళి గ్రామం సమీపంలోని ఓ ప్రముఖ వ్యాపారికి చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీలో గురువారం ఆదాయపన్ను శాఖ (ఐటీ) అధికారులు సోదాలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మామ అయిన కామేపల్లి సుబ్బారావు సమీప బంధువు కామేపల్లి లక్ష్మీప్రసాద్‌కు జొన్నతాళి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో గ్రానైట్ క్వారీలున్నాయి. ఈ క్రమంలో విజయవాడ నుంచి వచ్చిన విజిలెన్స్, ఆదాయపన్ను, రెవెన్యూ అధికారులు గురువారం గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలతో పాటు గుంటూరులోని లక్ష్మీప్రసాద్‌కు చెందిన మూడు ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేశారు. ఈ సమయంలో దూరప్రాంతంలో ఉన్న లక్ష్మీప్రసాద్‌ను అధికారులు ఫ్యాక్టరీకి పిలిపించి సమాచారం సేకరించారు. అధికారులు రెండురోజులుగా ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచి ఈ సోదాలు చేసినట్లు తెలిసింది.

బీచ్ ఐటీ డెస్టినేషన్‌ను ప్రమోట్ చేస్తున్నాం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: ఐటీ అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ విశాఖలో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్న ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి మంత్రి అమర్‌నాథ్, సందర్శించారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ డా.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ డా.సాయికాంత్‌వర్మ, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ఐటీ సెజ్ హిల్ నం.2లో 16న ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని సీఎం జగన్ ప్రారంభించి కంపెనీ ఉద్యోగులతో మాట్లాడతారని చెప్పారు. విశాఖలో ఐటీ సంస్థల్ని ఆకర్షించేందుకు బీచ్ ఐటీ డెస్టినేషన్‌ని ప్రమోట్ చేస్తున్నామన్నారు. 1,000 మందితో ప్రారంభించి 3,000 మంది వరకు ఉద్యోగుల సంఖ్యని పెంచేదిశగా ఇన్ఫోసిస్ సంస్థ పయనించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రభుత్వ తరపున కావాల్సిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ రాకతో.. మిగిలిన పెద్ద సంస్థలన్నీ విశాఖలో తమ శాఖల్ని విస్తరింపజేసే ఆలోచనలో ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో పెద్ద ఎత్తున అభివృద్ధి సాధించిందని, దానికి దీటుగా విశాఖ నగరాన్ని కూడా ఈ రంగంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని సీఎం వైఎస్ జగన్ భావిస్తున్నారని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న ఇన్ఫోసిస్ కంపెనీలలో విశాఖకు చెందిన నాలుగు నుంచి ఐదు వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వారిని విశాఖ కార్యాలయానికి బదిలీ చేస్తే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని ఇన్ఫోసిస్ యాజమాన్యం భావిస్తోందన్నారు. హిల్ నెం.2లో జరుగుతోన్న హెలిప్యాడ్ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు.

గాదె ఇన్నయ్య అరెస్టుతో కలకలం

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆందోళనలో కుటుంబ సభ్యులు, అనాథాశ్రమ పిల్లలు

జఫర్‌గఢ్: టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) వ్యవస్థాపకుల్లో ఒకరైన గాదె ఇన్నయ్య అరెస్టు కలకలం రేపింది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సాగరం గ్రామానికి చెందిన 'మా ఇల్లు ప్రజాదరణ అనాథాశ్రమం' వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్యను బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని నారాయణగూడ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, అనాథాశ్రమ పిల్లలు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల నుంచి గాదె ఇన్నయ్య 'భారత్ బచావో' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అరెస్టు కావడం అనుమానాలకు తావిస్తోంది. ఇన్నయ్యను అరెస్టు చేసింది రాష్ట్ర పోలీసులా? కేంద్ర దర్యాప్తు సంస్థలా అనేది తెలియాల్సి ఉంది. ఇన్నయ్య విద్యార్థి దశలోనే రాడికల్ విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. అనంతరం పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరారు. ఉద్యమం నుంచి బయటకు వచ్చిన అనంతరం ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి హైదరాబాద్‌లోని జలదృశ్యం కార్యాలయంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీని స్థాపించారు. ఆ తరువాత కేసీఆర్‌తో ఏర్పడిన విభేదాలతో ఉద్యమ పార్టీ నుంచి బయటకు వచ్చిన ఇన్నయ్య.. తెలంగాణ రాష్ట్ర పార్టీని ఏర్పాటు చేసి ఉద్యమం కొనసాగించారు. ఈ క్రమంలో మళ్లీ జైలుకు వెళ్లారు. విడుదలైన అనంతరం జఫర్‌గఢ్ మండలంలోని రేగడితండా గ్రామ శివారు టీబీతండా వద్ద 2006 మే 28న 'మా ఇల్లు అనాథ అశ్రమం' నెలకొల్పారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తన గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలోనే 'భారత్ బచావో' కార్యక్రమాన్ని చేపడుతున్న ఇన్నయ్యను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఆయన నివాసముంటున్న న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

రాత్రివేళలో జాగరణ (తహజ్జుద్) నమాజ్ చెయ్యి : ఇది నీ కొరకు అదనపు (నఫిల్) నమాజ్. దీనితో నీ ప్రభువు నిన్ను (పునరుత్థాన దినమున) ప్రశంస నీయమైన స్థానము (మఖామమ్ మహ్మూద్) నొసంగవచ్చు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 13 అక్టోబర్ 2023

ఇంకెప్పటికి మారతాం?!

ఆ కేంద్రపాలిత ప్రాంతం మొత్తంలో ఏకైక మహిళా ఎమ్మెల్యే ఆమె. అక్కడి ప్రభుత్వంలో ఉన్న ఒకే ఒక్క మహిళా మంత్రి కూడా ఆమే! తీరా, అలాంటి వ్యక్తి కూడా తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందంటే ఏమనాలి? మామూలు పరిస్థితుల్లో రాజీనామా చేయడం కాదు... లింగ, కుల దుర్విచక్షణల్ని తట్టుకోలేక రాజీనామా చేశానంటున్నారు. ఆ ఆరోపణలు దిగ్భ్రమ కలిగిస్తున్నాయి. పుదుచ్చేరిలోని ఏకైక దళిత, మహిళా ఎమ్మెల్యే సి. చంద్ర ప్రియాంక ఒక్కసారిగా వార్తల్లో వ్యక్తిగా మారారు. అయితే, ఆమె అసమర్థత రీత్యానే పదవి నుంచి తప్పించామని అధికార కూటమి అంటోంది. ఏమైనా, ఈ మహిళా మంత్రి రాజీనామా ఉదంతం స్త్రీలు, వెనుకబడిన కులాల పట్ల మన వ్యవస్థలోని చిన్నచూపును మరోసారి చర్చకు పెడుతోంది.

దాదాపు 40 ఏళ్ళ విరామం తర్వాత పుదుచ్చేరిలో మంత్రి పదవి దక్కిన మహిళ చంద్రిక అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముప్ఫై మంది సభ్యుల పుదుచ్చేరి అసెంబ్లీలో కారైక్కాల్ ప్రాంతంలో రిజర్వ్డు స్థానమైన నెడుంగాడు నుంచి ఎన్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో 2021లో ఆమెకు మంత్రి పదవి దక్కింది. 'మంచి ఆలోచనలతో, కష్టపడి పనిచేయాలని రాజకీయాల్లోకి వచ్చాన'న్న చంద్రిక పురుషాధిక్య రాజకీయ ప్రపంచంలో వివక్షకు గురయ్యానని ఆరోపించారు. ప్రజాదరణ ఉన్నా కుట్రల్ని తట్టుకొని, ధనశక్తి అనే భూతంపై పోరాడడం తేలిక కాదని గ్రహించినట్టు ఆమె తన రాజీనామా లేఖలో ఆవేదన చెందారు.

ప్రతిపక్ష కాంగ్రెస్, డీఎంకె, వామపక్షాలు ప్రభుత్వాన్నీ, సీఎం 'దళిత వ్యతిరేక వైఖరి'నీ తప్పుబట్టాయి. అయితే, కీలకమైన మంత్రి పదవిని చంద్రిక సమర్థంగా నిర్వహించట్లేదనీ, ఆరునెలలుగా చెబుతున్నా పట్టించుకోవట్లేదనీ, అందుకే ఆమెను పదవి నుంచి తప్పించామనీ, కేంద్రానికి లేఖ పంపగానే అది తెలిసి ఆమె ముందే రాజీనామా చేశారనీ అధికార పక్షం చెబుతోంది. చిత్రమేమిటంటే, అధికారపక్షం చెబుతున్న ఈ కథనాన్నే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నరైన మరో మహిళ తమిళిసై సౌందరరాజన్ పేర్కొనడం! దుర్విచక్షణ ఉన్నట్టు తెలీదనీ, తనకు చెబితే పరిస్థితిని చక్కదిద్దేదాన్ననీ గవర్నర్ అన్నట్టు తమిళ పత్రికల కథనం. అయితే, మన దేశంలో అలాంటివి లేవనుకోవడం వట్టి భ్రమ. ఆ మాటకొస్తే, ఎవరూ బయటపడకపోయినా చంద్రిక కథ లాంటిదే... ఈ దేశంలోని పలువురు మహిళా నేతల వ్యథ! పురుషాధిక్య ప్రపంచంలో, అందులోనూ రాజకీయాల్లో ఎన్నో సహించి, భరిస్తే కానీ స్త్రీలు తమకంటూ చిన్నచోటు దక్కించుకొని, గొంతు విప్పలేరన్నది నిష్ఠురసత్యం.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, చట్టం చేయడానికి సైతం దశాబ్దాలు పట్టిన రాజకీయ వ్యవస్థ మనది. అది అమలయ్యేదెన్నడో నిర్దిష్టంగా చెప్పలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో చంద్రిక లాంటి వారి ఉదంతాలు ఒక మేలుకొలుపు. ఆమె ఆరోపణలు సంపూర్ణ అసత్యాలని కొట్టిపారేయలేం. స్వతంత్ర భారత శతవసంతాల నాటికి మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చేయాలనేది పాలకులు ప్రవచిస్తున్న లక్ష్యం. 2047 కల్లా అది సాధ్యం కావాలంటే, జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళల పాత్ర, వారి ప్రాతినిధ్యం కీలకం. కానీ, అధిక శాతం పార్టీలు, ప్రభుత్వాల చేతలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. గమనిస్తే, 1970ల వరకు లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం 5 శాతం వద్దే తచ్చాడుతూ వచ్చింది. 2009లో గానీ అది రెండంకెలకు చేరుకోలేదు. రాజ్యసభలో అయితే 1951 నుంచి ఇప్పటి దాకా ఏనాడూ మహిళల సంఖ్య 13 శాతమైనా దాటలేదు. రాష్ట్ర శాసనసభల్లోనైతే సగటు మహిళా ప్రాతినిధ్యం 10 శాతం కన్నా తక్కువే.

మహిళా మంత్రుల సంఖ్యలోనూ మన దేశంలో ఇదే పరిస్థితి. గత మూడు దశాబ్దాల పైచిలుకులో కేంద్రంలో మంత్రిపదవులను చేపట్టిన స్త్రీలు నాటి మహిళా ప్రాతినిధ్యంతో పోలిస్తే 11 శాతమే. క్యాబినెట్ హోదా దక్కినవారైతే 7 శాతమే. రాజకీయ పాలనలో కాదు, ప్రభుత్వ అధికార యంత్రాంగంలోనూ ఆడవారి వాటా మరీ తీసికట్టు. మొత్తం 30 లక్షల పైచిలుకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో 11 శాతమే స్త్రీలు. కార్యనిర్వాహక, శాసన నిర్మాణ వ్యవస్థలతో పోలిస్తే, భారత న్యాయ వ్యవస్థలో లింగ సమానత మరీ కనాకష్టం. 1950 నుంచి చూస్తే, సుప్రీమ్ కోర్ట్ జడ్జీల్లో కూడా ఆడవాళ్ళు 3 శాతమే. ప్రతిచోటా ఉన్నత స్థాయికి చేరడానికి అతివలకు అనేక అవరోధాలు. ఈ గణాంకాలన్నీ ఇప్పటికీ మహిళల పట్ల మనకున్న దుర్విచక్షణకూ, మారని మన పితృస్వామ్య భావజాలానికీ నిలువుటద్దాలు. దానికి తోడు దళితులు, వెనుకబడిన వర్గాల స్త్రీల పరిస్థితి మరీ కష్టం. ఈ నేపథ్యం నుంచి పుదుచ్చేరి ఉదంతాన్ని చూసినప్పుడే సమస్య లోతులు స్పష్టమవుతాయి.

దాదాపు 156 దేశాల్లో సగటున 23 శాతం మహిళా మంత్రులుంటే, భారత్ తద్భిన్నం. కేంద్రంలో పేరుకు మహిళా మంత్రుల సంఖ్య పెంచినా, వారికి రక్షణ, పరిశ్రమలు, రైల్వేలు, రవాణా, వ్యవసాయం లాంటి కీలక శాఖలు అప్పగించడం అరుదు. ఈ పరిస్థితిని మార్చాలంటే, మహిళా రిజర్వేషన్ చట్టాలు తెస్తే సరిపోదు. కులం, మతం, ప్రాంతం, జెండర్ అంశాల్లో పార్టీల, ప్రజల ఆలోచన మారాలి. వెనుకబడిన వర్గాల, స్త్రీల సమర్థతను శంకించడం క్షమార్హం కాదు. అవకాశమిచ్చి, ప్రోత్సహిస్తే, పలువురు నేతల కన్నా వారే సమర్థులు. పాలిచ్చి పెంచిన అమ్మలు మనల్ని పాలించలేరా? కుటుంబానికి ఇరుసుగా మారి, మొత్తం సమాజాన్ని నిలబెడుతున్న స్త్రీలు సమర్థులు కారా? వారికా సమర్థత లేదనుకోవడం మూర్ఖత్వం. మకిలిపట్టిన మనసుల్లోని మనుస్మృతి భావజాలం!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.9.02 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** ఉత్తర ప.2.37 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.11.44. నుండి 1.28 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.10 నుండి 12.56 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.39 నుండి 8.25 వరకు

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

భారత్‌ను మాల్దీవులు వదులుకోగలదా?

విశ్లేషణ



డా॥ గద్దె ఓంప్రసాద్

దక్షిణాసియాలో చిట్టచివరగా బ్రిటిష్ పాలకుల నుండి స్వాతంత్ర్యం పొందిన దేశం మాల్దీవులు. 1965లో స్వతంత్ర దేశంగా అవతరించినప్పటి నుండి ఆర్థిక, శాస్త్రీయ–సాంకేతిక అభివృద్ధిలో, సముద్ర భద్రతా విషయాల్లో మాల్దీవులకు భారత్ చేయూత అందించింది. 1988లో ఆపరేషన్ కాక్టస్ ద్వారా ప్రభుత్వాన్ని తీవ్రవాదుల చెర నుండి కాపాడింది. అయినా కొన్నేళ్లుగా భారత్ ఆ దేశంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. రెండు మూడేళ్లుగా ఏకంగా 'ఇండియా అవుట్' ప్రచారానికి కేంద్రం అయింది. దీని వెనక ఐఎస్ఐ, చైనా ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. అలాగని అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకగా తన వాణిని బలంగా వినిపిస్తున్న భారత్‌ను దూరం చేసుకోవడం మాల్దీవులకు కూడా అంత తేలిక కాదు.

మాల్దీవుల్లో కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో భారత వ్యతిరేక రాజకీయాలు నెరిపిన మొహమ్మద్ ముయిజ్జూ సుమారు 54 శాతం ఓట్లతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో ఇరు దేశాల సంబంధాలు ఎలా వుండబోతున్నాయో అంచనా వేసే ముందు, భారత్ పట్ల వ్యతిరేకత పెరగడానికి కారణాలు ఏమిటో తెలుసుకోవాలి.

మాల్దీవ్స్‌లో 12వ శతాబ్దంలో ఇస్లాం అడుగుపెట్టినప్పటికీ అది స్థానిక సంప్రదాయాలు, ఆచారాల సమ్మిళితంతో ఉదారవాదంగా ఉండేది. 1970ల్లో ఉదార మత విధానాలను అవలంబించిన మాల్దీవులు, క్రమంగా గల్ఫ్ దేశాల ప్రభావానికి లోనయ్యింది. చమురు ఉత్పాదిత గల్ఫ్ దేశాలు అరబ్, ముస్లిం ప్రపంచంలో ముఖ్యమైన భూమికను పోషించడం మొదలుపెట్టాయి. సున్నీ ముస్లిం వహాబీజం పాటించే గల్ఫ్ దేశాలు సంప్రదాయవాదాన్ని బలంగా ప్రచారం చేయడం, మొహమ్మద్ అబ్దుల్ గయూమ్ నేతృత్వంలోని ప్రభుత్వం 1980, 90ల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి మతాన్ని అస్త్రంగా ఉపయోగించుకోవడం, గల్ఫ్ దేశాల నుండి వచ్చే చమురు, ఆర్థిక సహాయాన్ని పొందేందుకు సాంప్రదాయవాదాన్ని, ఇస్లామిక్ షరియా చట్టాల్ని ప్రవేశపెట్టడం వరుసగా జరిగాయి. ఆఫ్ఘనిస్తాన్‌ను సోవియట్ ఆక్రమించడంతో దానికి వ్యతిరేకంగా సంప్రదాయవాద వర్గాల ఏకీకరణ జరిగింది.

ఇరవై ఒక్కటవ శతాబ్దం మొదట్లో జరిగిన ప్రపంచ పరిణామాల ప్రభావం మాల్దీవుల యువత మీద తీవ్రంగా పడింది. ఆ దేశంలోని చాలామంది యువత అల్–ఖాయిదాలో చేరినట్టుగా వార్తలు వచ్చాయి. 2007లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల ప్రమాద ఘంటికలు మోగించాయి. 2008లో మాల్దీవులు ఏక పార్టీ వ్యవస్థ నుండి బహుళ పార్టీ వ్యవస్థగా రూపాంతరం చెందింది. మతపరమైన సాంప్రదాయ పార్టీలు ఏర్పాటు కావడానికీ, అవి మత రాజకీయాలు నెరపడానికీ ఇది దారి తీసింది. 2012లో షరియా చట్టాల అమలు కోసం అనేక ఉద్యమాలు ఈ పార్టీలు చేపట్టాయి. చాలామంది యువత 'ఐసిస్'లో చేరడానికి సిరియా వెళ్లినట్టు అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. ఇస్లామిక్ ఛాందసవాదాన్ని ఎగదోయడంలో, ముఖ్యంగా భారత్ పట్ల వ్యతిరేకతను పెంచడంలో పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ పాత్ర చాలా ఉంది. 1990ల్లో జరిగిన ఇస్రో 'హనీ ట్రాప్' కేసులో మాల్దీవులకు చెందినవారు ఉన్నట్టుగా బయటపడటం ఆ దేశంలో వేళ్లూనుకున్న ఐఎస్ఐ పాత్రకు ఒక ఉదాహరణ మాత్రమే.

1978 నుండి 2008 వరకు సుమారు ముప్పయ్యేళ్లు మాల్దీవులను ఏకధాటిగా పాలించిన మౌమూన్ అబ్దుల్ గయూమ్, అయన తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్, 2018లో అధ్యక్షుడిగా ఎన్నికైన ఇబ్రహీం సోలీహ్ భారత్ పట్ల సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. కానీ 2013 నుండి 2018 మధ్యకాలంలో అధికారంలో ఉన్న అబ్దుల్లా యామీన్ ప్రభుత్వం భారత్ వ్యతిరేక విధానాలను అనుసరించింది. తాజాగా ఆయన వారసుడిగా మొహమ్మద్ ముయిజ్జూ భారత్ పట్ల అంతే తీవ్ర వ్యతిరేక ప్రచారాలతో ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించారు.



యామీన్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో మాల్దీవ్స్‌లో చైనా కార్యకలాపాలు విపరీతంగా పెరిగాయి. 2014లో చైనీస్ బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో మాల్దీవ్స్ చేరడమే కాకుండా అనేక మౌలిక వసతుల నిర్మాణ బాధ్యతలను చైనీస్ కంపెనీలకు అప్పగించింది. మాలె, హుల్హులే, హుల్హుమాలే దీవులను కలిపే సినిమాలే బ్రిడ్జితో పాటు, వెలనా అంతర్జాతీయ విమానాశ్రయం, హుల్హులే ద్వీపంలోని నివాస సముదాయ నిర్మాణాలు, టూరిజం, ఎనర్జీ తదితర రంగాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. మాల్దీవుల ఆర్థిక శాఖ అంచనా ప్రకారం, 2022 చివరికల్లా ఆ దేశ అప్పులు జీడీపీలో 110 శాతం. అందులో చైనా వాటా సుమారు 70 శాతం. ప్రతి సంవత్సరం చైనాకు చెల్లించే వడ్డీలు సుమారు 92 మిలియన్ల అమెరికన్ డాలర్లు. మాల్దీవుల వార్షిక బడ్జెట్‌లో ఇది సుమారు 10 శాతం. యామీన్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన రాజ్యాంగ సవరణ ప్రకారం, విదేశీయులు ఆ దేశంలో స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. దీని ఆసరాగా చైనీస్ కంపెనీలు ఫెయిదూ ఫింహాలు ద్వీపాన్ని 50 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకున్నాయి. ఈ లెక్కలు చైనా ప్రభావం మాల్దీవుల పైన ఎంత వుందో, చైనా అప్పుల ఊబిలో ఎంతగా చిక్కుకుందో తెలియజేస్తాయి. చైనా ఈ పరిస్థితులను భారత వ్యతిరేక శక్తులను పెంచడానికి ఉపయోగించుకుంది. చైనా అనుసరిస్తున్న వైఖరిని గ్రహించిన ఇబ్రహీం సోలీహ్ ప్రభుత్వం 'ఇండియా ఫస్ట్' విధానాన్ని పాటించింది.

అయితే భారత వ్యతిరేక శక్తులు ఒక క్రమ పద్ధతిలో ప్రచారాన్ని సాగించాయి. ఆ దేశంలో ఉన్న నిరుద్యోగానికి ముఖ్య కారణం, భారతీయులు టూరిజం తదితర రంగాల్లో ఉద్యోగాలు ఎగరేసుకుపోవడమేననీ, భారత్‌లో ముస్లింల పట్ల అణచివేతకు పాల్పడుతున్నారనీ, భారత్ తన సైనిక కార్యక్రమాలు సాగిస్తూ మాల్దీవుల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తోందనీ, ఇబ్రహీం సోలీహ్ ప్రభుత్వం దేశ సంపదను భారత్‌కు ధారాదత్తం చేస్తోందనీ ఇలా అనేక రకాలుగా విష ప్రచారం చేశాయి. ఇదే రకమైన రాడికలైజేషన్, యువతలో భారత వ్యతిరేక భావజాల వ్యాప్తి బంగ్లాదేశ్‌లోనూ గమనించవచ్చు. ఈ ప్రచారం వెనక అటు ఐఎస్ఐ, ఇటు చైనా ఉన్నాయన్నది బహిరంగ రహస్యం.

ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వాన్ని భారత వ్యతిరేక కార్యక్రమాలు కొనసాగించకుండా చేయడం, విదేశాంగ విధానానికి ఒక సవాలు. ఇప్పటికే హిందూ మహాసముద్రంలో మయాన్మార్ నుండి జిబౌటి వరకు తన ఆర్థిక, సైనిక, వ్యూహాత్మక ప్రభావాన్ని విపరీతంగా పెంచుకున్న చైనాను కట్టడి చేయడం అంత తేలిక కాదు. భారత్, చైనా మధ్య ఈ ప్రాంతంలో నెలకొన్న పోటీలో మాల్దీవులు ముఖ్య భూమికను పోషిస్తాయి. 2013లో అమెరికా మాల్దీవులతో సైనిక ఒప్పందాలు చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలను, భారత్ అడ్డుకుంది. దక్షిణాసియాలో ప్రాంతీయేతర శక్తుల ప్రభావాన్ని అడ్డుకోవడం భారత విదేశీ విధానంలో ముఖ్య భాగం. కానీ అది క్రమంగా మారడం గమనించవచ్చు. 2020లో కుదిరిన అమెరికా, మాల్దీవుల సైనిక ఒప్పందానికి భారత్ సానుకూలత వ్యక్తం చేసింది. మాల్దీవులకు సుమారు 1,800 కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగో గరిసియ అమెరికా మిలిటరీ స్థావరాన్ని గతంలో వ్యతిరేకించిన భారత్ ప్రస్తుత పరిస్థితుల్లో తన స్వరం మార్చింది. ఈ ఒప్పందాలు చైనా ప్రభావాన్ని నిలువరించడంలో సహాయపడతాయని భావిస్తోంది.

భారత వ్యతిరేక ప్రభుత్వం ఏర్పడబోతున్నందుకు మరీ ఆందోళన చెందకుండా ఇదివరకే ఆ దేశంతో కుదిరిన అనేక ఒప్పందాలు, ముఖ్యంగా 500 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన థిలమలే సముద్ర వంతెన ప్రాజెక్ట్, తాగునీరు పైపులైన్ ప్రాజెక్ట్, విద్య, ఆరోగ్య సేవల వసతుల నిర్మాణ ప్రాజెక్టులు, వివిధ ఇతర పనులకు సంబంధించిన దాదాపు 300 బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టులు కొనసాగించాలి. ఇవి మాల్దీవులకు చాలా ముఖ్యమైనవి. ఇవి కొనసాగించేందుకు నూతన ప్రభుత్వాన్ని ఒప్పించడం, భారత వ్యతిరేక ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం తక్షణ కర్తవ్యాలు. అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకగా తన వాణిని బలంగా వినిపిస్తున్న భారత్‌ను దూరం చేసుకోవడం మాల్దీవులకు కూడా అంత తేలిక కాదు. 'ఇండియా అవుట్' ప్రచారం అక్కడి భారత సైనిక బలగాలకు వ్యతిరేకంగానో, భావోద్వేగ రాజకీయాల కోసమో తప్ప, పూర్తిగా భారత్‌ను ఆ దేశానికి దూరం చేయాలని కాదని మనం అనుకోవలసి ఉంటుంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన విభాగం, ఎస్ఐఎస్, జేఎన్‌యూ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఎలా వచ్చాయి?



'గాజా నిర్బంధం' అనే మాట విన్న ప్రతిసారీ మీకు మీరు ఈ ప్రశ్న వేసుకోండి: ఈ ఊహాత్మక నిర్బంధంలోనేనా హమాస్ అలా వేలాది రాకెట్లను, డ్రోన్లను దిగుమతి చేసుకోగలిగింది?

– హుస్సేన్ అబ్దుల్ హుస్సేన్, రీసెర్చ్ ఫెలో

దేవుడికి వదిలెయ్



ఒక కాఫిర్ (అవిశ్వాసి) చనిపోవాలని కోరుకోవడానికి అనుమతి ఉందా? అని ఒకరు అడిగారు. ఇది మరీ దుష్టత్వం. ఇతరుల పట్ల ముస్లింల హృదయాల్లో అలాంటి దుష్టత్వం ఉండకూడదు. అది కూడా 'కుఫ్ర్(అవిశ్వాసం)కు సమ్మతించడం లాంటిది!

– అస్సీమ్ అల్‌హకీమ్, ఇస్లాం పండితుడు

అది యుద్ధనేరం



గాజా (పాలస్తీనా) జనాభా సుమారు 20 లక్షలు. ఇందులో సగం మంది పిల్లలు. హమాస్ ఘోరానికి లక్షల మంది అమాయకులు మూల్యం చెల్లించేలా చేయకూడదు. మూకుమ్మడిగా శిక్షించడం అనేది యుద్ధ నేరం; నీరు, ఆహారం అందకుండా దిగ్బంధించడం కూడా! అమానవీకరణను మరో దుర్మార్గంలోకి దిగనీయకూడదు. – అలెగ్జాండ్రియో ఒకేషియో–కార్టెజ్, అమెరికా నాయకురాలు

సగం వెనక్కి!



రష్యా 2022 నుంచి ఆక్రమించుకున్న ప్రాంతంలో సగానికంటే ఎక్కువ భాగాన్ని ఇప్పటికి ఉక్రెయిన్ తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఈ రోజు ప్రకటించిన ఆయుధాలు, సామగ్రి ఉక్రెయిన్ ప్రగతిని నిలపడంలో, తర్వాతి ఊపును కొనసాగించడంలోనూ తోడ్పడుతాయి.

– ఆంటోనీ బ్లింకెన్, యూఎస్ విదేశాంగ మంత్రి

తవ్వితేనే రాయగలం



రాయడం అనే ప్రక్రియ తవ్వకం లాంటిది! పట్టుదలతో తవ్వుతూ పోతే, ఏం దొరుకుతాయో తెలీదు– పురుగులు, ఎముకలు– ఏవైనా ఒకటే; రాయాలనుకునేవాళ్లకు రెండూ బంగారంతో సమానమే. నా ప్రత్యేక తవ్వకం పూర్తయింది. ఇప్పుడు నాలుగో పుస్తకంతో సిద్ధంగా ఉన్నాను.

– ట్వింకిల్ ఖన్నా, నటి – రచయిత్రి

ఎవరు మెరుగు?



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా రీజినల్ డైరెక్టర్‌గా సైమా వాజెద్ కంటే శంభు ఆచార్య(నేపాల్) చాలా మెరుగైన అభ్యర్థి. ప్రజారోగ్యంలో డాక్టరేట్ ఉన్న ఆచార్య ప్ర.ఆ.సం.లో 30 ఏళ్లు పనిచేశారు. సైమా సైకాలజీ చదివారు కానీ ప్రజారోగ్యంలో అనుభవం లేదు. ఆమె బంగ్లాదేశ్ ప్రధాని కూతురు. రాజకీయ నాయకులు ఆమెకు అండగా ఉన్నారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

అంత్యక్రియలు లేకుండా...



మణిపుర్‌లోని ఇంఫాల్, చురాచాంద్‌పుర్ ప్రభుత్వ ఆసుపత్రుల శవాగారాల్లో ఎవరూ తీసుకుపోని 94 శవాలు ఉన్నాయి. ఆరింటిని ఇంకా గుర్తించాల్సి ఉంది. చనిపోయినవారి బంధువుల తరఫున నిర్ణయం తీసుకుని 'సమయానికి మృతదేహాలకు అంత్యేష్టి జరపడంలో' పౌర సంఘాలు ఆటంకంగా ఉన్నాయని అధికారిక నివేదిక నిందిస్తోంది.

– విజైతా సింగ్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సొంతింటి కల నెరవేరుతున్న వేళ!

సంక్షేమ రథాన్ని ప్రగతి పథంలో పరుగులెత్తించేవాడే నిఖార్సయిన నాయకుడు, నిజమైన పాలకుడు. అలాంటి గొప్ప పాలకుడు ముఖ్యమంత్రి జగన్. ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎంతో ఉన్నతమైన పథకం పేదలందరికీ ఇళ్ళు నిర్మించి ఇవ్వడం. ఒకప్పుడు 'పేదల కోసం ఇళ్లు నిర్మిస్తున్నా'రని అనేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. వైఎస్ జగన్ పాలనలో 'పేదల కోసం ఇళ్లు కాదు ఏకంగా ఊళ్లు' నిర్మిస్తున్నారు. 'ప్రజా సంకల్ప యాత్ర'లో ఇల్లులేని నిరు పేదల కష్టాలు చూసిన జగన్ తాను అధికారంలోకి వస్తే అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన మాటను నిలబెట్టుకున్నారు. ప్రభుత్వం 31 లక్షల మంది పేదలకు రూ. 76 వేల కోట్ల విలువగల ఇళ్ల స్థలాల పట్టాలు అందించింది.

దేశంలో ఎక్కడా లేని విధంగా 21.76 లక్షల ఇళ్ల నిర్మాణాలు రాష్ట్ర వ్యాప్తంగా మొదలు కాగా 7.43 లక్షల ఇళ్ళు ఇప్పటికే పూర్తి కావడం, మిగిలిన లక్షలాది ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో శరవేగంతో పూర్తి అయ్యే దశలో ఉండటం వైఎస్ జగన్ సృష్టించిన చరిత్ర. 2023, ఆగస్టు ఆఖరు నాటికి 21.31 లక్షల మంది లబ్ధిదారులకు రూ. 12,296 కోట్ల చెల్లింపులను అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి వేయడం ఒక సామాజిక విప్లవం.

17 వేల 'జగన్ అన్న కాలనీ'ల్లో సకల సదుపాయాల కోసం రూ. 3.3 వేల కోట్లు ఖర్చు పెట్టారు. పెద్దాపురం నియోజక వర్గంలోని 'సామర్ల కోట లే అవుట్'లో 2,412 నిరుపేద కుటుంబాలకు 'సొంత ఇల్లు' కల సాకారం కాగా ఇందులో 800 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 1,408 ఇళ్ళు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి నిన్న (అక్టోబర్ 12)న ప్రత్యక్షంగా ఇక్కడ సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గృహప్రవేశాలకు శ్రీకారం చుట్టారు.

కూలీ పనులు చేసుకునేవారు సంపాదించే కూలీ డబ్బులు ఏ రోజుకు ఆ రోజు పొట్టపోసుకోవడానికే సరిపోతాయి. ఎంతో కొంత మిగిలితే ఆ మిగిలిన డబ్బు అత్యవసర సమయాల్లో ఖర్చయిపోతుంటుంది. ఇలాంటి వేలాది కుటుంబాలు సొంతంగా ఇళ్లు కట్టుకోవడమనేది కలలో జరిగే విషయమే. ఇలాంటప్పుడే ప్రభుత్వం అండదండలందించి వారి తలరాతలు మార్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అదే పని జరుగుతోంది.

– దవులూరి దొరబాబు, ఛైర్మన్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్

అవినీతికి అర్థం మారుతోందా?

అభిప్రాయం



ఈదర శ్రీనివాస రెడ్డి

ఇటీవల ఒక రాజకీయ పార్టీ అధినేత, ప్రజలు అవినీతిని కొంత వరకు ఉపేక్షించటం నేర్చుకోవాలని ఒక బహిరంగ సభలో ఉద్బోధించడం ఆశ్చర్యం కలిగించింది. అవినీతిని రూపుమాపటానికి ప్రయత్నించాల్సిన నాయకులు ఇలా అవినీతిని కొంత వరకు ఉపేక్షించవచ్చనే పిలుపు నివ్వటం వారి రాజకీయ అజ్ఞానానికి తార్కాణం. ఒకప్పుడు అవినీతి పరుడు అని సమాజం చేత అనిపించుకోవడానికి చాలా అవమానంగా భావించే వాళ్లు, కానీ నేడు అదో పెద్ద బిరుదులాగ ఏమాత్రం సిగ్గు లేకుండా సమాజంలో తల ఎత్తుకొని తిరుగుతున్నారు చాలామంది. సమాజం కూడా ఇటువంటి వారి పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం అలవాటు చేసుకుంది. ఎందుకంటే చాలామంది ఆఫీసుల్లో అడ్డదారుల్లో పనులు చేయించుకోవడానికి లంచాలు ఇచ్చేవారే కావడం. ఇటువంటివారు రాజకీయ నాయకులు అవినీతి కార్యకలాపాలకు పాల్పడితే అదేమంత ఘోరమైన పని కాదనీ, పైగా సహజమైనదే కదా అనే స్థాయికి వచ్చారు. ఆ ఉదాసీన భావాన్ని అందిపుచ్చుకున్న పైన పేర్కొన్న రాజకీయ నాయకుడు అవినీతిని ఉపేక్షించమనేదాకా వెళ్లాడు.

రాజకీయాల్లో తలపండిన ఒక పెద్దాయన అవినీతి ఆరోపణల మీద ఇటీవల జైలుకు వెళ్ళటం జరిగింది. ఆ పెద్దాయన్ని అన్యాయంగా అరెస్టు చేశారని కొంతమంది వాదిస్తున్నారు కాని అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదు అని వాళ్ళు ఒప్పుకోవటం లేదు. పైపెచ్చు అవినీతి జరిగింది అని చెబుతున్న డబ్బు మొత్తం మా రోజు వారి ఖర్చులకు కూడా రాదు, మా ఆస్తితో పోల్చుకుంటే అది సముద్రంలో కాకి రెట్టంత అన్నట్టు మాట్లాడుతున్నారే కాని, వంద అయినా, వెయ్యి అయినా అవినీతి అవినీతే కదా అని ఆలోచించ లేకపోవటం దురదృష్టకరం.

ఒక రాజకీయ పార్టీ యువ నేత, ప్రజలందరూ ఓటు వెయ్యటానికి వందో, వెయ్యో తీసుకోవటం వల్ల, తాము చేసే అవినీతిని ప్రశ్నించే అర్హత లేదని వ్యాఖ్యానించాడు. ఆయన మాటల్లో కొంత వరకు నిజం ఉన్నా, ప్రజలందరూ ఓటు వెయ్యటానికి డబ్బులు తీసుకుంటున్నారు అనేది మాత్రం సత్య



దూరం. ఓట్లు వేసే వాళ్ళందరికీ డబ్బులు పంచాలంటే ఏ రాజకీయ పార్టీకీ సాధ్యం కాదు. అసలు ఓట్ల కోసం డబ్బు పంచమని ఎవరు అడిగారు? రాజకీయ నాయకులే వాళ్ళ అవసరం కోసం ప్రజలకు లంచాలు ఇస్తున్నారు. ఓట్లు కొనుక్కొని గెలిచిన వారు తమ పెట్టుబడిని తిరిగి సంపాదించడం కోసం అవినీతికి పాల్పడుతున్నారు. ఈ విషయం అందరికీ తెలుసు. కానీ ఎవరూ సీరియస్‌గా పట్టించుకోకపోవడమే విడ్డూరం. అందుకే అవినీతిని కూడా కొంత వరకు ఉపేక్షించటం ప్రజలు నేర్చుకోవాలని చెప్పేదాకా కొందరు రాజకీయనాయకులు బరితెగించారు. అడపా దడపా కొంత మంది ప్రభుత్వ ఉద్యోగస్తులు అవినీతికి పాల్పడుతుంటారు. వాళ్ళు తీసుకునేది వందలు, వేలే. కాని వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతోంది అవినీతి నిరోధక శాఖ. మరి వాళ్ళు కూడా మేం తీసుకుంటున్నది చిన్న మొత్తాలే అనీ, దానిని అవినీతి అని ఎలా అంటారనీ వాదిస్తే సమాజం ఏమవుతుంది?

ఎవరైనా అవినీతికి పాల్పడవచ్చేమో కాని, రాజు మాత్రం అవినీతికి పాల్పడకూడదు. రాజే అవినీతికి పాల్పడితే, కంచే చేను మేసినట్టు అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో అదే జరిగింది. దాంతో 'అవినీతి' అభ్యంతరకరమైన పదం కాదని చెప్పడాన్నీ తప్పు పట్టలేనంత ఉదార హృదయులయ్యారు. అందుకే అవినీతిని ప్రశ్నించే వాళ్ళు కూడా కరవవుతున్నారు. ప్రతి ఒక్కరూ తారాస్థాయికి చేరిన అవినీతినీ, దోపిడీనీ చూసి జాలిపడే వారే కానీ వాటికి అడ్డుకట్ట వేద్దామని ప్రయత్నం చేసేవాళ్ళు మాత్రం కనిపించడం లేదు. ఒకవేళ అలా ప్రశ్నించి అరెస్ట్ చేస్తే భయంకరమైన దుష్ప్రచారాలకు పాల్పడుతున్నాయి స్వార్థపర శక్తులు. ఈ పరిస్థితుల్లో ప్రజలు వాస్తవాన్ని గ్రహించి తప్పకుండా నీతిమంతులకే రాబోయే ఎన్నికల్లో పట్టం కడతారు అనటంలో సందేహం లేదు.

వ్యాసకర్త ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, నాగార్జున యూనివర్సిటీ

భగవత్ సాన్నిధ్యం

స్వామి చిద్భవానంద తమిళంలోనూ, ఇంగ్లిష్‌లోనూ భగవద్గీతకు విపులమైన వ్యాఖ్యను రచించి అరవై ఏళ్ళ కిందట ప్రచురించారు. పురుషోత్తమ యోగంలోని 'ఊర్ధ్వ మూలం అధశ్శాఖం అశ్వత్థం...' అని మొదలయ్యే శ్లోకానికి వారు చేసిన వ్యాఖ్యలో సందర్భానుసారంగా, శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన ఒక ఉదంతాన్ని ఉటంకించారు.

ఒకచోట సంత జరుగుతోంది. సంత బయట నిల్చున్న వానికి లోపల ఏమి జరుగుతున్నదీ తెలియదు. అమ్మకందార్లు, కొనుగోలుదార్లు మాట్లాడే మాటల సవ్వడి

జ్యోతిర్మయం

అతడికి రణగొణ ధ్వనిగా, గందరగోళంగా, రొదగా వినిపిస్తుంది. స్పష్టత ఉండదు. కానీ, ఎప్పుడైతే అతడు సంత లోపలికి ప్రవేశిస్తాడో, అప్పుడు అతడి అవగాహనలో మార్పు వస్తుంది. అక్కడ జరిగే బేరసారాలు, మాట్లాడే మాటలు స్పష్టంగా వినపడతాయి. అర్థమవుతాయి.

అలాగే ఒక వ్యక్తి భగవంతునికి దూరంగా ఉన్నప్పుడూ, భగవంతుని గురించిన అనుభవ జ్ఞానం లోపించినప్పుడూ, భగవంతుని గురించిన అతని అవగాహనలో స్పష్టత ఉండదు. అతడి ఆలోచనా విధానం గందరగోళంగా ఉంటుంది. కార్యకారణ సంబంధాల గురించి అతడు చేసే యోచన సరైన మార్గంలో సాగదు. అతడు చేసే వాదనలకు, ప్రతివాదనలకు అంతూపొంతూ ఉండదు. కానీ, ఎప్పుడైతే అతడు భగవంతునికి దగ్గరగా జరుగుతాడో, ఎప్పుడైతే అతనికి భగవత్ సాన్నిధ్య భాగ్యం లభిస్తుందో, అప్పుడు అతనికి సత్యం గోచరిస్తుంది. అతడు భగవంతుని గురించి చేసే ఊహాగానాలూ, ఆధారం లేని ఆలోచనలూ అన్నీ ఒక కొలిక్కి వస్తాయి. భగవత్తత్వం గురించిన రహస్యం విడిపోతుంది. అంతా బట్ట బయలు అవుతుంది.

– దీవి సుబ్బారావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

లోక్‌సభ సబార్డినేట్ కమిటీ చైర్మన్‌గా ఎంపీ బాలశౌరి

వరుసగా నాలుగోసారి ఎంపిక



చిలకలపూడి(మచిలీపట్నం): లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి నాలుగోసారి ఎంపికయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆయన కమిటీ చైర్మన్‌గా మూడు పర్యాయాలు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపించారు. అందువల్లే ఆయన్ను నాలుగోసారి కూడా చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీగా తనను లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

స్వరూపానందేంద్రకు దసరా ఉత్సవాల ఆహ్వానం



స్వరూపానందేంద్రకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాంబాబు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/సింహాచలం: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతోన్న దసరా మహోత్సవాలకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని దుర్గగుడి చైర్మన్ ఆహ్వానించారు. ఈ మేరకు స్వరూపానందేంద్ర, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రను కలిసిన దుర్గగుడి చైర్మన్ రాంబాబు, వైదిక కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

ముక్కంటీశుని సేవలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం



రాహుకేతు పూజల్లో ఫడ్నవిస్

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఈవో సాగర్‌బాబు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఫడ్నవిస్‌ను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

ఉచిత బస్సుల్లో 'వాయిస్' అనౌన్స్‌మెంట్: టీటీడీ ఈవో

తిరుపతి కల్చరల్: తిరుమలలోని ఉచిత బస్సుల్లో భక్తుల సౌకర్యార్థం వారు దిగాల్సిన ప్రాంతాలు, రాబోయే బస్ స్టాప్‌లు తెలిపేలా ఎలక్ట్రానిక్ ఆటోమేటిక్ వాయిస్ అనౌన్స్‌మెంట్ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో రవాణా విభాగం అధికారులతో ఆయన సమీక్షించారు. తిరుమలలో ఉచిత బస్సుల్లో ప్రయాణించే వారు తాము దిగాల్సిన ప్రాంతాలు తెలియక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సహకారంతో మరో 10 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో ఎలక్ట్రిక్ వాహనాలకు సరిపోయే విధంగా చార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. సమీక్షలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో గరుడ సేవ సాయంత్రం 6.30 గంటలకే

తిరుమల: తిరుమలలో అక్టోబర్ 15–23 వరకు నిర్వహించనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19న జరగనున్న గరుడ వాహన సేవను రాత్రి 7 గంటలకు బదులుగా సాయంత్రం 6.30 గంటలకే ప్రారంభించాలని టీటీడీ నిర్ణయించింది. ఎక్కువ మందికి ఈ సేవను వీక్షించే అవకాశం కల్పించేందుకుగాను టీటీడీ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఆగమశాస్త్రం ప్రకారం సూర్యాస్తమయం తరువాతే రాత్రి వాహన సేవ నిర్వహిస్తారు. 19న సాయంత్రం 6.15 గంటలకే సూర్యాస్తమయం అవుతుండటంతో 6.30 గంటలకు గరుడ సేవ ప్రారంభమవుతుంది. కాగా, బ్రహ్మోత్సవాల రోజుల్లో అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ముందస్తుగా ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను నిర్దేశిత వాహనసేవకు మాత్రమే అనుమతించనుంది. అక్టోబర్ 14న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను రద్దు చేసింది. అక్టోబర్ 14–23 వరకు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రుల ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేసింది.

సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఆర్థిక భరోసా

'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన పౌరులందరికీ నవరత్నాలు ద్వారా అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో నూతన పథకాన్ని ప్రకటించింది. సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' అనే కొత్త పథకాన్ని మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం జారీ చేశారు. ప్రతి సంవత్సరం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్‌ఈ)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి దాదాపు 40 మంది ఎంపికవుతున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రం నుంచి మరింత ఎక్కువ మంది ఎంపికయ్యేలా ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించింది. దీనిద్వారా సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన, వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించనుంది. ప్రిలిమినరీ, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం అందిస్తుంది. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ప్రిలిమినరీలో క్వాలిఫై అయిన అభ్యర్థులకు రూ.లక్ష, మెయిన్స్‌లో క్వాలిఫై అయిన వారికి రూ.50 వేలు చొప్పున డీబీటీ పద్ధతిలో నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుంది. యూపీఎస్సీ అనుమతించే ఎన్ని పర్యాయాలు అయినా ఆ అభ్యర్థులకు ప్రభుత్వం ఈ ప్రోత్సాహకం అందిస్తుంది. ఈ ప్రోత్సాహకంతో అభ్యర్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖలు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

ఇదీ ఉపయోగం

ఈ పథకం ద్వారా దరఖాస్తుదారులకు ప్రభుత్వం రెండు దశల్లో ప్రయోజనాన్ని అందిస్తుంది. మొదటిది సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రూ.లక్ష, నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. అభ్యర్థులు మెయిన్స్ పరీక్షకు సన్నద్ధం కావడానికి ఈ నగదు ఉపయోగపడుతుంది. రెండోది సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రూ.50వేలు ప్రోత్సాహకం అందిస్తుంది. ఇది వ్యక్తిత్వ పరీక్షకు సన్నద్ధమవడానికి ఉపయోగపడుతుంది. ఈ నగదు అభ్యర్థుల కోచింగ్, స్టడీ మెటీరియల్, ఇంటర్వ్యూ గైడెన్స్, ప్రిపరేషన్, ఇతర ఖర్చులకు భరోసా ఇస్తుంది.

అర్హత ప్రమాణాలు ఇవి..

1. దరఖాస్తుదారు తప్పనిసరిగా సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అయ్యుండాలి.
2. ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత నివాసి(స్థానికుడు) అయ్యుండాలి
3. తప్పనిసరిగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించి ఉండాలి. ఈమేరకు రుజువు పత్రాలు సమర్పించాలి. యూపీఎస్సీ అనుమతించిన ఎన్ని ప్రయత్నాల్లోనైనా ఈ పథకం కింద నగదు ప్రోత్సాహకాన్ని అభ్యర్థి పొందవచ్చు.
4. దరఖాస్తుదారు కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.8 లక్షలకు మించకూడదు. ఈ మేరకు కుటుంబ ఆదాయ స్వీయ ధ్రువపత్రం, ఇంటిలోని ఉద్యోగి జీతం ధ్రువపత్రం, తాజా పన్ను వంటి ధ్రువపత్రం అందించాలి. కుటుంబ వార్షిక ఆదాయాన్ని తాహశీల్దార్ ద్వారా ధృవీకరిస్తారు.
5. కుటుంబానికి పది ఎకరాల మాగాణి లేదా 25 ఎకరాల మెట్ట భూమి గానీ, మొత్తం 25 ఎకరాల మాగాణి, మెట్ట భూమి ఉండొచ్చు.
6. ఇలా పలు అర్హతలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు అన్ని అవసరమైన ధృవపత్రాలతో సాంఘిక సంక్షేమ శాఖ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.2.58 కోట్ల మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రూ.2.58 కోట్ల మద్యాన్ని శ్రీసత్యసాయి జిల్లా సెబ్, సివిల్ పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. పెనుకొండ పట్టణ సమీపంలోని మడకశిర రోడ్డు షీఫారం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల కాలంలో 824 కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో భాగంగానే రూ.2.58 కోట్ల విలువ గల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఏఎస్పీలు విష్ణు, ఈఎస్ రవికుమార్, డీఎస్పీ హుస్సేన్‌పీరా, సెబ్ సీఐ వెంకటసుబ్బారెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత



గంజాయి ఉన్న కారును తీసుకువెళ్తున్న అధికారులు

గన్నవరం: కృష్ణాజిల్లాలోని గన్నవరంలోని ఓ ఇంటి ఆవరణలో ఉన్న కారులో ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు వంద కిలోల గంజాయిని కేంద్ర ప్రత్యేక బృందం పట్టుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. స్థానిక సెయింట్‌జాన్స్ హైస్కూల్ సమీపంలోని విద్యానగర్‌లో ఓ ఇంటిని ప్లాస్టిక్ వస్తువుల విక్రయ వ్యాపారం చేసే రాజస్థాన్‌కు చెందిన కుటుంబం మూడు నెలల క్రితం అద్దెకు తీసుకుంది. వీరి ఇంటికి గురువారం రాజస్థాన్‌కు చెందిన నలుగురు యువకులు కారులో వచ్చారు. ఆ కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందం దాడి చేసింది. అయితే భోజనాలు చేసి విశ్రాంతి తీసుకుంటున్న నలుగురు యువకుల్లో.. అధికారుల రాకను గమనించి ఇద్దరు గోడ దూకి పరారయ్యారు. మిగిలిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పట్టుబడ్డ ఇద్దరు యువకులను, గంజాయి ఉన్న కారును విజయవాడకు తరలించి విచారిస్తున్నారు.

సాంకేతికతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సైబర్ క్రైమ్ వర్క్‌షాప్‌లో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



సదస్సులో ప్రసంగిస్తున్న డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్, మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ ఆధ్వర్యంలో 4వ రీజనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ జాయింట్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ టీమ్ (6) వర్క్‌షాప్ గురువారం విశాఖలో నిర్వహించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి (ఇంటర్నల్ సెక్యూరిటీ) శివగామి సుందరీ నందా, 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులుగా సుమారు 50 మంది పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. వర్క్‌షాపును ప్రారంభించిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

సైబర్ నేరాలను ఎదుర్కోవడంపై ప్రత్యేక దృష్టి

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి శివగామి సుందరీ నందా దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ క్రైం తీరు తెన్నులను, వాటిని సమన్వయంతో ఎలా ఎదుర్కోవాలో వివరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు పూర్తి సమన్వయంతో సైబర్ నేరాలను అదుపు చేయడం, సమాచార మార్పిడి, సైబర్ నేర కేసులు మరింత సమర్థవంతంగా పరిశోధన చేయడం, సైబర్ నేరగాళ్లకు శిక్షలు పడేలా చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఇతర దేశాలతో పరస్పర చట్టపరమైన సహాయ ఒప్పందాల (ఎంఎల్‌ఏటీ) అమలుకు సంబంధించిన కార్యకలాపాలను సమన్వయం చేయడానికి గల అన్ని అవకాశాలనూ వినియోగించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. సైబర్ నేరాలను అరికట్టే పలు ఆధునిక పరిజ్ఞానాలు, సిబ్బంది శిక్షణ, బృందాల ఏర్పాటు, అవగాహన విధానాలు, ఇతర చర్యలపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఏపీ, తమిళనాడు, కేరళ, ఒడిశాతో పాటు లక్షద్వీప్, అండమాన్–నికోబార్, పుదుచ్చేరి, జార్ఖండ్‌కి చెందిన ప్రతినిధులు, విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ పాల్గొన్నారు.

సీమ జోన్ అభ్యర్థులకు కర్నూలులో ఎస్‌ఐ రాత పరీక్ష



అధికారులతో చర్చిస్తున్న డీఐజీ సెంథిల్‌కుమార్

కర్నూలు: రాయలసీమ జోన్ అభ్యర్థులకు కర్నూలులో ఎస్‌ఐ రాత పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 14 కేంద్రాల్లో, ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఐ మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షకు 8,521మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. 14వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–2 ఉంటుంది. అక్టోబర్ 15వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పేపర్–3, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–4 పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్ వంటి గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచ్‌లను అనుమతించరని.. బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని డీఐజీ సెంథిల్ కుమార్ సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సతీశ్ కుమార్, ప్రొఫెసర్ జోహార్, బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే తలమానికం జగనన్న కాలనీలు

- 1,110వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కుల మతాలు, ప్రాంతాలకతీతంగా అర్హులైన పేదలందరికీ సకల సౌకర్యాలతో దాదాపు 35 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించి ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజనుల పక్షపాతిగా నిరూపించుకున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల జగనన్న కాలనీలను సకల వసతులతో శాటిలైట్ సిటీలుగా మార్చి అందజేయడం దేశానికే తలమానికం అన్నారు. చంద్రబాబునాయుడి హయాంలో పేదలకు కనీసం జానెడు జాగా కల్పించకపోగా.. పేదోడి గూడును కూల్చేందుకు కోర్టుల్లో కేసులు వేయిస్తున్నాడని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,110వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన గజదొంగ చంద్రబాబును అరెస్టు చేసి చట్టం, న్యాయం పేదల పక్షాన నిలిచాయని హర్షం వ్యక్తం చేశారు. దీనిని ఓర్చుకోలేని కులవాదులు తప్పును ఒప్పుగా చూపించేందుకు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తూ.. పెట్టుబడిదారుల ఉద్యమం నడుపుతుండటం సిగ్గుచేటన్నారు. రాజధాని పేరుతో ల్యాండ్ పూలింగ్ నుంచి ప్లాట్ల కేటాయింపు, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం తదితర వ్యవహారాల్లో చంద్రబాబు తమ అనుయాయులకు పెద్దపీట వేసి పేదలను అణగదొక్కాడని విమర్శించారు. బహుజనులకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. నాయకులు బేతపూడి సాంబయ్య, పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

25 మంది 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్ట్

- ఎర్రచందనం దుంగలు, లారీ, రెండు టూవీలర్లు, గొడ్డళ్లు స్వాధీనం



పట్టుబడిన స్మగ్లర్లు, ఎర్ర చందనం దుంగలను మీడియాకు చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం: శేషాచల అడవుల్లోని ఎర్రచందనం చెట్లను నరికి తరలిస్తున్న 25మంది స్మగ్లర్లను అరెస్ట్ చేసి.. వారినుంచి 21 ఎర్రచందనం దుంగలు, లారీ, రెండు టూవీలర్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు తెలిపారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురు వారం వారు వివరాలు వెల్లడించారు. కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐలు నరేష్, అలీబాషా టీమ్ చాగలమర్రి ఇరమడక వైపు వెళ్తున్న లారీని తనిఖీ చేసి 22 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో శిరువెళ్ల రిజర్వు ఫారెస్టులో డంప్ చేసిన 11 ఎర్రచందనం దుంగలతో పాటు లారీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా తమిళనాడుకు చెందినవారు. మరో ఘటనలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి టీమ్ రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ నుంచి రాజంపేట చిట్వేల్ రేంజ్, రెడ్డివారిపల్లి వైపు కూంబింగ్ చేపట్టారు. పెద్దకోన వంక వద్ద కొందరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, వారిలో ముగ్గురిని పట్టుకుని పది ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరు మండలానికి చెందిన కనపర్తి చంద్రశేఖర్ (31), కనపర్తి హరిబాబు (35), తిరుపతి కొర్లగుంటకు చెందిన దగ్గుపాటి ప్రవీణ్‌కుమార్ (35) అరెస్ట్ అయ్యారు. కాగా, పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.60 లక్షలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీలో 'కారుణ్య' కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి

- ఆకట్టుకున్న పాసింగ్ అవుట్ పరేడ్
- సీఎం జగన్ వల్లే ఆర్టీసీలో కారుణ్య నియామకాలు సాధ్యమయ్యాయి
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



శిక్షణ పూర్తిచేసుకున్న ఏపీఎస్‌ఆర్టీసీ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్

ఒంగోలు సబర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన వారికి ఒంగోలులోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఇస్తున్న కానిస్టేబుల్ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ద్వారానే ఆర్టీసీలో కారుణ్య నియామకాలు సాధ్యమయ్యాయని చెప్పారు. 2015 తర్వాత ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టలేదన్న విషయం తెలుసుకున్న సీఎం జగన్ పెద్ద మనసుతో.. కారుణ్య నియామకాల కింద కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారని వివరించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైన తర్వాత.. మొదటి బ్యాచ్‌లో 95 మంది కారుణ్య నియామకం ద్వారా ఎంపికై కానిస్టేబుల్ శిక్షణ పొందారని వెల్లడించారు. వారిలో 35 మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. అంతకుముందు పీటీసీ ప్రిన్సిపాల్, ఐపీఎస్ అధికారి ఏఆర్ దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ ఆకట్టుకుంది. ఇండోర్ విభాగంలో 400కు గాను 346 మార్కులు సాధించిన అనంతపురం జిల్లాకు చెందిన కరుణ భారతి మొదటి బహుమతి సాధించారు. ఔట్‌డోర్ విభాగంలో పరేడ్ కమాండర్ వడ్లమూడి శ్రీరంగ సాయినాథ్ 150కి గాను 130 మార్కులు సాధించి మొదటి బహుమతి సాధించారు. ఇన్‌డోర్, ఔట్‌డోర్ ఆల్ రౌండ్ విభాగంలో 550కి గాను 434 మార్కులు సాధించిన చిత్తూరు జిల్లాకు చెందిన గంటా మౌతీశ్వర్ ప్రథమ బహుమతిని సాధించారు.

శ్రీశైలంలో 15 నుంచి దసరా మహోత్సవాలు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఈ నెల 15–24 వరకు దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. గురువారం దేవస్థాన పరిపాలనా భవనంలో దసరా మహోత్సవ ఏర్పాట్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. 15న ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు స్వామి వారికి విశేష అర్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, రుద్రయాగం, చండీయాగం, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గల అలంకరణలు, స్వామి అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. 23న రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. 15న శైలపుత్రి, భృంగివాహన సేవ, 16న బ్రహ్మచారిణి, మయూర వాహనసేవ, 17న చంద్రఘంట, రావణవాహనంసేవ, 18న కూష్మాండదుర్గ, కైలాసవాహన సేవ, 19న స్కందమాత, శేష వాహన సేవ, 20న కాత్యాయని, హంసవాహన సేవ, 21న కాళరాత్రి, గజవాహన సేవ, 22న మహాగౌరి, నందివాహన సేవ, 23న సిద్ధిదాయిని, అశ్వవాహన సేవ, 24న భ్రమరాంబాదేవి నిజాలంకరణ, నందివాహన సేవలు నిర్వహిస్తామన్నారు.

బెంగళూరులో ఐటీ సోదాలు

బనశంకరి: 2 వారాల వ్యవధిలో మూడోసారి గురువారం బెంగళూరులో నగల వ్యాపారాలు, పారిశ్రామికవేత్తల నివాసాల్లో ఐటీ అధికారులు సోదాలు చేశారు. నగరంలో 10కి పైగా ప్రాంతాల్లో సోదాలు సాగాయి. రాజస్థాన్‌లో రాజకీయ పార్టీలకు వీరు నిధులు పంపించారా? అనేది పరిశీలిస్తున్నారు. భారీ సంఖ్యలో ఐటీ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి మల్లేశ్వరం, సదాశివనగర, డాలర్స్ కాలనీ, మత్తికెరె, సర్జాపురరోడ్డు తో పాటు నగరంలోని అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కాఫీ బోర్డు మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ , తదితర ప్రముఖుల నివాసాల్లో తనిఖీలు చేపట్టారు. ఇళ్లలోని డబ్బు, నగలు, ఆస్తిపత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలన చేపట్టారు.

బెంగళూరులో పరువు హత్య

- కుమార్తెను పొడిచి చంపిన తండ్రి



హతురాలు కవన, తండ్రి మంజునాథ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: వేరే కులం యువకున్ని ప్రేమించిన కుమార్తెను కన్న తండ్రే మట్టుబెట్టిన ఘటన సిలికాన్ సిటీ బెంగళూరు రూరల్‌లో చోటుచేసుకుంది. స్థానికంగా సంచలనం సృష్టించిన ఘటన వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం సమీపంలోని బిదలూరులో మంజునాథ్ (47) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు కాగా, పెద్ద కుమార్తె కవన (20) ఓ కాలేజీలో చదువుతున్నది. ఆమె కొంతకాలంగా వేరే కులానికి చెందిన యువకునితో ప్రేమలో పడింది. తరచూ అతనితో ఫోన్లో మాట్లాడుతూ ఉండడంతో తండ్రి మంజునాథ్ మందలించేవాడు. అయినప్పటికీ కవన పట్టించుకునేది కాదు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి కవన ఇంట్లో నిద్రిస్తుండగా మంజునాథ్ కత్తితో ఆమెను విచక్షణారహితంగా పొడిచి చంపి, ఆపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

నైపుణ్య శిక్షణలో అంతర్జాతీయస్థాయి బ్రాండింగ్

- పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణకు ప్రత్యేక వ్యవస్థ
- 203 కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం
- తిరుపతిలో స్కిల్ వర్సిటీ, రాష్ట్రవ్యాప్తంగా హబ్స్, కాలేజీలు
- నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్

సాక్షి, అమరావతి: నైపుణ్య శిక్షణలో అంతర్జాతీయస్థాయి బ్రాండింగ్ పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న విధానాన్ని అమలు చేస్తోంది. గతంలో మాదిరిగా ఉన్న కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం కాకుండా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా కోర్సుల్లో శిక్షణ ఇచ్చేవిధంగా ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసినట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని కియా, ఎల్‌అండ్‌టీ, జేఎస్‌డబ్ల్యూ వంటి 203కు పైగా కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని వారి అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించి శిక్షణ ఇచ్చే విధంగా సాంకేతికవిద్య, వొకేషనల్ ఎడ్యుకేషన్, నైపుణ్య శిక్షణ కేంద్రాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ ప్రత్యేక వ్యవస్థను రూపొందించినట్లు వివరించారు. హై ఎండ్ స్కిల్స్ కోసం తిరుపతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో స్కిల్ యూనివర్సిటీ, దానికింద ఎన్ఎస్ఎఫ్‌క్యూ లెవెల్ 4 నుంచి 6 స్థాయి కోర్సుల్లో శిక్షణ ఇచ్చే విధంగా 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో 26 స్కిల్ కాలేజీలు, ఎన్ఎస్ఎఫ్‌క్యూ లెవెల్ 4 కంటే తక్కువ కోర్సుల్లో శిక్షణ ఇచ్చే విధంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒకటి చొప్పున మొత్తం 192 స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవి కాకుండా ఆయా పరిశ్రమల్లో స్కిల్ స్పోక్స్ కింద అవసరమైన నైపుణ్య శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్య శిక్షణలో ఆస్పిరేషన్ బ్రాండ్‌గా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఆ బాలికది ఆత్మహత్యే!

- తేల్చిన ఫోరెన్సిక్ ఆధారాలు.. వైద్య నివేదికలు
- పెనుమూరు ఘటనపై చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కావూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురంలో మైనర్ బాలిక భవ్యశ్రీ అనుమానాస్పద మృతి కేసులో చిక్కుముడి వీడింది. గత నెల 17వ తేదీన ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలిక భవ్యశ్రీ మృతి చెందగా.. ఫోరెన్సిక్ పరీక్షల్లో భవ్యశ్రీ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు తేలిందని ఎస్పీ రిషాంత్‌రెడ్డి గురువారం చెప్పారు. వైద్యాధికారుల నివేదికలు కూడా ఇదే విషయం తేల్చాయన్నారు. ఫోరెన్సిక్, వైద్యాధికారుల నివేదికల్లోని అంశాలను గురువారం మీడియాకు వెల్లడించారు. వివరాలు ఎస్పీ మాటల్లోనే.. 'బాలిక మృతిపై తల్లిదండ్రులు కొంత అనుమానం వ్యక్తం చేశారు. వారి అనుమానం మేరకు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని.. వారి ఫోన్ కాల్స్, ఇతర ఆధారాలను పూర్తిగా సేకరించాం. వారికి బాలిక మృతితో ఎలాంటి ప్రమేయం లేదని తేలింది. బాలిక కోసం 17నుంచి 20వ వ తేదీ వరకూ గాలించాం. మృతదేహం బావిలోని నీటిలో ఎక్కువ రోజులు ఉండటంతో బాగా ఉబ్బిపోయి, నాలుక బయటకు వచ్చి.. వెంట్రుకలు ఊడిపోయాయి. మృతదేహం నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్ పంపాం. ఫోరెన్సిక్ నివేదిక ఆత్మహత్య అని తేల్చింది. బాలిక బావిలో పడి ఊపిరి ఆడక మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. నలుగురు యువకులు కలిసి బాలికను ఎత్తుకెళ్లి చంపేసి బావిలో పడేశారని.. బాలిక అదృశ్యమైన రోజు ఓ వ్యక్తితో కలిసి ఆర్టీసీ బస్సులో వెళ్లిందని.. బాలిక మెడకు ఉరి బిగించి బావిలో పడేశారని.. ఆమెపై అత్యాచారం జరిగిందని.. బాలికకు గుండు గీసి, కనురెప్పలు తొలగించి, కనుగుడ్లు పీకేశారని.. మృతదేహానికి లో దుస్తులు లేవంటూ ఇలా ఎవరికి తోచిన విధంగా వారు ప్రచారం చేశారు. ఇలా వచ్చిన ప్రతి ఆరోపణపైనా విచారణ జరిపాం. అవేవీ వాస్తవాలు కాదని తేలింది.

అసలు కారణం తేలాల్సి ఉంది: భవ్యశ్రీ 20 అడుగుల బావిలో దూకింది. బయటకు రాలేక చనిపోయింది. మృతదేహం ఊపిరితిత్తుల్లో ఉన్న నీళ్లు, బావిలో ఉన్న నీళ్లను పరీక్షలకు పంపించగా.. రెండు నీళ్లు ఒక్కటేనని స్పష్టమైంది. బతికున్న వ్యక్తి నీళ్లలో పడి చనిపోతే ఊపిరితిత్తుల్లోకి నీళ్లు చేరతాయి. మృతదేహాన్ని నీళ్లలో పడేస్తే బావిలోని నీళ్లు ఊపిరితిత్తుల్లోకి వెళ్లవు. బాలిక ఇంట్లో గొడవలకు కారణం ఏమిటనే విషయంపై దర్యాప్తు ప్రారంభించాం. బాలిక కనిపించక పోవడంకు ముందురోజు కొన్ని ఫోన్స్ కాల్స్ వచ్చాయి. బాలిక తల్లిదండ్రులు విచారణకు సహకరిస్తే వీలైనంత త్వరగా కేసును పూర్తి చేస్తాం. బాలిక శరీరంపై ఎటువంటు గాయాలు లేవు. బాలిక అదృశ్యం కావడానికి రెండు రోజుల ముందు నుంచి కళాశాలకు వెళ్లలేదు. బాలిక తరచూ ప్రయాణం చేసే బస్సు కండక్టర్‌ను కూడా విచారించాం. భవ్యశ్రీ తనకు బాగా తెలుసని.. 17వ తేదీన ఆమె బస్సు ఎక్కలేదని కండక్టర్ తెలిపారు. ఆ రోజు వేణుగోపాలపురం బస్టాప్‌లో ప్రయాణికులు లేకపోవడంతో అక్కడ బస్సు ఆపలేదని కండక్టర్ స్పష్టం చేశారు. బాలికపై విష ప్రయోగం జరిగిందనే ప్రచారం కూడా సాగింది. అందులోనూ ఎటువంటి వాస్తవం లేదు. దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బాలిక మరణానికి కారణం ప్రేమ వ్యవహారమా, కుటుంబ కలహాలా విషయాన్ని తేల్చేందుకు పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది.

క్లుప్తంగా...

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు భారత్ మద్దతు

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ

న్యూఢిల్లీ: స్వతంత్ర, సార్వభౌమత్వ పాలస్తీనా దేశ ఏర్పాటుకు భారత్ మద్దతు ఇస్తోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ గురువారం చెప్పారు. భారత్ చాలా ఏళ్లుగా ఇదే వైఖరి కొనసాగిస్తోందని తెలిపారు. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు చర్చలు పునఃప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాలు శాంతియుతంగా కలిసి జీవించాలని భారత్ ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తించిన సరిహద్దుల మధ్య పాలస్తీనా ప్రజలు భద్రమైన జీవితం గడపాలన్నదే భారత్‌విధానమని, అందులో ఎలాంటి మార్పు లేదని అరిందమ్ బాగ్చీ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైన తర్వాత పాలస్తీనా అంశంపై భారత్ నుంచి ఇలాంటి ప్రకటన రావడం ఇదే మొదటిసారి. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని భారత ప్రధాని మోదీ ఖండించిన సంగతి తెలిసిందే.

ఆపరేషన్ అజయ్ 230 మందితో తొలి విమానం

జెరూసలేం: ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోయిన భారతీయులను క్షేమంగా స్వదేశానికి చేర్చడానికి భారత ప్రభుత్వం 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించింది. వారికోసం ప్రత్యేకంగా చార్టర్డ్ విమానం ఏర్పాటు చేసింది. ఉచితంగానే ఇండియాకు పంపిస్తున్నట్లు భారత విదేశాంగ వెల్లడించింది. 230 మంది భారతీయులతో మొదటి విమానం గురువారం సాయంత్రం ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌కు బయలుదేరినట్లు తెలియజేసింది. స్వదేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్న భారతీయులు ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని విదేశాంగ శాఖ సూచించింది.

యూదులకు అత్యంత ఘోరమైన రోజు: బైడెన్

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. జర్మనీలో జరిగిన నరమేధం(హోలోకాస్ట్) తర్వాత యూదులకు ఇది అత్యంత ఘోరమైన రోజు అని చెప్పారు. భయానకమైన హోలోకాస్ట్ అనుభవాలు యూదులకు మళ్లీ జ్ఞప్తికి వచ్చాయని, వారిని తీవ్ర ఆవేదనకు గురి చేశాయని అన్నారు. హమాస్ మిలిటెంట్ల దాడులను అత్యంత క్రూరమైన చర్యగా బైడెన్ అభివర్ణించారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు మానవ చరిత్రలో చేదు అధ్యాయమని అన్నారు. మిలిటెంట్లు చిన్నపిల్లల తలలు నరికేస్తారని తాను ఏనాడూ ఊహించలేదన్నారు.

'బిల్కిస్ బానో' కేసులో దోషుల శిక్ష తగ్గింపు ఫైళ్లను మా ముందుంచండి: సుప్రీం

న్యూఢిల్లీ: బిల్కిస్ బానోపై గ్యాంగ్ రేప్, ఆమె కుటుంబంలోని ఏడుగురి హత్య కేసులో దోషులకు శిక్ష తగ్గింపునకు సంబంధించిన ఒరిజినల్ ఫైళ్లన్నిటినీ తమ ముందుంచాలని సుప్రీంకోర్టు కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలను ఆదేశించింది. ఈనెల 16వ తేదీలోగా వీటిని అందజేయాలని గురువారం కోరింది. ఈ కేసులో తీర్పును రిజర్వు చేసినట్లు తెలిపింది. ఈ కేసులో 11 మంది దోషుల శిక్ష తగ్గింపును సవాల్ చేస్తూ బిల్కిస్ బానో, తదితరులు వేసిన పిటిషన్లపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఆగస్టు నుంచి విచారణ సాగిస్తోంది. 2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానో అయిదు నెలల గర్భవతి. కొందరు దుండగులు బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడటంతోపాటు మూడేళ్ల కూతురు సహా ఆమె కుటుంబంలోని ఏడుగురిని చంపేశారు. ఈ దురాగతంలో దోషులుగా తేలిన 11 మందికి కోర్టు 2008లో యావజ్జీవ కారాగారం విధించింది. ఆ శిక్షను తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం మొత్తం 11 మందినీ గత ఏడాది ఆగస్టులో విడుదల చేసింది.

'గంగాజలంపై కూడా జీఎస్టీయా..?': ఖర్గే

న్యూఢిల్లీ: హిందువులకు పవిత్రమైన గంగాజలంపై 18శాతం జీఎస్టీ విధించడం ఎంతవరకు సరైనదని కాంగ్రెస్ ప్రశ్నించింది. పూజలు, పుణ్యకార్యాల్లో వినియోగించే గంగాజలంపైన కూడా జీఎస్టీ విధించడమంటే అంతకంటే దోపిడి మరొకటి ఉండదని విమర్శించింది. ''మోదీజీ...గంగానదితో భారతీయులకి విడదీయలేని అనుబంధం ఉంది. జననం నుంచి మరణం వరకు ఆ నది జలాలు మనకి ఎంతో ముఖ్యమైనవి. అలాంటి నదీ జలాలపై 18% జీఎస్టీ ఎలా విధిస్తారు'' అని ఖర్గే తన పోస్టులో ప్రశ్నించారు. అయితే సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ కాంగ్రెస్ వ్యాఖ్యల్ని తోసిపుచ్చింది. గంగాజలంపై తాము ఎలాంటి పన్ను విధించలేదని స్పష్టం చేసింది.

పీ20 భేటీకి కెనడా గైర్హాజరు

న్యూఢిల్లీ: ఢిల్లీలో గురువారం ప్రారంభమైన జీ20 దేశాల పార్లమెంట్ స్పీకర్ల (పీ20)భేటీకి కెనడా స్పీకర్ రెమొండే గగ్నే గైర్హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన గురువారం ఢిల్లీలో పీ20 సమావేశం మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరవుతానంటూ మొదటగా ఆమె తెలిపారని, మళ్లీ ఆ నిర్ణయాన్ని మార్చుకున్నట్లు సమాచారం అందించారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి.

వైష్ణోదేవి ఆలయంలో రాష్ట్రపతి ముర్ము పూజలు

కాట్రా: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రఖ్యాత వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఆమె పూజలు చేశారు. అనంతరం 200 మీటర్ల స్కైవాక్‌తోపాటు, ఆధునీకరించిన పార్వతి భవన్‌ను ప్రారంభించారు. రాష్ట్రపతి రియాసి జిల్లా త్రికూట పర్వతాల్లో వైష్ణోదేవి ఆలయానికి చేరుకున్నారు.


ఇజ్రాయెల్‌లోని కిబ్బుట్జ్‌లో ప్రజలకు ఆయుధాల పంపిణీ


గాజా స్ట్రిప్‌లో ధ్వంసమైన శరణార్థి శిబిరం నుంచి క్షతగాత్రుల తరలింపు


ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన చిన్నారులకు గాజా సిటీలోని షిఫా ఆస్పత్రిలో చికిత్స

గాజాపై భూతల యుద్ధం!

హమాస్ మిలిటెంట్లను నిర్మూలించడమే లక్ష్యం | **సన్నాహాలు ప్రారంభించిన ఇజ్రాయెల్ సైన్యం** | **3.60 లక్షల మంది రిజర్వ్ సైనికులు సిద్ధం**

- గాజాను ఆక్రమించుకొనే యోచనలో నెతన్యాహూ ప్రభుత్వం
- ఇజ్రాయెల్–హమాస్ మధ్య పోరు ఉధృతం
- యుద్ధంలో 2,600కు చేరిన మృతుల సంఖ్య
- ఇజ్రాయెల్‌లో 1,300 మంది,
- గాజాలో 1,350 మంది మృతి

జెరూసలేం/వాషింగ్టన్: చుట్టూ ఎటు చూసినా శిథిలాలు.. వాటి కింద చిక్కుకున్న మృతదేహాలు, కడుపులో మంటలు రేపుతున్న ఆకలి, తాగునీరు కూడా లేక తడారిపోతున్న గొంతులు, రాత్రయితే కరెంటు లేక చిమ్మచీకటి, మరోవైపు మృత్యువు ఎటువైపు నుంచి దాడి చేస్తుందో, రాకెట్లు, డ్రోన్లు ఎప్పుడు వచ్చిపడతాయో, ఎవరి ప్రాణాలు గాల్లో కలిసిపోతాయోనన్న భయాందోళన. గాజాలో కనిపిస్తున్న హృదయవిదారక దృశ్యాలివీ. ఆహారం కోసం జనం దుకాణాలు, బేకరీల ముందు బారులు తీరుతున్నారు. చాలావరకు అవి ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. దుకాణాల్లో తిండిగింజలు, నిత్యావసరాలు ఎప్పుడో నిండుకున్నాయి. గాజా ప్రజలకు ఆకలి తీర్చుకోవడం, ప్రాణాలు కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యంగా మారిపోయింది. చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా మారింది. గాజా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐక్యరాజ్య సమితి శిబిరాల్లో లక్ష మందికిపైగా జనం ఆశ్రయం పొందుతున్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం ఆరో రోజు గురువారం కూడా కొనసాగింది. ఇరుపక్షాల మధ్య పోరు ఉధృతంగా మారింది. ఇజ్రాయెల్ సైన్యం గాజాపై శక్తివంతమైన రాకెట్లు ప్రయోగించింది. హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డారు. గాజా నుంచి రాకెట్ల వర్షం కురిపించారు. ఇరువర్గాల మధ్య యుద్ధంలో మృతుల సంఖ్య 2,600కు చేరింది. గాజాలో 1,350 మందికిపైగా జనం మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ గురువారం ప్రకటించింది. తమ దేశంలో 222 మందిసైనికులు సహా 1,300 మంది మృతి చెందినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

ఇజ్రాయెల్ పదాతి దళాలు సన్నద్ధం

హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా గాజాపై వైమానిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం ఇక భూతల యుద్ధానికి సన్నద్ధమవుతోంది. గాజాలో అడుగుపెట్టి, ప్రతి ఇల్లూ గాలిస్తూ మిలిటెంట్లను ఏరిపారేయడానికి మిలటరీ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. తమ దేశ భద్రతకు సవాలు విసురుతున్న మిలిటెంట్లను సమూలంగా నిర్మూలించడమే ఆశయంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. తమ పదాతి దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడమే మిగిలి ఉందని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ చెప్పారు. గ్రౌండ్ ఆపరేషన్ కోసం 3.60 లక్షల మంది రిజర్వ్ సైనికులను ఇజ్రాయెల్ సిద్ధం చేసింది. ఇజ్రాయెల్–గాజా సరిహద్దుల్లోని యూదుల కాలనీలను ఖాళీ చేయించింది. యూదులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భూతల దాడుల వల్ల గాజాలో మరణాలు భారీగా పెరుగుతాయని, సామాన్య ప్రజలు బలైపోతారని అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ పునరాలోచన చేయాలని కోరుతున్నాయి.

సిరియా ఎయిర్‌పోర్టులపై ఇజ్రాయెల్ దాడులు

సిరియాలోని రెండు విమానాశ్రయాలపై ఇజ్రాయెల్ సైన్యం గురువారం వైమానిక దాడులు నిర్వహించింది. రాజధాని డమాస్కస్‌తోపాటు అలెప్పోలోని ఎయిర్‌పోర్టులపై ఈ దాడులు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. హమాస్‌కు సిరియా అండగా నిలుస్తున్న సంగతి విదితమే. సిరియా భూభాగం నుంచి కూడా ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు జరుగుతున్నాయి. సిరియాకు చేరుకోవాల్సిన ఇరాన్ విమానాన్ని ఇజ్రాయెల్ దాడుల కారణంగా టెహ్రాన్‌కు మళ్లించారు. ఈ విమానంలో ఇరాన్ దౌత్యవేత్తలు ఉన్నట్లు సమాచారం.

బందీలను విడుదల చేస్తేనే..

40 కిలోమీటర్ల పొడవు, 10 కిలోమీటర్ల వెడల్పు విస్తీర్ణంలో ఉన్న గాజాలో 20 లక్షల మందికిగా జనం నివసిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పరిగణిస్తుంటారు. గాజాకు ఆహారం, తాగునీరు, ఇంధనం, విద్యుత్ సరఫరాను ఇజ్రాయెల్ ఇప్పటికే పూర్తిగా నిలిపివేసింది. కరెంటు లేక ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ సైనికులు, పౌరులను విడుదల చేయాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తోంది. బందీలను విడుదల చేసేంత వరకు గాజాకు ఆహారం, నీరు, ఇంధనం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ గురువారం హెచ్చరించారు. బందీలంతా విడుదలై, క్షేమంగా ఇళ్లకు చేరుకున్న తర్వాతే గాజాకు ఆహారం, నీరు, కరెంటు అందుతాయని 'ఎక్స్'లో పోస్టు చేశారు. మిలిటెంట్ల చేతిలో 150 మందికిపైగా బందీలు ఉన్నట్లు తెలుస్తోంది.


గాజా సరిహద్దుల్లో హొవిట్జర్ గన్‌లను మోహరించిన ఇజ్రాయెల్ ఆర్మీ

ఇజ్రాయెల్‌లో అలా..


ఇజ్రాయెల్‌లోని సిదెరోట్‌లో ఆత్మ రక్షణ కోసం ఎం16 అసాల్ట్ రైఫిల్‌తో షాపింగ్‌కు వచ్చిన యువతి

గాజా సిటీలో ఇలా..


గాజా సిటీలో ప్రాణాలరచేత బట్టుకుని ఇద్దరు చిన్నారులతో వీధిలో పరుగెడుతున్న బాలిక

హమాస్‌ను నలిపేస్తాం: నెతన్యాహూ



పాలస్తీనా సాయుధ తిరుగుబాటు సంస్థ 'హమాస్'ను నలిపి పారేస్తామని, పూర్తిగా ధ్వంసం చేస్తామంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతినబూనారు. తమ దేశంపై దాడి చేసి, ప్రజల ప్రాణాలను బలిగొన్న హమాస్‌పై ఆయన నిప్పులు చెరిగారు. హమాస్‌లోని ప్రతి సభ్యుడికి ఇక చావే గతి అని తేల్చిచెప్పారు. నెతన్యాహూ బుధవారం రాత్రి టీవీలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇజ్రాయెల్‌లో శనివారం హమాస్ మిలిటెంట్లు సాగించిన రాక్షసకాండను వివరించారు. అంతకుముందు ఆయనతో ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నేత బెన్నీ గాంట్జ్ సమావేశమయ్యారు. హమాస్‌పై యుద్ధాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించడానికి వీలుగా వార్–టైమ్ కేబినెట్ ఏర్పాటు చేయాలని వారు నిర్ణయించారు. ఈ కేబినెట్‌కి నెతన్యాహూ నేతృత్వం వహిస్తారు.

అండగా ఉంటాం: బ్లింకెన్

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ గురువారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. తనను తాను కాపాడుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందన్నారు. బ్లింకెన్ శుక్రవారం పాలస్తీనా అధినేత మహమ్మద్ అబ్బాస్, జోర్డాన్ రాజు అబ్దుల్లా–2తో సమావేశం కానున్నారు. పాలస్తీనియన్లకు చట్టబద్ధమైన ఆకాంక్షలు ఉన్నాయని బ్లింకెన్ వ్యాఖ్యానించారు.

శిశువు ప్రాణాలు తీయలేం

26 వారాల గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మానసిక, ఆర్థిక సమస్యలతో 26 వారాల గర్భాన్ని విచ్ఛిన్నం చేయడానికి అనుమతినివ్వాలంటూ ఒక వివాహిత వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక శిశువు ప్రాణాలు తాము తీయలేమని అన్నారు. తల్లి హక్కుతో పాటు గర్భస్థ శిశువు హక్కుల మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. తన అనారోగ్య కారణాలతో ఆరోగ్యంగా ఉన్న ఉన్న పిండం ఉసురు తీయాలని కోరుకుంటే కోర్టు ఆ పని చెయ్యదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలున్న ఒక వివాహిత మానసిక కుంగుబాటు, ఆర్థిక కారణాలతో మూడో బిడ్డను కనడానికి సిద్ధంగా లేనంటూ కోర్టుకెక్కారు. గర్భవిచ్ఛిత్తి చేసినా పిండం సజీవంగానే ఉంటుందన్న ఎయిమ్స్ వైద్యులు నివేదిక ఇవ్వడంతో ఆమె గర్భాన్ని తీయవద్దంటూ కేంద్రం కోర్టుకెక్కింది. దీనిపై ఇద్దరు న్యాయమూర్తులున్న ద్విసభ్య బెంచ్ ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ దీనిని విచారించింది. కోర్టు ఉత్తర్వుల ద్వారా బిడ్డను చంపడానికి అనుమతి కోరుతున్నారా ? అని పిటిషనర్ తరఫు లాయర్‌ని జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. ''ఆ పిండం సజీవంగా ఉంది. గర్భాన్ని విచ్ఛిన్నం చేసినా బతికే అవకాశాలున్నాయి. ఇప్పుడు ఆ పిండం గుండె చప్పుడు ఆపేయాలని మేమెలా చెబుతాం? మేము బిడ్డని చంపమని చెప్పలేం'' అని స్పష్టం చేశారు. 26 వారాలుగా గర్భాన్ని మోసిన ఆమె మరికొన్ని వారాలు మోస్తే ఆరోగ్యకరమైన శిశువు జన్మించే అవకాశం ఉందని సుప్రీం బెంచ్ అభిప్రాయపడింది. దీనిపై ఆ మహిళతో మాట్లాడి నచ్చజెప్పాలని పేర్కొంది. ఆ బాధ్యతని పిటిషనర్ లాయర్‌కి, కేంద్రానికి అప్పగిస్తూ కేసుని శుక్రవారానికి వాయిదా వేసింది. దేశంలో చట్టప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే 24 వారాల వరకు గర్భ విచ్ఛిన్నానికి అవకాశం ఇస్తారు.

ప్రపంచ ఆకలి సూచీలో...

మనకు 111వ స్థానం

దురుద్దేశ పూరితం: కేంద్రం • లోపభూయిష్టమంటూ ధ్వజం

న్యూఢిల్లీ: ప్రపంచ ఆహార సూచీ–2023లో భారత్ 111వ స్థానంలో నిలిచింది. గురువారం విడుదల చేసిన ఈ సూచీలో మొత్తం 125 దేశాల్లో మనకు ఈ ర్యాంకు దక్కింది. దీన్ని లోపభూయిష్టమైనదిగా కేంద్రం కొట్టిపారేసింది. 'ఇది తప్పుడు ర్యాంకింగ్. దురుద్దేశపూర్వకంగా ఇచ్చిన బాపతు' అంటూ మండిపడింది. అన్ని రకాలుగా పీకల్లోతు సంక్షోభంలో మునిగిన పాకిస్తాన్ (102), అంతే సంక్షోభంలో ఉన్న శ్రీలంక (60)తో పాటు బంగ్లాదేశ్ (81), నేపాల్ (61) మనకంటే చాలా మెరుగైన ర్యాంకుల్లో ఉండటం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. 28.7 స్కోరుతో ఆకలి విషయంలో భారత్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని నివేదిక చెప్పుకొచ్చింది. 27 స్కోరుతో దక్షిణాసియా, సహారాకు దక్షిణాన ఉన్న ఆఫ్రికా ప్రాంతాలు ఆకలి సూచీలో టాప్‌లో ఉన్నట్టు చెప్పింది. 'భారత బాలల్లో పౌష్టికాహార లోపం తీవ్రంగా 18.7గా ఉంది. ఐదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు 3.1 శాతం, 15–24 ఏళ్ల లోపు మహిళల్లో రక్తహీనత ఉన్నవారి సంఖ్య ఏకంగా 58.1 శాతం ఉన్నాయి' అని పేర్కొంది. వాతావరణ మార్పులు, కల్లోలాలు, మహమ్మారులు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటివి ఆకలి సమస్యను ఎదుర్కోవడంలో అవరోధాలుగా నిలిచాయని సర్వే పేర్కొంది. ఇదంతా అభూత కల్పన అంటూ కేంద్రం మండిపడింది. 'ఇది తప్పుడు పద్ధతులు వాడి రూపొందించిన సూచీ. కేవలం 3,000 మందిపై నిర్వహించిన ఒపీనియన్ పోల్ ఆధారంగా పౌష్టికాహార లోపం శాతాన్ని నిర్ధారించడం క్షమార్హం కాని విషయం. దాంతో బాలల్లో వాస్తవంగా కేవలం 7.2 శాతమున్న పౌష్టికాహార లోపాన్ని ఏకంగా 18.7గా చిత్రించింది. దీని వెనక దురుద్దేశాలు ఉన్నాయన్నది సుస్పష్టం' అంటూ విమర్శించింది.

పట్టాల్లో లోపాలే కారణం కావొచ్చు

నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై రైల్వే శాఖ

న్యూఢిల్లీ: బిహార్‌లోని బక్సర్ జిల్లా రఘునాథ్‌పూర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి పట్టాల్లో లోపాలే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఢిల్లీ నుంచి అస్సాంకు వెళ్తున్న కామాఖ్య ఎక్స్‌ప్రెస్ రైలింజన్‌తోపాటు మొత్తం 23 బోగీలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 8 ఏళ్ల చిన్నారి, ఆమె తల్లి సహా నలుగురు చనిపోయారు. లోకో పైలట్, కో పైలట్ సహా 30 మంది వరకు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురిని పట్నా ఆస్పత్రికి తీసుకెళ్లామని ఈస్ట్ సెంట్రల్ రైల్వే(ఈసీఆర్) తెలిపింది. ఘటన సమయంలో రైలు గంటకు 128 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్లు నివేదిక తెలిపింది. ప్రమాదానికి కొద్ది క్షణాలకు ముందు పట్టాలు తీవ్రంగా కంపించడం, భారీ కుదుపులు, బ్రేక్ పైప్ ప్రెషర్ అకస్మాత్తుగా పడిపోవడం వంటివి జరిగాయని లోకో పైలట్ వెల్లడించారని వివరించింది. వీటిని బట్టి, పట్టాల్లో లోపాలే ప్రమాదానికి దారితీసినట్లు అంచనా వేస్తున్నామని తెలిపింది. ఘటనతో రైల్వే శాఖకు సుమారు రూ.52 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నివేదిక పేర్కొంది. ప్రమాద సమయంలో రైలులో ప్రయాణిస్తున్న సుమారు 1,500 మందిలో వెయ్యి మందిని ప్రత్యేక రైలులో గమ్యస్థానాలకు పంపించినట్లు నార్త్ ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే ప్రకటించింది. ఘటన ప్రాంతాన్ని రైల్వే భద్రతా సిబ్బంది దిగ్బంధించారు. భారీ క్రేన్లు, యంత్రాలతో రైలు బోగీలను పక్కకు తొలగించే ప్రయత్నాలు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రమాదం కారణంగా రైలు పట్టాలు, విద్యుత్ వ్యవస్థలు, స్తంభాలు దెబ్బతిన్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. దీంతో, ఆ మార్గంలో వెళ్లే 21 రైళ్లను అధికారులు దారి మళ్లించారన్నారు. ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించారని ఈసీఆర్ సీపీఆర్‌వో(చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్) బీరేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేస్తామన్నారు.

భారత్ స్వరం మరింత బలపడుతోంది

ఉత్తరాఖండ్ ర్యాలీలో ప్రధాని మోదీ

పిథోర్‌గఢ్: సవాళ్లతోనిండిన ప్రపంచంలో భారత్ వాణి మరింత బలపడిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఇటీవల ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించి భారత్ సత్తా చాటుకుందని తెలిపారు. గురువారం ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి గత 30, 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై సైతం తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. చంద్రయాన్–3 మిషన్ విజయవంతమైందని తెలిపిన ప్రధాని మోదీ, చంద్రుడిపై వేరే ఏ దేశమూ చేరుకోని ప్రాంతంలోకి మనం వెళ్లగలిగామన్నారు. 'ఒక సమయంలో దేశంలో నిరాశానిస్పృహలు ఆవరించి ఉండేవి. వేల కోట్ల రూపాయల కుంభకోణాల చీకట్ల నుంచి దేశం ఎప్పుడు బయటపడుతుందా అని ప్రజలు ప్రార్థించేవారు. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిని అప్పటి ప్రభుత్వాలు విస్మరించాయి. వెనుకబడిన ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ప్రజలు వలస బాట పట్టారు. పరిస్థితులు మారి అలా వెళ్లిన వారంతా ఇప్పుడు తిరిగి సొంతూళ్లకు వస్తున్నారు'అని ప్రధాని చెప్పారు. 'ప్రపంచమంతటా సవాళ్లు నిండి ఉన్న ప్రస్తుత తరుణంలో భారత్ వాణి గట్టిగా వినిపిస్తోంది. ప్రపంచానికే భారత్ మార్గదర్శిగా మారడం మీకు గర్వకారణం కాదా? ఈ మార్పు మోదీ తీసుకువచ్చింది కాదు. రెండోసారి మళ్లీ అధికారం అప్పగించిన 140 కోట్ల దేశ ప్రజలది'అని ప్రధాని అన్నారు. గత అయిదేళ్లలో 13.50 కోట్ల ప్రజలను పేదరికం నుంచి తమ ప్రభుత్వం బయటకు తీసుకువచ్చిందన్నారు. పేదరికాన్ని అధిగమించగలమని దేశం నిరూపించిందని చెప్పారు. ఉత్తరాఖండ్ ప్రజలు తనను కుటుంబసభ్యునిగా భావించారని చెప్పారు. రూ.4,200 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు.

ఆదికైలాస శిఖరంపై ప్రధాని ధ్యానం

అంతకుముందు, రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉదయం జోలింగ్‌కాంగ్ చేరుకున్న ప్రధాని మోదీకి సీఎం పుష్కర్ సింగ్ ధామి ఘన స్వాగతం పలికారు. జోలింగ్‌కాంగ్‌లోని పార్వతీ కుండ్ వద్ద ఉన్న శివపార్వతీ ఆలయంలో ఆరతిచ్చి, శంఖం ఊదారు. గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించిన ప్రధాని పరమేశ్వరుని నివాసంగా భావించే ఆది కైలాస పర్వత శిఖరాన్ని సందర్శించుకున్నారు. అక్కడ కాసేపు ధ్యానముద్రలో గడిపారు. అనంతరం అక్కడికి 36 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరిహద్దు గ్రామం గుంజికి చేరుకున్నారు. అక్కడి మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. స్థానికులను ప్రధాని ఆప్యాయంగా పలకరించారు. ఉన్ని దుస్తులు, కళారూపాలతో ఏర్పాటైన ప్రదర్శనను తిలకించారు. భద్రతా సిబ్బందితోనూ ప్రధాని ముచ్చటించారు. అక్కడ్నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్మోరా జిల్లాలో పురాతన శివాలయం జగదేశ్వర్ ధామ్‌కు వెళ్లారు. అక్కడున్న జ్యోతిర్లింగానికి ప్రదక్షిణలు, పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రధాని పిథోర్‌గఢ్‌కు చేరుకున్నారు.

కైలాస శిఖరంపై ధ్యాన ముద్రలో ప్రధాని మోదీ



అత్యల్పానికి నిరుద్యోగిత: మోదీ

న్యూఢిల్లీ: నానాటికీ దూసుకుపోతున్న భారత ఆర్థిక వ్యవస్థ యువతకు సరికొత్త ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫలితంగా ప్రస్తుతం దేశంలో నిరుద్యోగిత గత ఆరేళ్లలో అతి తక్కువగా నమోదైందని తెలిపారు. తాజాగా జరిపిన ఓ సర్వేలో ఈ మేరకు తేలిందని వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ శాఖ కౌశల్ దీక్షాంత్ సమారోహ్‌ను ఉద్దేశించి గురువారం ఆయన వీడియో సందేశమిచ్చారు. భారత్‌లో కొన్నేళ్లుగా ఉపాధి కల్పన కొత్త శిఖరాలకు చేరుతోందంటూ హర్షం వెలిబుచ్చారు. ''దేశంలో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరుద్యోగిత బాగా తగ్గుముఖం పడుతోంది. అభివృద్ధి ఫలాలు పల్లెలను చేరుతున్నాయనేందుకు ఇది నిదర్శనం. ప్రగతిలో అవిప్పుడు పట్టణాలతో పోటీ పడుతూ దూసుకుపోతున్నాయి. అంతే కాదు, పనిచేసే మహిళల సంఖ్య భారీగా పెరుగుతుండటం మరో సానుకూల పరిణామం. ఇదంతా మహిళా సాధికారత దిశగా కొన్నేళ్లుగా కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాల పర్యవసానమే'' అని మోదీ చెప్పారు.

సనాతన ధర్మం... భారత్‌కు మారుపేరు

దానికి వినాశనమే లేదు: భగవత్



చండీగఢ్: సనాతన ధర్మం భారత్‌కు పర్యాయపదమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. దేశ సంస్కృతి సనాతన ధర్మం మీదే ఆధారపడి ఉందని చెప్పారు. అలాంటి ధర్మాన్ని నాశనం చేయాలనుకోవడం స్వీయ హానితో సమానమని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయాలంటూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ గత నెల చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా మంటలు రేపుతుండటం తెలిసిందే. వాటిని ఉద్దేశించి భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన గురువారం హరియాణాలోని రోహతక్‌లో బాబా మస్త్‌నాథ్ మఠంలో ఒక కార్యక్రమంలో మాట్లాడారు. సనాతనమంటేనే ఎప్పటికీ నిలిచి ఉండేదని, మన ధర్మం కూడా అంతేనని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి వీకే సింగ్, యోగ గురు రామ్‌దేవ్, పలువురు సాధు ప్రముఖులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా పరిష్కారం కోసం అంతా భారత్ కేసే చూస్తున్నారని ఆదిత్యనాథ్ అన్నారు. ఒకప్పుడు అసాధ్యమనుకున్న అయోధ్య రామాలయ నిర్మాణం ఇప్పుడు కళ్లముందు కన్పిస్తున్న వాస్తవమని చెప్పారు. అంతకుముందు ఉదయం జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మహంత్ శ్రీచంద్‌నాథ్ యోగి విగ్రహాన్ని మఠంలో ఆవిష్కరించారు.

ఇజ్రాయెల్ నుంచి 114 మంది తమిళుల పయనం

సాక్షి, చెన్నై: ఇజ్రాయెల్‌లోని 114 మంది తమిళులు సాయం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. ఆపరేషన్ అజయ్ మేరకు ఈ తమిళులను ఢిల్లీకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధం తీవ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్‌లోని తమిళుల విద్యార్థులు, ఉద్యోగులు 114 మంది భారత్‌కు తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఢిల్లీలోని భారత రాయబార కార్యాలయ వర్గాల ద్వారా వీరిని భారత్‌కు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఢిల్లీకి చేరుకునే వీరిని తమిళనాడుకు తీసుకొచ్చేందుకు ప్రత్యేక అధికారుల బృందం రంగంలోకి దిగింది.

ఎన్‌కౌంటర్‌లో రౌడీల హతం

రౌడీలు, కిరాయి ముఠాల భరతం పట్టే విధంగా గురువారం ఉదయం ఆవడి, చెంగల్పట్టు పోలీసులు దూకుడు ప్రదర్శించారు. చోళవరం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు రౌడీలు హతమయ్యారు. అలాగే మామండూరు వద్ద జరిగిన తుపాకీ కాల్పుల్లో ఓ రౌడీ తీవ్రంగా గాయపడ్డారు. మరో రౌడీ పోలీసులకు దొరికాడు. కాగా ఈ ఎన్‌కౌంటర్లు బూటకం అంటూ ప్రజా సంఘాలు, హతుల కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

- రెండు చోట్ల ఎదురు కాల్పులు
- ఇద్దరు మృతి
- ఆసుపత్రి పాలైన మరో రౌడీ
- పోలీసుల అదుపులో కరి మురుగన్
- ముగ్గురు పోలీసులకు గాయాలు


గాయపడిన పోలీసును పరామర్శిస్తున్న ఆవడి కమిషనర్ శంకర్

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో ఇటీవల కాలంగా రౌడీలు, కిరాయి ముఠాలు చాప కింద నీరులా తమ కార్యాకలాపాలు చేస్తుండడం తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. గత వారం సీఎం స్టాలిన్ నేతృత్వంలో జరిగిన జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారుల సమావేశంలో రౌడీల భరతం పట్టే విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. చెన్నై, శివార్లలో కిరాయి ముఠాలుగా ఏర్పడిన రౌడీలు, రాజకీయ నాయకులకే కాదు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులకు తీవ్ర బెదిరింపులు ఇస్తూ, కిడ్నాప్‌లు, హత్యలకు పాల్పడుతుండటం కలకలం రేపింది. ఈ ఘటనలపై సీఎం స్టాలిన్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పోలీసులకు సర్వాధికారాలు అప్పగిస్తూ, రౌడీలపై ఉక్కు పాదం మోపే విధంగా ఆదేశాలు ఇచ్చారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు

డీజీపీ శంకర్ జివ్వాల్ పర్యవేక్షణలో చెన్నై పోలీసుల కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్, తాంబరం కమిషనర్ అమల్ రాజ్, ఆవడి కమిషనర్ శంకర్‌ల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రెండు రోజుల క్రితం ఈ కమిషనర్లు సమావేశం జరిగింది. దందాలు నడుపుతున్న వారి జాబితాలో కీలకంగా ఉన్న రౌడీల కోసం వేట మొదలెట్టారు. ఇందులో చెన్నై శివారులోని రెడ్‌హిల్స్ చోళయమ్మన్ నగర్‌కు చెందిన ముత్తు శరవణన్(40)ను పోలీసులు టార్గెట్ చేశారు. ఇతగాడిపై పాడియనల్లూరు అన్నాడీఎంకే నేత పారి బస్ హత్యకేసు, మడిపాక్కం డీఎంకే నేత సెల్వం హత్య కేసుతో పాటుగా పదుల సంఖ్యలో హత్య, దోపిడీ, కిడ్నాప్ కేసులు ఉన్నట్టు గుర్తించారు. తనను పోలీసులు టార్గెట్ చేయడంలో ఇతగాడు అజ్ఞాతంలోకి వెళ్లాడు.

ఎదురు కాల్పుల్లో..

కిరాయి ముఠా నాయకుడిగా, దాదాగా చెలమణిలో ఉన్న ముత్తు శరవనన్‌ను పట్టుకునేందుకు ఆవడి కమిషనర్ శంకర్ ఆదేశాలతో అదనపు కమిషనర్ విజయకమార్, డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణన్, అసిస్టెంట్ కమిషనర్ జవహర్ నేతృత్వంలోని బృందం తీవ్ర సోదాలలో నిమగ్నమై ఉంది. ఈ పరిస్థితులలో రెడ్‌హిల్స్ సమీపంలోని అరుమందై పుదుర్ వద్ద ఉన్న కండిగై గ్రామంలోని ఓ పాత భవనంలో తన అనుచరుడు సండే సతీష్(34)తో ముత్తు శరవణన్ ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయాన్నే రంగంలోకి దిగారు. అతడు ఉన్న పాత భవనాన్ని చుట్టుముట్టారు. దీంతో తన వద్ద ఉన్న తుపాకీతో పోలీసులపై ముత్తు శరవనన్ కాల్పులు జరిపాడు. సండే సతీష్ సినీ ఫైట్ తరహాలో పోలీసులపై దాడి చేశాడు. దీంతో పోలీసులు ఆత్మ రక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చింది. దీంతో సంఘటనా స్థలంలోనే ముత్తు శరవన్ కుప్పకూలాడు. తీవ్రంగా గాయపడ్డ సండే సతీష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ ఇద్దరి మృత దేహాలను స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. రౌడీల దాడీలో గాయపడ్డ పోలీసులు కృష్ణమూర్తి, రాజేష్, లిబిలను స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. వీరిని డీజీపీ శంకర్ జివ్వాల్ పరామర్శించారు. మీడియాతో ఆవడి కమిషనర్ శంకర్ మాట్లాడుతూ రౌడీలను పట్టుకునే క్రమంలో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపక తప్పలేదన్నారు. తమ సిబ్బంది ముగ్గురు గాయపడ్డారని పేర్కొన్నారు. ఈ ఘటనపై మేజిస్ట్రేట్ విచారణ సాగుతున్నట్లు తెలిపారు.


ముత్తు శరవణన్ మృతదేహం


సండే సతీష్ మృతదేహం


గాయపడిన తనికాచలం

చెంగల్పట్టులో..

చోళవరం ఎన్‌కౌంటర్ చర్చకు దారి తీసిన నేపథ్యంలో చెంగల్పట్టు సమీపంలోని మామండూరులో పోలీసు కాల్పులలో రౌడీ తీవ్రంగా గాయపడ్డాడు. తిరువళ్లూరు జిల్లా పెరియపాళయానికి చెందిన తనికా చలం(35)పై తిరువళ్లూరు, చెంగల్పట్టు, తిరువారూర్, విరుదునగర్, తూత్తుకుడిలో పోలీసు కేసులు ఉన్నాయి. కిరాయి ముఠా నాయకుడిగా వ్యవహరిస్తున్న ఇతగాడి కోసం పోలీసులు గాలిస్తూ వచ్చారు. చెంగల్పట్టు తాలుకా ఇన్‌స్పెక్టర్ పుగుల్, ఎస్‌ఐలు రాజ, ప్రతాప్ బృందం గాలిస్తూ వచ్చింది. ఇతడు చెన్నైలో దాగి ఉన్న సమాచారంతో బుధవారం రాత్రి రంగంలోకి దిగి అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం చెంగల్పట్టు తాలుకా స్టేషన్‌కు తరలించి విచారించారు. గురువారం ఉదయం అతడ్ని చిట్టామూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. సినీ ఫక్కీలో పోలీసు వాహనం నుంచి దూకి పారిపోయే యత్నం చేశారు. దీంతో పోలీసుల కాల్పులు జరిపారు. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలతో చెన్నై రాజీవ్ గాంధీ జీహెచ్‌లో తనికాచలం చికిత్స పొందుతున్నాడు. అదే సమయంలో అజ్ఞాతంలో ఉన్న శింగ పెరుమాల్ కోవిల్ జేజే నగర్ కరి మురుగన్(35)కు ఎన్‌కౌంటర్ భయం పట్టుకున్నట్టుంది. గస్తీలో ఉన్న పోలీసుల తనిఖీ సమయంలో ఇతగాడు పట్టుబడ్డాడు. రౌడీల భరతం పట్టే విధంగా పోలీసులు దూకుడుగా ముందుకు సాగినా, ఇవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లుగా ప్రజాసంఘాలు, హతుల కుటుంబీకులు పేర్కొంటున్నాయి. తమ వాళ్లను పట్టుకెళ్లి హతమార్చినట్లు వారు ఆరోపిస్తున్నాయి.

కావేరి తీర్మానంపై కేంద్రానికి నివేదిక

- మంత్రి దురై మురుగన్ వెల్లడి



సాక్షి, చెన్నై : అసెంబ్లీలో కావేరి జలాల కోసం చేసిన తీర్మానం నివేదికను కేంద్రానికి పంపించామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్ తెలిపారు. శుక్రవారం జరిగే కావేరి యాజమాన్య సంస్థ భేటీలో నీటి కోసం ఒత్తిడి తెస్తామన్నారు. గురువారం స్థానికంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కావేరిలో కొంత మేరకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. అయితే కరువై పంటను రక్షించుకోవాలంటే, సెకనుకు 16 వేల క్యూసెక్కుల నీళ్లు తప్పనిసరి అవసరం అని వివరించారు. ఇందుకోసమే తాము తీవ్ర పోరాటం చేస్తున్నామన్నారు. కావేరి రెగ్యులేటరీ బోర్డులో ఇప్పటికే ఒత్తిడి తెచ్చినా సెకనుకు 3 వేల క్యూసెక్కులను ఈనెలాఖరు వరకు విడుదల చేయాలన్న ఆదేశాలు వెలువడ్డాయని తెలిపారు. ఈ వ్యవహారంలో శనివారం జరిగే కావేరి యాజమాన్య సంస్థ ఎలాంటి ఉత్తర్వులు ఇస్తుందో వేచిచూడాల్సి ఉందన్నారు. తమకు సెకనుకు 16 వేల క్యూసెక్కుల నీటి విడుదలకు పట్టుబట్టినట్లు వివరించారు. తమిళనాడుకు కావేరి జలాలే లక్ష్యంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని, ఈమేరకు అసెంబ్లీ వేదికగా చేసిన ప్రత్యేక తీర్మానాన్ని కేంద్రానికి పంపించామన్నారు. కావేరి డెల్టాలో పోరాటాలు కేవలం హక్కుల కోసం జరుగుతున్నవేనని మంత్రి ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చా రు. ఇదిలా ఉండగా కర్ణాటక, నదీతీరాల్లో వర్షాలతో కావేరిలోకి నీటి రాక పెరిగింది. గురువారం సాయంత్రానికి హొగ్నెకల్ వద్ద నీటి ఉధృతి కనిపించింది. ఫలితంగా మేట్టూరు జలాశయంలోకి సెకనుకు 18 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కొత్తగిరి సమీపంలో చిరుత కలకలం



తిరువొత్తియూరు: నీలగిరి జిల్లా కొత్తగిరి సమీపంలో రోడ్డుపై చిరుత సంచారిస్తుండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వివరాలు.. ఎంకైక్కాట్టి ప్రాంతంలో బుధవారం రాత్రి రోడ్డుపై చిరుత సంచరిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో దీని గురించి అటవీ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, స్థానికులకు భరోసా కలిగించారు.

న్యూస్‌రీల్

డెంగీ నివారణ మిషన్‌లో 3,542 మంది ఉద్యోగులు

- ప్రజారోగ్య శాఖ వెల్లడి

కొరుక్కుపేట: డెంగీ జ్వరాల నివారణలో ఇప్పటికే 23 వేల మంది వరకు పనిచేస్తుండగా, అదనంగా 3,542 మంది ఉద్యోగులు చేరారు. అలాగే గ్రామాల్లోని ప్రతి పంచాయతీకి ఓ ఆరోగ్య అధికారిని, నగరాల్లోని ప్రతి వార్డుకు ఓ ఆరోగ్య సిబ్బంది నియమిస్తామని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా చేరిన ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి డెంగీ నివారణ చర్యలను రొటేషన్ పద్ధతిలో పర్యవేక్షిస్తారని వెల్లడించారు. డెంగీ దోమల నిర్మూలనకు అయ్యే ఖర్చును కూడా వారికి అందజేస్తామని ప్రజారోగ్య శాఖ తెలిపింది. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నంబర్‌లు 044-29510400, 044- 29510500 , 94443 40496, 87544 48477ను సంప్రదించాలని ఆ శాఖ కోరింది.

కరోనా సేవలకు అదనపు మార్కులు

కొరుక్కుపేట: గ్రామీణ ఆరోగ్య నర్సుల నియామకంలో కరోనా మహమ్మారి సమయంలో పనిచేసిన వారికి ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలని తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడులో 2,250 అసిస్టెంట్ నర్సు ఖాళీలు ఉన్నాయి. విలేజ్ హెల్త్ నర్స్ పోస్టులకు https://www.mrb.tn.gov.in/ వెబ్‌సైట్ ద్వారా 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మెడికల్ స్టాఫ్ సెలక్షన్ బోర్డు నోటిఫికేషన్ బుధవారం విడుదల చేసింది. దీనిని అనుసరించి కరోనా మహమ్మారి సమయంలో పనిచేసిన నర్సులకు గ్రామ ఆరోగ్య నర్సుల నియామకానికి ప్రోత్సాహకాలు అందించాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించి, అన్ని రకాల ప్రభుత్వ ఆసుపత్రులు, కరోనా కేర్ సెంటర్లలో పనిచేసిన నర్సులకు ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలని తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో.. కరోనా మహమ్మారి సమయంలో 6 నుంచి 12 నెలలు పనిచేసిన వారి 2 మార్కులు, 12 నుంచి 18 నెలలు పనిచేసిన వారికి 4 మార్కులు, 18 నుంచి 24 నెలలు పని చేసిన వారికి 4 మార్కులు. 24 నెలలకు పైగా పనిచేసిన వారికి అదనంగా 5 మార్కులు ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన అభ్యర్థులు, వారి సేవలను నిర్ధారించడానికి, అవసరమైన కరోనా వర్క్ సర్టిఫికెట్‌ను సంబంధిత అధికారుల నుంచి పొంది.. తర్వాత గవర్నర్‌కు సమర్పించాలి పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మరో ఆరుగురికి జన్యు పరీక్ష

- త్వరలో ఫోరెన్సిక్ టెస్టుకు పంపాలని నిర్ణయం

కొరుక్కుపేట: పుదుకోట్టై జిల్లా వేంగైవాయల్ గ్రామంలోని డ్రింకింగ్ ట్యాంక్‌లో మలమూత్రాలు కలవడం కలకలం రేపింది. ఈ ఘటనపై ప్రత్యేక పోలీసులు దర్యాప్తు చేస్తుండగా కేసును సీబీసీఐడీకి బదిలీ చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న 25 మందికి జన్యు పరీక్షలు నిర్వహించారు. దీనికోసం రక్త నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ సైన్స్ పరీక్షలు కోసం చెన్నైకి పంపారు. ఇప్పటి వరకు 25 మందికి జన్యు పరీక్ష నిర్వహించగా, మరో ఆరుగురికి తాజాగా ఈ పరీక్షలు నిర్వహించాలని ఈనెల 6న పుదుక్కోట్ జిల్లా క్రైమ్ నిరోధక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో గురువారం ఆరుగురికి జన్యు పరీక్షలు నిర్వహిస్తున్నారు. పోలీసులు పుదుకోట్టై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారి రక్త నమూనాలను సేకరించారు. తద్వారా ఫోరెన్సిక్ సైన్స్ ప్యారీ టెస్ట్‌కు అవసరమైన భాగాలను త్వరలో ఈ నమూనాలను అందించనున్నట్లు సీబీసీఐడీ పోలీసులు తీసుకురానున్నారు. ఆ తర్వాత ఈ ఘటనకు నిందితులు ఈ ఘటనకు పాల్పడ్డారా? అనేది తేలనుందని అధికారులు వివరించారు.

విళాత్తికుళం ప్రజల దాహార్తి తీర్చిన విశాల్



తమిళ సినిమా: మంచి నీటి సమస్యను తీర్చినందుకు గానూ విళాత్తికుళం ప్రజలు నటుడు విశాల్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వివరాలు.. నటుడు విశాల్ ఇంతకు ముందు హరి దర్శకత్వంలో తామరభరణి, పూజై వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తాజాగా మరో సారి ఈ కాంబినేషన్ మూడవ చిత్రం ఇటీవలే ప్రారంభమైంది. తూత్తుక్కుడి జిల్లా, విళాత్తికుళం సమీపంలోని ఎ.కుమార్ సక్కనపురంలో చిత్రీకరణను జరుపుకుంటోంది. కాగా ఆప్రాంత ప్రజలు తాగు నీరు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. దీంతో వారి మొరను విశాల్‌తో విన్నవించుకుని, మంచి నీరు సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. దీంతో విశాల్ వెంటనే స్పందించి తన దేవి ట్రస్ట్ ద్వారా ఓ ప్రాంతంలో ఒకపెద్ద బావిని కట్టించనున్నట్లు వారికి హామీ ఇచ్చారు. దీని గురించి తాను మేనేజర్ హరికృష్ణన్ అందుకు తగిన ఏర్పాట్లు చేయ మని ఆదేశించారు. దీంతో దేవీ ట్రస్ట్ తరఫున హరికృష్ణన్, ఎం.కుమార్, సక్కనపురం గ్రామాధికారి రామకృష్ణన్, తూత్తుక్కుడి మక్కళ్ నల ఇయక్కమ్ అధ్యక్షుడు ప్రకాష్‌లో ఆధ్వర్యంలో మంచినీటి బావిని తవ్వించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు విశాల్ ధన్యవాదాలు తెలిపారు.

వైద్యవృత్తిని అదృష్టంగా భావించాలి


ఫస్టియర్ విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: వైద్యవృత్తిని అదృష్టంగా భావించి సేవలను అందించాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సూచించారు. తిరువళ్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చేరిన 2023-24 మొదటి సంవత్సరం విద్యార్థులను ఆహ్వానించే కార్యక్రమం గురువారం ఉదయం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మొదటి సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అనంతరం జ్యోతి ప్రజల్వన చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులను ప్రేమగా మాట్లాడడంతో పాటు వారికి భోరోసా కలిగించే సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

లాటరీ మార్టిన్‌పై ఐటీ గురి

- కోవైలో విస్తృతంగా సోదాలు

సాక్షి, చెన్నై: కేరళ లాటరీ కింగ్ మార్టిన్‌ను టార్గెట్ చేసి గురువారం ఐటీ అధికారులు కోయంబత్తూరులో సోదాల్లో నిమగ్నమయ్యారు. ఈమేరకు మార్టిన్ ఇళ్లు, కార్యాలయాల్లో తీవ్ర స్థాయిలో తనిఖీలు చేపడుతున్నారు. వివరాలు.. కేరళలో లాటరీ విక్రయలకు ప్రభుత్వ అనుమతి ఉన్న విషయం తెలిసిందే. ఇందులో కింగ్‌గా లాటరీ మార్టిన్ వ్యవహరిస్తున్నారు. కేరళకు చెందిన మార్టిన్‌కు తమిళనాడులోని కోయంబత్తూరులో బ్రహ్మండ భవంతితో పాటు, ప్రత్యేక కార్యాలయాలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో ఉదయాన్నే కేరళ రిజిస్ట్రేషన్ కల్గిన పలు వాహనాల్లో ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. కోయంబత్తూరు వెల్ల కినర్‌లోని ఆయన నివాసంలో రెండు బృందాలు, సమీపంలోని కార్యాలయంలో మరో రెండు బృందాలు సోదాలు చేస్తున్నాయి. అలాగే గాంధీపురంలోని మరో కార్యాలయంలోనూ సోదాలు జరుగుతున్నాయి. పన్ను ఎగవేతకు సంబంధించి ఈ తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.

విజిలెన్స్ దాడులు..

ఈరోడ్ జిల్లా గోబి చెట్టి పాళయానికి చెందిన రామేశ్వరం మురుగన్ రాష్ట్ర ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆయన తన కుటుంబంతో చెన్నైలో ఉన్నారు. స్వగ్రామం గోబిలో ఆయన తల్లిదండ్రులు చిన్న స్వామి, మంగయ కరశిలు,అగ్రహార వీధిలో ఆయన మామ అరివుడై నంబి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఈరోడ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్ ఇన్‌స్పెక్టర్ రేఖ నేతృత్వంలో రెండు బృందాలు సోదాలలో నిమగ్నమయ్యాయి. ఈ రెండు నివాసాలతో పాటు అరివుడై నంబికి బజార్ వీధిలో నగల దుకాణం ఉన్న సమాచారంతో మరో బృందం తనిఖీలు చేపట్టింది. ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాల ఫిర్యాదు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతున్నట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో బీజేపీ నేత రాజా

సాక్షి, చెన్నై : బీజేపీ సీనియర్ నేత హెచ్ రాజా ఆస్పత్రిలో చేరారు. గురవారం ఆయనకు గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరిగింది. బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ జాతీయ కార్య నిర్వాహక సభ్యుడు రాజ గత నాలుగైదు రోజులుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. బుధవారం రాత్రి ఆయనకు శ్వాస సమస్య తలెత్తింది. కుటుంబీకులు ఆయన్ని చెన్నై గ్రీమ్స్ రోడ్డులోని ఆసుపత్రికి తరలించారు. పరిశోధించిన వైద్యులు గుండె నాళాల్లో బ్లాక్‌లను గుర్తించారు. గురువారం ఉదయం శస్త్ర చికిత్స ద్వారా స్టంట్‌లు అమర్చారు. వైద్యుల పర్యవేక్షణలో రాజా ఉన్నారు.

ఇసుక క్వారీల్లో ఈడీ సోదాలు

సాక్షి, చెన్నై : తంజావూరు జిల్లా పరిధిలోని కావేరి తీరంలో ఉన్న ఇసుక క్వారీలలో గురువారం ఈడీ అధికారులు పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించారు. గత నెల ఈడీ అధికారులు చెన్నై, పుదుకోట, కరూర్, కోయంబత్తూర్ తంజావూరు తదితర జిల్లాలలోని ఇసుక కాంట్రాక్టర్లను గురిపెట్టి తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో లభించిన ఆధారాల మేరకు తదుపరి విచారణను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం కరూర్‌లోని ఇసుక క్వారీలలో తనిఖీలు జరిగాయి. ఈ సమయంలో గురువారం తంజావూరు జిల్లా తిరుమయం పరిధిలోని కావేరి తీరంలో ఉన్న ఇసుక క్వారీలలో ఈడీ అధికారులు పదుల సంఖ్యలో రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహించారు. ఆ పరిసరాలను డ్రోన్ కెమెరాల ద్వారా వీడియో చిత్రీకరించారు. ఇసుక క్వారీ నుంచి ఏ మేరకు తవ్వకాలు జరుగుతున్నాయి. లారీల్లో లోడింగ్ ఏఏ ప్రాంతాలకు తరలిస్తున్నారు అనే వివరాలను సేకరించారు. పొద్దుపోయే వరకు ఈ తనిఖీలు సాగాయి.

మంత్రి చంద్ర ప్రియాంక రాజీనామాపై స్పందించిన ఎల్జీ


చంద్ర ప్రియాంక, తమిళిసై

సాక్షి, చెన్నై: చంద్ర ప్రియాంకను ఆరు నెలల క్రితమే మంత్రి పదవి నుంచి తొలగించాలని సీఎం రంగస్వామి తన దృష్టికి తెచ్చారని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. వివరాలు.. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని రవాణా శాఖ మంత్రి చంద్ర ప్రియాంక రెండు రోజుల క్రితం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పుదుచ్చేరిలో ఏకైక మహిళ మంత్రిగా ఉన్న ఆమె రాజీనామా స్థానికంగా చర్చకు దారి తీసింది. అదే సమయంలో తాను రాజీనామా చేయడానికి వ్యక్తిగతంగా, సామాజికంగా దాడులకు గురైనట్లు ప్రకటించడం మరింత వివాదానికి దారి తీసింది. ఈ వ్యవహారంపై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై గురువారం స్పందించారు. చంద్ర ప్రియాంక పని తీరుపై సీఎం రంగస్వామి అసంతృప్తితో ఉంటూ వచ్చారని వివరించారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఆరు నెలల క్రితమే సమాచారాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఆమెను పిలిచి మాట్లాడాలని పనితీరు మెరుగు పరచుకునే విధంగా సూచించాలని సీఎంకు తాను సలహా కూడా ఇచ్చానని తెలిపారు. అయితే ఆమె పదవికి రాజీనామా చేస్తూ పేర్కొన్న కారణాలను తాను అంగీకరించబోనని స్పష్టం చేశారు. వాస్తవానికి ఏదేని దాడుల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొచ్చుండాలని పేర్కొన్నారు. అలా కాకుండా ఆమె కొత్త వివాదాలు సృష్టించి వెళ్లడం ఏమాత్రం సబబు కాదని హితవు పలికారు. రాజకీయాల్లో మహిళలకు ఏదైనా సమస్య ఎదురైతే తాను ముందు ఉంటానని చెప్పారు. ఈ పదవికి కొత్త మంత్రి నియామకం గురించి తనకు ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని ఆమె చెప్పారు. ఇదిలా ఉండగా చంద్ర ప్రియాంక రాజీనామా గురించి పుదుచ్చేరి స్పీకర్ సెల్వం మీడియాతో మాట్లాడుతూ ఆమె రాజీనామా చేయడానికి మూడు రోజులకు ముందే పదవి నుంచి తొలగించినట్లు తెలిపారు. మంత్రి పదవిలో ఆమె పనితీరు సక్రమంగా లేదని మెరుగుపరచుకోవాలన్న ఆసక్తి కూడా ఆమెలో లేకపోవడంతో తప్పించినట్లు స్పష్టం చేశారు. అయితే ఆమె రాజీనామా చేస్తూ దాడుల పేరిట కుంటి సాకులు చెప్పి వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రియాంక రాజీనామాతో ఖాళీగా ఉన్న మంత్రి పదవిని చేజిక్కించుకునేందుకు ఎన్‌ఆర్ కాంగ్రెస్ లోని పలువురు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

నీలగిరి వరయాడు రక్షణకు స్పెషల్ ప్రాజెక్టు


కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్ర జంతువుగా ఉన్న వరయాడు(తార్- అరుదైన జాతి మేక)లను రక్షించుకునేందుకు ప్రత్యేక పథకానికి గురువారం సీఎం స్టాలిన్ శ్రీకారం చుట్టారు. సచివాలయంలో ఉదయం జరిగిన కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర వన్య ప్రాణిగా ఉన్న వరయాడు సంరక్షణ పథకం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం స్టాలిన్ శ్రీకారం చుట్టారు. అంతరించి పోతున్న వరయాడు జాతిని రక్షించుకోవడం, పరిశోధనలను విస్తృతం చేయడమే లక్ష్యంగా రూ.25.14 కోట్లను సీఎం స్టాలిన్ ప్రకటించారు. దీని ఆధారంగా కోయంబత్తూరులో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారుల బృందంతోపాటు ఓ శాస్త్రవేత్త నేతృత్వంలో నలుగురు పరిశోధకులు ఈ పథకం అమల్లో విధులు నిర్వర్తించనున్నారు. నీలగిరుల్లో మాత్రమే నివసించి వరయాడును గుర్తించి, వాటికి కావాల్సిన అన్ని రకాల వైద్య సేవలు, ఆహారం తదితర వాటిని అందించబోతున్నారు. అలాగే వరయాడు గురించి విద్యార్థులకు తెలియజేసే విధంగా పుస్తకాలను సిద్ధం చేశారు. వీటిని సీఎం స్టాలిన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అటవీశాఖ మంత్రి మది వేందన్, సీఎస్ శివదాస్ మీన పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఒకరోజు విద్యా పర్యటన

- ప్రారంభించిన విద్యాశాఖ మంత్రి
- ఉపాధ్యాయుల తీరుపై అసహనం


మంత్రి అన్బిల్ మహేష్

సాక్షి, చెన్నై : ఆధునిక తమిళనాడు రూపకర్త దివంగత సీఎం కరుణానిధి చెన్నైలో నిర్మించిన సాంస్కృతిక విద్య కేంద్రాలను విద్యార్థులకు తెలియజేసే విధంగా ఒకరోజు విద్యా పర్యటన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం ఈ కార్యక్రమాన్ని విద్యామంత్రి అన్బిల్ మహేష్ ప్రారంభించారు. రెండు బస్సులలో విద్యార్థులు చెన్నైలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. దివంగత నేత కరుణానిధి హయాంలో చెన్నైలో తమిళ సంస్కృతి సాంప్రదాయాలను చాటేవిధంగా వళ్లువర్ కోట్టం వంటి ఎన్నో నిర్మాణాలు చేసిన విషయం తెలిసిందే. అలాగే విద్యా సంబంధిత కార్యక్రమాల కోసం అన్నా శత జయంతి స్మారక గ్రంథాలయంతో పాటు మరెన్నో నిర్మాణాలు జరిగాయి. విద్యా సంబంధిత తమిళ సంస్కృతి అంశాలతో కూడిన ఈ నిర్మాణాలను సందర్శించేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా కలంజర్ పర్యాటకము పేరిట విద్యార్థులను ఆయా ప్రాంతాలకు ఒక రోజు పాటు తీసుకువెళ్లే రీతిలో విద్యా కార్యక్రమాలకు శ్రీకారం చూట్టారు. వళ్లువర్ కోట్టంలో విద్యార్థుల కోసం ఒక రోజు విద్యా పర్యటనను మంత్రి ప్రారంభించారు. చెన్నైలోని వళ్లువర్ కోట్టం, అన్నా వంతెన, కన్నగి విగ్రహం, సెమ్మొళి పార్క్, అన్నా సెంటినరీ లైబ్రరీ వంటి ప్రదేశాలకు విద్యార్థులు ప్రయాణం చేసే విధంగా రెండు బస్సులను సిద్ధం చేశారు. వీటిని మంత్రి అన్బిల్ మహేష్ జండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి వళ్లువర్ కోట్టంలో సందర్శించారు.

ఉపాధ్యాయులపై అసహనం

ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం నుంచి చెన్నై బీపీఐ ఆవరణంలో నిరవధిక నిరసనకు సిద్ధమైన విషయం తెలిసిందే. 30 డిమాండ్ల పరిష్కారం కోసం వీరు పోరాటాన్ని ఉధృతం చేయనున్నారు. అన్ని సంఘాలు ఏకమై ఒక సమాఖ్యగా ఈ నిరసన చేపడుతున్నారు. ఉపాధ్యాయులు నిరసన బాట పట్టిన లక్ష్యంలో విద్యార్థుల చదువులకు ఆటంకాలు ఏర్పడతాయని, కనుక చర్చించుకుందాం అని మంత్రి ఆహ్వానించారు. అయితే తమను సరైన పద్ధతిలో ఆహ్వానించలేదని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించి నిరసనలు ఆపబోమని తేల్చి చెప్పాయి. ఈ విషయంపై మంత్రిని ప్రశ్నించగా చర్చలకు రావాలని ఇప్పటికే తాను సూచించానని, ఉదయం 8.30 గంటల వరకు తాను క్యాంపు కార్యాలయంలోనే ఉన్నా ఎవరు రాలేదని పేర్కొన్నారు. ఆ సంఘాల మధ్య ఏకాభిప్రాయం సమన్వయం లేనట్లుందని అసహనం వ్యక్తం చేశారు. తాను తన క్యాంపు కార్యాలయంలోనే ఉంటానని వచ్చి తనతో సంప్రదింపులు జరపవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

6 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్: తిరుపత్తూరు నుంచి గురువారం తెల్లవారుజామున కర్ణాటకకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 6 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. కృష్ణగిరి జిల్లా ఆహార స్మగ్లింగ్ నిరోధక విభాగం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్, పోలీసులు చెన్నై- కృష్ణగిరి జాతీయ రహదారిపై సుబేదార్ మేడు ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం అటుగా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు లారీ డ్రైవర్‌ను విచారించారు. అందులో కృష్ణగిరి జిల్లా ఊథంగరై తాలూకా పెరియ తోళ్లప్పాడికి చెందిన కాళిదాస్ (40)గా గుర్తించారు. తిరుపత్తూరు, వాణియంబాడి, పరిసర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తీసుకెళ్లి అక్కడ అధిక ధరకు విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు కూడా వెలుగులోకి వచ్చింది. అనంతరం కాళిదాసును అరెస్టు చేసిన పోలీసులు లారీలోని 6 టన్నుల రేషన్ బియ్యాన్ని, 40 కిలోల 152 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో తిరుపత్తూరు జిల్లా వాణియంబాడికి చెందిన లారీ యజమాని సురేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలను అందజేస్తున్న బాలయోగి

తిరువళ్లూరు: ప్రభుత్వ పాఠశాలలోని సుమారు 200 మంది విద్యార్థులకు పీఎంకే ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఉపకరణాలను పంపిణీ చేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. మొక్కలు నాటారు.

ఏనుగు దాడిలో కార్మికుడి మృతి

అన్నానగర్: కడంబూర్ అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఏనుగు దాడిలో కార్మికుడు మృతి చెందాడు. ఈరోడ్ జిల్లా కడంబూర్ గోపిశెట్టి పాలైయంకు చెందిన సెంథిల్ తోటలో రామన్ (64) గత 25 ఏళ్లుగా తోటమాలిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పాలు పోసేందుకు మిల్క్ సొసైటీ వద్దకు వెళ్లాడు. తిరిగి తోటకు వస్తుండగా సమీపంలోని తోపు గుండా వెళుతుండగా పొదల్లో నుంచి వచ్చిన ఏనుగు అతనిపై దాడి చేసింది. రామన్ పక్కనే ఉన్న బండరాయిపై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వీఐటీలో విద్యార్థులకు తిరుక్కురల్‌పై పోటీలు



ప్రతిభ చాటిన విద్యార్థులతో వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్

వేలూరు: వేలూరు వీఐటీ యూనివర్సిటీ బోపాల్ క్యాంపస్, తమిళభాషాభివృద్ధి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు తిరుక్కురల్‌పై పోటీలు వీఐటీ యూనివర్సిటీ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు తిరుక్కురల్‌పై అవగాహన కల్పించేందుకే పోటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 750 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోష కరమన్నారు. తమిళభాషాభివృద్ధి సంఘం ఆరో వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా చెన్నైలో త్వరలో పెద్ద మహానాడు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో తిరుక్కురల్ గుర్తింపు పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలోని 10 జిల్లాలో మాత్రమే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని రానున్న సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు ఉంటాయన్నారు. అనంతరం తిరుక్కురల్ పోటీలు నిర్వహించి అందులో విజయం సాధించిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్, కాదంబరి విశ్వనాథన్, జిల్లా విద్యాశాఖ సీఈఓ మణిమొయి, కాంచిపురం సీఈఓ వెట్రిసెల్వి, ఆర్గనైజర్ వనంగాముడి, రచయిత పదుమనార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో కడుపునొప్పితో చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆస్పత్రి భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో 2 వేల మందికి పైగా ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. దీంతో ఈ ఆసుపత్రి పగలు, రాత్రుళ్లు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలోని టవర్-1, టవర్-2లను కలిపే చిన్న వంతెనపై నుంచి గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఓ యువకుడు హఠాత్తుగా కిందకు దూకాడు. బాటసారులు, ఆస్పత్రి సిబ్బంది వెంటనే అతడిని రక్షించి ఆస్పత్రిలోని అత్యవసర విభాగానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజీవ్ గాంధీ ఆస్పత్రి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఫ్లోర్‌పై నుంచి కిందకు దూకిన యువకుడు చెంగల్‌పట్టు జిల్లా మదురాంతకం వైయావూరు గ్రామానికి చెందిన గౌరీశంకర్ (32)గా గుర్తించారు. ఇతడు గత 3 నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఈనెల 9న రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చేరారు. అతను 3 సంవత్సరాలుగా డయాలసిస్ చికిత్స పొందుతున్నట్లు తేలింది. మంగళవారం మళ్లీ డయాలసిస్ చేయించుకున్నా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది భవనంపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

లైంగిక దాడి కేసులో జౌళి దుకాణం యజమాని అరెస్ట్

తిరువొత్తియూరు: జౌళి దుకాణంలో పనిచేస్తున్న 17 ఏళ్ల బాలికను రెండో వివాహం పేరుతో బలాత్కారం చేసిన జౌళి దుకాణం యజమానిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై మైలాపూర్ ప్రాంతానికి చెందిన జౌళి దుకాణం యజమాని రాజేష్ (48). పాలవాకం ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక అతని దుకాణంలో పని చేస్తోంది. ఈమెకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసినట్లు తెలిసింది. దీంతో బాలిక తల్లి మైలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రాజేష్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు.

• అవార్డు ప్రదానం



తేలిక పాటి బంగారు ఆభరణాల ఉత్పత్తులలో ప్రిన్స్ జ్యువెలరీకి జాతీయ స్థాయి అవార్డు-2023 దక్కింది. ఉత్తమ బ్యాంగిల్స్, బ్రాస్లెట్ ఉత్పత్తులకు గాను ఈ అవార్డును స్థానికంగా బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సినీ నటి శిల్పా శెట్టి నుంచి ప్రిన్స్ డైరెక్టర్ అంటోని ప్రిన్స్ అందుకున్నారు. - సాక్షి, చెన్నై

పృథ్వీరాజ్‌కి ఘన సత్కారం



పృథ్వీరాజ్‌ను సత్కరిస్తున్న కరస్పాండెంట్ హరిణి

కొరుక్కుపేట: గతంలో ఆసియా గేమ్స్‌లో బంగారు పతక విజేత, ఎస్ఆర్ఎం పూర్వ విద్యార్థి అయిన ఆర్. పృథ్వీరాజ్ తొండైమాన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఎస్ఆర్ఎం వడపళనిలో ఫీల్డ్ డే పేరుతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వల్లియమ్మాయి ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్ఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్ హరిణి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారుడు ఆర్పృథ్వీరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల రహిత జీవితాన్ని గడపాలని సూచించారు. ఎస్ఆర్ఎం ఐఎస్‌టి డైరెక్టర్ (స్పోర్ట్స్) డాక్టర్ ఆర్ మోహన కృష్ణన్, వడపళని క్యాంపస్ డీన్ (ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్) డాక్టర్ వి. శశిరేఖ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సూపర్‌వైజర్ల దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న సూపర్ వైజర్లు

వేలూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పశుసంవర్ధక శాఖలోని సూపర్ వైజర్లు వేలూరు కలెక్టరేట్ ఎదుట గురువారం ఉదయం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు తమిళనాడు పశు సంవర్ధక శాఖ సూపర్ వైజర్‌ల అసోషియేషన్ వేలూరు జిల్లా కార్యదర్శి రాజన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జోషి మాట్లాడుతూ వెటర్నరీ సూపర్ వైజర్‌ల శిక్షణను యుద్ధ ప్రాతిపదికన ప్రవేశ పెట్టాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పాత పదవీ విరమణ పథకాన్ని అమలు చేయాలని, పాత పెన్షన్ పథకాలను అమలు చేసి కొత్త పథకాన్ని రద్దు చేయాలని, సీనియారిటీ జాబితా ప్రకారం పదోన్నతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని నినాదాలు చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షా శిబిరంలో తిరువణ్ణామలై జిల్లా కార్యదర్శి పయణివేల్, రాణిపేట జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జయకుమార్, సూపర్ వైజర్‌లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశేష సేవలందించిన వైద్యులకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న వైద్యులు రేగి జార్జ్, లలిత రేగి

కొరుక్కుపేట: రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ (ఆర్‌సీఎంఈ) కావేరి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యరంగంలో విశేష సేవలు అందిస్తున్న వైద్యులను డాక్టర్ కేవీ తిరువేంగడం అవార్డ్ ఫర్ హెల్త్‌కేర్ - 2023తో ఘనంగా సత్కరించారు. బుధవారం రాత్రి స్థానికంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్‌సీఎంఈ ప్రెసిడెంట్ బాబు కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అపోలో ఆసుపత్రి కార్డియోథొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జన్ వైద్యులు డాక్టర్ విజయశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మపురి జిల్లా, సిత్తిలింగిలోని లాభాపేక్షలేని సంస్థ ట్రైబల్ హెల్త్ ఇనిషియేటివ్ (టీహెచ్ఐ)కి చెందిన వైద్యులు రెగి జార్జ్, లలిత రేగి దంపతులకు ఆరోగ్య సంరక్షణ విభాగంలో 2023 సంవత్సరానికి గాను డాక్టర్ కేవీ తిరువేంగడం అవార్డును ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ కె.వి. తిరువేంగడం వైద్యరంగానికి చేసిన సేవలను అతిథులు గుర్తుచేసుకున్నారు. అంతకుముందు సెక్రటరీ రేవతీ సంజీ అవార్డుగ్రహీతను గురించి సభకు తెలుపుతూ ప్రధానంగా గిరిజనుల సంక్షేమం కోసం ట్రైబల్ హెల్త్ ఇనిషియేటివ్ పనిచేస్తోందని వివరించారు. ఇందులో అవార్డు చైర్మన్ డాక్టర్ రోహిణి రావ్, కమ్యూనిటీ హెల్త్ డైరెక్టర్ పి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్బు నాడు ఒన్బందు కుప్పం ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు



రెండు సామాజిక వర్గాల మధ్య సమస్యతో..

తమిళసినిమా: కాలం మారుతున్నా మనుషుల్లో కుల మతాల వివక్షత అంతం కావడం లేదు. సరిగ్గా ఇలాంటి ఇతివృత్తంతో రూపొందిన చిత్రం అన్బునాడు ఒంబదు కుప్పం. పీకే ఫిలిమ్స్ పతాకంపై భూపతి కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రానికి రాజాజీ కథనం, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. శంకరి మాణిక్యం, హర్షిత నాయకానాయికలుగా నటించిన ఇందులో ప్రభు మాణిక్యం, మదన్ రమేష్, మిత్రన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. అంథోనీదాసన్ సంగీతాన్ని, జేమ్స్ వసంతన్ నేపథ్య సంగీతాన్ని, ఓ.మహేశ్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో నటుడు, నిర్మాత కె.రాజన్, ఆర్వీ ఉదయకుమార్, అన్బుచెలియన్, విడుదలై చిరుతైగళ్ సంఘతమిళన్, తమిళా తమిళా పాండియన్, మగిళన్, మైనర్ వీరమణి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రాజాజీ మాట్లాడుతూ ఇది ఊరార్ వరైంద ఓవియం అనే నవల ఆధారంగా రూపొందించిన చిత్రం అని చెప్పారు. యదార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కించిన కథా చిత్రం ఇదని చెప్పారు. ఒక గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య సమస్యలను ఆవిష్కరించే కథాచిత్రంగా ఉంటుందన్నారు. ఈ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పుదుకోట్టైలో ఇప్పటికీ జీవిస్తున్నారని చెప్పారు. చిత్ర షూటింగ్ ను గంధర్వ కోట్టై,కరంబకుడి పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అజిత్ కొత్త చిత్రం ఫిక్స్?

తమిళసినిమా: నటుడు అజిత్ తన 63వ చిత్రానికి పచ్చజెండా ఊపారా? అంటే కోలీవుడ్ వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. ఈయన తుణివు చిత్రం తరువాత కొత్త చిత్రం చేయడానికి దాదాపు ఏడాది పట్టింది. ప్రస్తుతం నటిస్తున్న విడాముయర్చి చిత్రం చిత్రాన్ని ప్రకటించిన ఆరు నెలల తరువాత ఇటీవలే సెట్స్ పైకి వెళ్లింది. అజిత్ 62వ చిత్రం అయిన దీన్ని మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. నటి త్రిష , రెజీనా నాయికలుగా నటిస్తున్న ఇందులో అజిత్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు సమాచారం. కాగా ఈ చిత్ర షూటింగ్‌ను మూడు నెలల్లో పూర్తి చేయడానికి యూనిట్ సభ్యులు ప్రణాళికను రచించినట్లు సమాచారం. కాగా అజిత్ తన 63వ చిత్రానికి కూడా కమిట్ అయినట్లు తాజా సమాచారం. విడుదలై వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన, ప్రస్తుతం విడుదలై -2 చిత్రాన్ని నిర్మిస్తున్న ఆర్ఎస్ ఇన్ఫోటెంట్ సంస్థ అధినేత ఎల్ రెడ్ కుమార్ నిర్మించనున్నట్లు తెలిసింది. కాగా ఇటీవల విశాల్, ఎస్‌జే సూర్య కలిసి నటించిన మార్క్ ఆంటోనీ చిత్రంతో హిట్ కొట్టిన ఆధిక్ రవిచంద్రన్ అజిత్ 63వ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు ప్రచారం వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. అయితే అజిత్ అభిమానులు మాత్రం ఖుషీ అవుతున్నారు.

కోలీవుడ్ టాక్స్



అజిత్‌తో దర్శకుడు ఆదిక్ రవిచంద్రన్

మన్నాంగట్టి చిత్ర యూనిట్



నయనతార మన్నాంగట్టి ప్రారంభం

తమిళసినిమా: లేడీ సూపర్ స్టార్ నయనతార వరుసగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. జవాన్ చిత్రంతో బాలీవుడ్ లోనూ విజయాన్ని అందుకున్న ఈ భామ 75 చిత్రాల మార్క్‌ను దాటేశారు. ప్రస్తుతం 76వ చిత్రంలో నటించడానికి సిద్ధమయ్యారు. దీనికి మన్నాంగట్టి అనే ఆసక్తికరమైన టైటిల్‌ను నిర్ణయించారు. దీన్ని ఇంతకు ముందు సర్దార్ వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఎస్.లక్ష్మణన్ తన ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా యూట్యూబర్ డూడ్ విక్కీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నటుడు యోగిబాబు, గౌరీ కిషన్, దేవదర్శిని, నరేంద్ర ప్రసాద్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

ఆర్‌డీ రాజశేఖర్ ఛాయాగ్రహణం, శ్యాన్ రోల్డన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం గురువారం ఉదయం కొడైక్కానల్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇది పీరియడ్ కథాంశంతో వైవిధ్యభరిత కథనంతో రూపొందుతున్న చిత్రం అని యూనిట్ వర్గాలు తెలిపారు. కాగా కోలమావు కోకిల, ఐరా చిత్రాల తరువాత నయనతార, యోగిబాబు కాంబినేషన్లో రూపొందటంతో ఈ మన్నాంగట్టి చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి. కాగా దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు దర్శకుడు పేర్కొన్నారు. కాగా నయనతార టెస్ట్ అనే మరో చిత్రంలోనూ నటిస్తుండడం గమనార్హం.

మానసిక ఒత్తిడి నుంచి బయట పడాలంటే..!



శృతిహాసన్

తమిళసినిమా: మానసిక ఒత్తిడి.. ఇదిప్పుడు చాలామందిని బాధిస్తున్న సమస్యగా మారుతోంది. ఇందుకు కారణాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సమస్యల నుంచి బయటపడటానికి నటి శృతిహాసన్ పంచ సూత్రాలను తన ఇన్ స్ట్రాగామ్ పేర్కొన్నారు. అవి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇంతకి అవేంటో చూద్దామా! 'మొదటిగా ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు. మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందడానికి చాలా వైద్య నిలయాలు ఉన్నాయి. అయితే తమ మానసిక ఒత్తిడి గురించి ఎవరూ బయటకు చెప్పడం లేదు. నేను మాత్రం ఒత్తిడికి గల కారణాలను నిత్యం ఒక డైరీలో రాసుకుంటాను. రెండవది శారీరక వ్యాయామం. దీని వల్ల శరీరంలోని రసాయనాలు, హార్మోనులు సమతౌల్యం అవుతాయి. మనస్సు ప్రశాంతంగా ఉండటానికి సహకరిస్తాయి. మూడవది రోజూ జరిగే ఘటనలను మననం చేసుకుంటాను. నాలుగవది నాకు నచ్చిన వారితో మాట్లాడతాను. వారి మనసుల్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాను. ఇక అయిదవది నా గురించి సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో మంచి ఎంత, చెడు ఎంత అన్నది బేరీజు వేసుకుంటాను' అని శృతిహాసన్ పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం ఈమె ప్రభాస్ సరసన నటించిన పాన్ ఇండియా చిత్రం సలార్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా హాలీవుడ్ చిత్రం ది ఐ అందించే రిజల్ట్ కోసం మరింత ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



కృతిశెట్టి

'లో వాద్దియారే'ను నమ్ముకున్న కృతిశెట్టి



కార్తీ

తమిళసినిమా: శాండిల్ వుడ్ నుంచి టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన బ్యూటీలలో కృతి శెట్టి ఒకరు. తెలుగులో ఉప్పెన చిత్రంతో ఒక్కసారిగా ఎగసి పడిన ఈ అమ్మడు అలా రెండు మూడు చిత్రాలతో విజయ బాటలో పయనించింది. ఆ తరువాత వరుస ఫ్లాపులతో చతికిలపడింది. ఇక ది వారియర్ చిత్రంతో కోలీవుడ్‌కు కోటి ఆశలతో ఎంటర్ అయ్యింది. అయితే ఆమె లక్ ఇక్కడ పని చేయలేదు. ఆ చిత్రమే కాదు ఆ తరువాత ఇక్కడ. విడుదలైన కస్టడీ చిత్రం కూడా నిరాశపరిచింది. ఇక నేరుగా బాలా దర్శకత్వంలో సూర్యకు జంటగా వణంగాన్ చిత్రంలో నటించే అదృష్టం కలిగింది అని సంబరపడే లోగానే ఆ చిత్రం మంచి వైదొలగాల్సిన పరిస్థితి. అలాంటి నిస్పృహ మధ్య కృతిశెట్టికి మరో లక్కీ చాన్స్ తలుపు తట్టింది. అదే నటుడు కార్తీతో జత కట్టే అవకాశం. ఈ జంట నటిస్తున్న చిత్రాన్ని స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారన్నారు. ఇంతకు ముందు సూదుకవ్వుమ్, కాదలుమ్ కడందు పోగుమ్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన నలన్ కుమారసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇది కార్తీ నటిస్తున్న 26వ చిత్రం కావడం గమనార్హం. కాగా దీనికిలో వాద్దియారే అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఇందులో కార్తీ ఎంజీఆర్ వీరాభిమానిగా నటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రం ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తి అయినట్లు తెలిసింది. కాగా నటి కృతిశెట్టి ఈ చిత్రంపై చాలా ఆశలు పెట్టుకుంది. ఇకపోతే నటుడు కార్తీ నటించి పూర్తి చేసిన జపాన్ చిత్రం దీపావళిక తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది.

క్లుప్తంగా

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

తిరువొత్తియూరు: తిరుముల్లైవాయల్ సమీపంలో ఉద్యోగం దొరకలేదనే ఆవేదనతో ఓ యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబానికి భారంగా ఉంటున్నట్లు ఆమె రాసిన లేఖ ఘటనా స్థలంలో లభ్యమైంది. వివరాలు.. తిరుముల్లైవాయల్‌కు చెందిన మురుగన్ పెద్ద కుమార్తె శ్వేత (21). ఈమె సెమంజేరిలో ఉన్న ప్రైవేటు కళాశాలలో గత సంవత్సరం బీకాం పూర్తి చేశారు. పలు ప్రైవేట్ సంస్థలలో పని కోసం ఆమె దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. కానీ ఆమెకు ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. మంగళవారం శ్వేతా అంబత్తూర్‌లో ఉన్న ఓ ప్రైవేటు సంస్థలో పని కోసం ఇంటర్వ్యూకు వెళ్లి వచ్చారు. అందులోనూ ఆమెకు పని లభించలేదు. దీంతో విరక్తితో ఇంటికి వచ్చిన ఆమె అదే రోజు రాత్రి తన పడక గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తర్వాత తల్లిదండ్రులు గదికి వెళ్లి చూడగా శ్వేత ఉరివేసుకుని వేలాడుతుంది. స్థానిక పోలీసులు శ్వేత మృతదేహాన్ని కీల్‌పాక్కం ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి హత్య

అన్నానగర్: వృద్ధురాలిని హత్య చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నామక్కల్ జిల్లా పరమతి వేలూరుకు చెందిన షణ్ముగం (70), అతని భార్య నల్లమ్మాళ్ (65) బుధవారం రాత్రి నిద్రించారు. గురువారం ఉదయం 7 గంటల వరకు వారి ఇంటి తలుపులు తెరవలేదు. అనుమానం వచ్చిన ఇరుగు పొరుగు వారు ఇంటికి వెళ్లి చూడగా షణ్ముగం, నల్లమ్మల్ రక్తపు మడుగులో పడి ఉండడం చూసి షాక్ అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పుడు నల్లమ్మాళ్ మరణించిన సంగతి తెలిసింది. షణ్ముగం ప్రాణాలతో పోరాడుతున్నాడు. అతన్ని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు విచారణ చేపట్టారు. అందులో అర్ధరాత్రి షణ్ముగం ఇంట్లోకి ప్రవేశించిన అనుమానాస్పద వ్యక్తులు ముందుగా మంచంపై నిద్రిస్తున్న షణ్ముగంపై ఇనుప రాడ్‌తో దాడి చేశారని, అతని కేకలు విని నిద్రలేచిన నల్లమ్మాళ్‌ను కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు తేలింది. హత్యకు గల కారణాలపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

కూవం నదిలో తేలిన యువతి మృతదేహం

- హత్యా? ఆత్మహత్యా?

తిరువొత్తియూరు: తిరువేర్కాడు సమీపంలోని కాడువెట్టి నేలవంతన వద్ద ఉన్న కూవం నదిలో మహిళ మృతదేహం తేలింది. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడ చేరుకొని మహిళ మృతదేహాన్ని బయటకు తీసి, శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన మహిళలకు సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. ఆమె హత్యకు గురయ్యారా లేదా ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కారాన్ని నేర్పే దేవాలయం కళాశాల

తిరుపతి సిటీ : పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని నేర్పే దేవాలయం కళాశాల అని టీటీడీ విజిలెన్స్ ఆఫీసర్ డీఎస్పీ శివానంద కిషోర్ తెలిపారు. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం 2023 – 2024లో అడ్మిషన్లు పొందిన విద్యార్థినులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అంకిత భావాన్ని కలిగి ఉంటే దేనినైనా సాధించవచ్చని తెలిపారు. టీటీడీ డీఈవో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు అవగాహన లోపంతో కొన్ని ప్రలోభాలకు లోనవుతున్నారని, వాటిని విడనాడి విద్యపై శ్రద్ధ పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ మహదేవమ్మ మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు విభాగాధి డీఎం ప్రేమావతి, నారాయణ, దామోదరం, అంజూయాదవ్, ఎస్‌బి అరుణ, స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జ్ భువనేశ్వరి దేవి, భద్రమణి, వార్డెన్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టుతో సీమకు అన్యాయం

తిరుపతి కల్చరల్: కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని జాతీయ రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచెం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆయన గురువారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5.300 కోట్లు కేటాయించిదని తెలిపారు. ఇప్పటికే తుంగభద్ర జలాశయానికి సరిపడా నీరు రాకపోవడంతో రాయలసీమ జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాజా అప్పర్ భద్ర ప్రాజెక్టుతో మూడు ఉమ్మడి జిల్లాలలోని 7.94 లక్షల ఎకరాలకు సాగు నీరు అందదని, హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, ఎస్ఆర్‌బీసీ, తెలుగు గంగపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అప్పర్ భద్రను వ్యతిరేకిస్తూ మన రాష్ట్రం త్వరలోనే సుప్రీం కోర్టు ఒరిజినల్ సూట్ దాఖలు చేయడానికి కసరత్తు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తరతరాలుగా రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని చాటి చెప్పే దిశగా నవంబర్ 27న తిరుపతిలోని ఆటోనగర్ ప్రాంతంలో రాయలసీమ పాలికేక చేపడుతున్నట్లు తెలిపారు.

మత్తు మాత్రల విక్రయం

- నలుగురి అరెస్టు
- మూడువేల మాత్రలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు మాత్రలు



అరెస్టయిన నిందితులు

తిరువళ్లూరు: హైదరాబాదు నుంచి తమిళనాడుకు మత్తుమాత్రలను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న నలుగురు యువకులను పూందమల్లి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లి బస్టాండులో కొద్ది నెలలుగా కళాశాల విద్యార్థులే లక్ష్యంగా మత్తుమాత్రలను విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు గురువారం ఉదయం ఇన్‌స్పెక్టర్ క్లాస్టిన్ డేవిడ్ నేతృత్వంలో నిఘా వుంచారు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాల్లో సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారు ముగప్పేర్‌కు చెందిన ప్రేమానంద కుమారుడు మారన్(22), శేఖర్ కుమారుడు శీనురాజ్(19), రాజా కుమారుడు ఆనందన్(19), పెరియస్వామి కుమారుడు ఆకాష్(23)గా తేలింది. వారు వ్యసనాలకు బానిసలై జల్సాల కోసం తెలంగాణా రాష్ట్రం హైదరాబాదు నుంచి నిట్రావెట్ 10 ఎంజీ మాత్రలను అక్రమంగా తీసుకొచ్చి యువతీయువకులు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. నలుగురు యువకులను అరెస్టు చేసి రెండు ద్విచక్ర వాహనాలు, 3720 మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పూందమల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

శిక్షణ పొందిన వారినే కర్మాగారాల్లో అనుమతించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: అగ్గిపెట్టెలు, బాణసంచా తయారీ కర్మాగారాల్లో శిక్షణ పొందిన కార్మికులను మాత్రమే అనుమతించాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ ఆదేశించారు. వేలూరు జిల్లా గుడియాత్తంలోని ప్రయివేటు కల్యాణ మండపంలో గురువారం అగ్గిపెట్టెలు, బాణసంచా తయారు చేసే కార్మికుల భద్రతపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ వస్తున్నందున కార్మికులు గుడియాత్తం ప్రాంతంలో అధికంగా టపాకాయలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారని తెలిపారు. అనుమతి పొందిన కంపెనీలు మాత్రమే అగ్గి పెట్టెలు, బాణసంచాలను తయారు చేయాలన్నారు. ప్రజలు సంచరిస్తున్న ప్రాంతాల్లో తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయరాదన్నారు. అధిక శబ్దాలతో కూడిన రసాయనం పూసిన టపాకాయలను తయారు చేయరాదన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు కార్మికులు భద్రతా చర్యలు తప్పక పాటించాలన్నారు. భద్రతా పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులకు భద్రతా నియమావళిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో గుడియాత్తం మున్సిపల్ చైర్మన్ సెంథిల్‌రాజన్, కార్మిక, ఆరోగ్య, సంక్షేమ అధికారిణి శాంతినిప్రియ, అగ్గిపెట్టెలు, బాణసంచా కర్మాగారాల సంఘం అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల రైలు రోకో

అన్నానగర్ : రైలు రోకో చేసిన రైతులను పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడు లేక్ అండ్ రివర్ బేసిన్ రైతుల సంఘం సలహా సమావేశం నెం.1 టోల్ గేట్ వద్ద జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు విశ్వన అధ్యక్షత వహించారు. ఇందులో భాగంగా సాంబ సాగుకు 177.25 టీఎంసీల నీటిని ఇవ్వడానికి నిరాకరించిన కర్ణాటక ప్రభుత్వాన్ని, నిబంధనలకు అనుగుణంగా కావేరి నీటిని ఇవ్వని కేంద్ర ప్రభుత్వాల చర్యలను నిరసిస్తూ రైతులు గురువారం బల్లంలోని ఉత్తమర్ కోవిల్ రైల్వే స్టేషన్ వద్ద రైలు రోకో చేపట్టారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, సాంబ పంటకు సాగు నీరు ఇవ్వాలని నినదించారు. రైల్వే స్టేషన్‌లో రైలును అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

రెండు ఎకరాల చెరుకుతోట దగ్ధం



దగ్ధమైన చెరుకుతోట

పళ్లిపట్టు: విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పడి రెండు ఎకరాల చెరుకు తోట కాలిబూడిదైన సంఘటన గురువారం పళ్లిపట్టు సమీపంలోని అత్తిమాంజేరి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో చెరుకు పంట సాగు చేస్తున్నారు. బాబునాయుడు, అతని అన్న దేవరాజులు నాయుడుకు చెందిన రెండు ఎకరాల చెరుకు తోట కోతకు వచ్చింది. ఈ క్రమంలో పంట పొలాలపై వెళుతున్న హై ఓల్టేజ్ విద్యుత్ తీగలు గాలికి రాజుకుని నిప్పు రవ్వలు తోటపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగాయి. గుర్తించిన రైతులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పళ్లిపట్టు అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు సమీపంలోని పంట పొలాలకు అంటుకోకుండా కట్టడి చేశారు. మంటలకు రెండు ఎకరాల చెరుకు తోట పూర్తిగా కాలిపోయింది. పొదటూరుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతకు అధిక డిమాండ్



రాజేష్ సి.సుబ్రమణియం

కొరుక్కుపేట: ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికతకు అధిక డిమాండ్ ఏర్పడుతుందని ఎంబెడ్ యూఆర్ సిస్టమ్స్ వ్యవస్థాపక సీఈఓ రాజేష్ సి.సుబ్రమణియం పేర్కొన్నారు. ఈ మేరకు అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఎంబెడ్ యూఆర్ సిస్టమ్స్ భారత్‌లో తమ వ్యాపార విస్తరణపై దృష్టి సారించింది. ఈ వివరాలను వెల్లడించేలా చెన్నైలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సంస్థ సీఈఓ రాజేష్ మాట్లాడుతూ సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. ఈ క్రమంలో వచ్చే ఐదేళ్లలో భారత్‌లో ముఖ్యంగా తమిళనాట రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుందని అన్నారు. 2004లో ప్రారంభించిన తమ కంపెనీ బెస్పోక్ పరిష్కారాలను అందించడంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రధానంగా టర్న్‌కీ కనెక్టివిటీ ప్రొడక్ట్స్ అండ్ సొల్యూషన్స్‌ను అందించడంలో పేరు గడించిందని తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీకి చెందిన ఎంబెడెడ్ డివైజ్‌లు మిలియన్ సంఖ్యలో ప్రపంచ వ్యాప్తంగా సరఫరా చేసిందని, అందువల్ల భారత్‌లో కూడా తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించే చర్యల్లో భారీ పెట్టుబడి ప్రణాళికలతో ముందుకు వస్తున్నట్టు రాజేష్ తెలిపారు.

ఉద్యోగాల పేరుతో రూ.5 లక్షలు మోసం

తిరువొత్తియూరు: మదురై జిల్లా తిరుమంగళం తాలూకా సాత్తాంకుడి పోస్ట్ ప్రాంతానికి చెందిన కరుపు స్వామి (46) పెరంబూరు కృష్ణదాసు రోడ్డులో ఉన్న రవాణా సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి పెరంబూరు మంగళాపురం ప్రాంతానికి చెందిన ఇర్విన్ పరిచయమయ్యాడు. దీంతో తన బిడ్డకు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల కోసం పలు దఫా లుగా ఐదు లక్షలు వరకు నగదు అప్పు తీసుకున్నట్టు తెలిసింది. ఈ అప్పును తిరిగి అడిగిన సమయంలో తనకు చెన్నై మేయర్ బాగా తెలుసునని ఉద్యోగంలో చేర్పిస్తానంటూ ఇర్విన్ చెప్పడంతో కరుప్పు స్వామి తనకు తెలిసిన నలుగురిని పరిచయం చేశాడు. వారికి ఆ అవిన్ సంస్థలో ఉద్యోగం తీసిస్తామని చెప్పాడు. కానీ ఉద్యోగం మాత్రం తీసివ్వలేదు. తర్వాత విద్యుత్ బోర్డులో ఒకరికి మాత్రం ఉద్యోగ నియామక పత్రం ఇచ్చాడు. కానీ అది నకిలీదని తేలింది. దీంతో కరుప్పు స్వామి ఓటేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారు ఇర్విన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.


రేపు విద్యార్థులకు సైకిల్ పోటీలు

తిరువొత్తియూరు: అరింజర్ అన్నా జయంతి సందర్భంగా అరింజర్ అన్నా సైకిల్ పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పందెం చెన్నై ఐలాండ్‌లో ప్రారంభమై స్వామి శివానందర్ రోడ్డులో వున్న దూరదర్శన్ టీవీ స్టేషన్, నేపియర్ బ్రిడ్జ్, కాయిదే– ఇ మిల్లత్ బ్రిడ్జ్, అన్నాసాలై మీదుగా తిరిగి ఐలాండ్‌కు చేరుకుంటుందని వెల్లడించింది. ఈ పోటీలో 13, 15, 17 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనవచ్చని, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ పోటీల్లో పాల్గొనే వారు భారత్‌లో తయారైన సైకిళ్లను మాత్రమే వినియోగించాలని, ఒక్కో విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు, 4 నుంచి 10 స్థానంలో నిలిచిన వారికి రూ.250 అందజేస్తామని తెలిపింది. పోటీలో పాల్గొనే విద్యార్థులు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేసింది.

చెన్నైలో రోడ్డుపై ఆక్రమణల తొలగింపు

తిరువొత్తియూరు: ఉత్తర చెన్నై ప్రాంతంలోని రోడ్డుపై వున్న ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. ఉత్తర చెన్నైలో పలుచోట్ల రోడ్డు పక్కన స్థలాన్ని ఆక్రమించుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మేరకు తిరువొత్తియూరు హైవే రోడ్డులో తక్కువ వెడల్పు కలిగిన రోడ్డు కావడంతో అక్కడ అధికారులు తనిఖీ చేపట్టారు. కొత్త చాకలిపేటలో రోడ్డు ప్రాంతంలో మార్కెట్ కూరగాయల దుకాణాల కారణంగా రవాణాకు ఇబ్బందులు కలుగుతున్నట్టు తెలిసింది. అలాగే తిరువొత్తియూరు తేరడిలో ప్లాట్‌ఫారం దాటుకుని ద్విచక్ర వాహనాలను నిలపడం తదితర వాటిపై ఫిర్యాదులు అందాయి. దీనిపై అదనపు కమిషనర్ సుధాకర్, నార్త్ మండల డిప్యూటీ కమిషనర్ కుమార్ తదితరుల ఆదేశం మేరకు ఇన్‌స్పెక్టర్ గణేష్ బాబు నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు రోడ్డుపై ఆక్రమణల తొలగించేపని చేపట్టారు. ఎలిఫెంట్ గేటు నుంచి పేచ్చి పాలయం, చాకలిపేట వెళ్లే రోడ్డులో ఉన్న 100 పైగా సరుకు వాహనములు, పార్శిల్ బస్తాలను గురువారం అధికారులు తొలగించారు.


హైవేరోడ్డును ఆక్రమించిన చెట్ల తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగిస్తున్న హైవేశాఖ సిబ్బంది

తిరుత్తణి: హైవే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగి ప్రమాదాలకు కారణమవుతున్న చెట్లను హైవేశాఖ అధికారులు తొలగిస్తున్నారు. తిరుత్తణి సమీపంలోని మాంబాక్కచంత్రం రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఇటీవల కురిసిన వర్షాలతో చెట్లు విపరీతంగా పెరిగా రోడ్డును అక్రమించుకున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీనికితోడు ఇటీవల ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై స్పందించిన హైవే శాఖ అధికారులు 40 మంది సిబ్బందితో గురువారం తిరుత్తణి కన్నికాపురం నుంచి మాంబాక్కసత్రం వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు పనులు చేపట్టారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న శఠగోపన్

తిరువళ్లూరు: సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీని తమిళనాడు వినియోగదారుల సంక్షేమ బోర్డు అధ్యక్షుడు శఠగోపన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు తమకు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ అధికారి సుభాష్‌చంద్రబోస్, బోర్డు ఉపాధ్యక్షుడు సెల్వరాజ్, ప్రధానోపాధ్యాయురాలు సత్య పాల్గొన్నారు.

సదస్సు



రెప్ కోల్డ్ ఇండియా 2023 సదస్సు, వర్తక ప్రదర్శన గురువారం చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ప్రారంభమైంది. ఐఎస్‌హెచ్ఆర్ఏఈ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను అన్నా వర్సిటీ వీసీ వేల్‌రాజ్, వివిధ రంగాల ప్రతినిధులు ఎం. రాజా, యోగేష్ ఠక్కర్ యోగేష్ ముద్రాస్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో 2028 నాటికి భారతీయ కోల్డ్ చైన్ మార్కెట్‌ను రూ.3.8 లక్షల కోట్లకు చేర్చడం లక్ష్యమని పేర్కొన్నారు. - సాక్షి, చెన్నై

మద్రాసు హైకోర్టులో అవయవదానంపై అవగాహన శిబిరం

కొరుక్కుపేట: మద్రాసు హైకోర్టులో గురువారం ఉదయం అవయవదానంపై అవగాహన శిబిరం ప్రారంభమైంది.శిబిరాన్ని ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీ గంగాపూర్వాల ప్రారంభించారు. తమిళనాడు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేడీ మాట్లాడుతూ తమిళనాడులో ఇప్పటి వరకు 36 వేల 472 మంది అవయవాలు దానం చేశారని తెలిపారు. రాష్ట్రంలోని 169 ఆసుపత్రుల్లో అవయవ సేకరణ నిర్వహిస్తున్నారని, అవయవ దానం పారదర్శకత కొనసాగుతుందన్నారు. ఇందుకోసం విద్యాల్ అనే ప్రత్యేక యాప్ కూడా పనిచేస్తోందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు 128 మంది అవయవాలు దానం చేయగా 733 మంది లబ్ధి పొందారని వివరించారు. అవయవాల కోసం వెయిటింగ్ లిస్టులో మొత్తం 6 వేల 923 మంది ఉన్నారని తెలిపారు. అవయవదానానికి అందరూ ముందుకు రావాలని తమిళనాడు ప్రభుత్వ ప్లీడర్ పి.ముత్తుకుమార్ పిలుపునిచ్చి అవయవదానంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు, మదురై బెంచ్ న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సత్వరం చర్యలు



పోలీసులను అభినందించి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఐజీ ముత్తుస్వామి

వేలూరు: వేలూరు రీజినల్ పరిధిలోని వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, రాణిపేట జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లకు వచ్చే కేసులను వెంటనే విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఐజీ ముత్తుస్వామి ఆదేశించారు. ఆయన గురువారం వేలూరు రీజనల్ పరిధిలోని జిల్లాల్లో శాంతి భద్రతలు, పోక్సో కేసుల్లో నిందితులకు సత్వరం శిక్షలు, గుట్కా వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం, మహిళలపై జరిగే నేరాలపై సత్వర చర్యలు తదితర కేసుల్లో చురుగ్గా పనిచేసిన 39 మంది పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. బాగాయం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో 90 సవర్ల బంగారం చోరీ కేసులో రికవరీ చేసిన పోలీసులకు డీఐజీ తన సొంత డబ్బుల్లో రూ.10 వేలు అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నమోదయ్యే ప్రతి కేసు వివరాలనూ ఆయా పోలీస్ స్టేషన్ నుంచే జిల్లా కేంద్రానికి సమాచారం అందజేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరు, ఎందుకు వస్తున్నారు అన్న వివరాలు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సీసీ కెమెరాల్లో నమోదవుతున్నట్టు తెలిపారు. అందువల్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం వేలూరు ఉమ్మడి జిల్లాతో పాటు తిరువణ్ణామలై జిల్లాలోను పలు కేసుల్లో త్వరితగతిన పరిష్కారం చూపించిన పోలీసులను అభినందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీలు మణివన్నన్, కిరణ్‌శ్రుతి, ఆల్బర్ట్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక ఉత్సవాలు



కేజీ.కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరుత్తణి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రత్యేక ప్రతిభా శక్తిని వెలికి తీసి ప్రోత్సహించే విధంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సాంస్కృతిక ఉత్సవాలు పాఠశాల స్థాయిలో బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసే విధంగా డ్రాయింగ్, శిల్పకళ, పెయింటింగ్, నృత్యం, వక్తృత్వ పోటీలు నాలుగు రోజులు నిర్వహిస్తున్నారు. పాఠశాల హెచ్‌ఎం దామోదరన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు మండల స్థాయిలో 18 నుంచి 21 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. మండల స్థాయిలో ప్రతిభ చూపే వారు జిల్లా స్థాయిలో 26 నుంచి 28 వరకు జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. కేజీ.కండ్రిగ పాఠశాల పీటీఏ అధ్యక్షుడు రమేష్, ఎస్ఎంసీ అధ్యక్షురాలు నిరోష, ఉప ప్రధానోపాధ్యాయుడు ముకుందయ్య తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ఉత్సవాలను పాఠశాల ఉపాధ్యాయులు ఉషారాణి, నరసింహన్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

గార్లపాటి సాహితీ పురస్కారాలు ప్రదానం



ఆచార్య సర్వోత్తమరావును సాహితీ పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన పలువురు కవులు, రచయితలను పురస్కారాలతో సత్కరించి ప్రోత్సహించడం గొప్ప విషయమని స్విమ్స్ వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్‌వీ.కుమార్ తెలిపారు. విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం గార్లపాటి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం గురువారం రాస్ భవన్‌లో నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా ప్రవీణుడు, సాహితీ అభిలాషి గార్లపాటి దామోదరం ప్రతి ఏటా ఐదుగురు సాహితీవేత్తలకు సాహితీ పురస్కారాలు, ఇద్దరు రైతులకు ఏనుగు అంకమనాయుడు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రైతు పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్య గల్లా చలపతి జ్ఞాపకార్థం కంపల్లె రవిచంద్రన్, ఆచార్య కోసూరి దామోదర నాయుడు సంయుక్తంగా ఆచార్య సర్వోత్తమరావు, ఆచార్య జక్కంపూడి మునిరత్నంకి పురస్కారాలు అందజేసి సత్కరించారు. అలాగే గార్లపాటి దామోదర నాయుడు తాత, తల్లి, తండ్రి పేరిట డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి, ఎంఆర్.అరుణకుమారిని సాహితీ పురస్కారాలతో సత్కరించారు. ఏనుగు అంకమనాయుడు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పసల హరికృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డికి రైతు పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం ఆచార్య సర్వోత్తమరావు రాసిన విభూతి యోగం, డాక్టర్ చిన్నాపుల వెంకట రాజారెడ్డి రాసిన వేంకటేశ్వర ద్విశతి పుస్తకాలను ఆవిష్కరించారు. ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖాధిపతి రాజేశ్వరమ్మ పురస్కార గ్రహీతలందరికీ అధ్యయన శాఖ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, భారతీయ విద్యాభవన్ సత్యనారాయణ, విశ్వశ్రీ సాహితీ సామాఖ్య ప్రతినిధులు ఆకుల మల్లేశ్వర రావు, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, సాహితీ కురువృద్ధులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, విశ్రాంత ఆచార్యులు దామోదర నాయుడు, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొండంత భక్తి



అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవారికి ప్రీతిపాత్రమైన మాసం పెరటాసి. ఈ నెలలో వచ్చే శనివారాల్లో స్వామిని దర్శించుకుంటే శుభం జరుగుతుందని భక్తుల నమ్మకం. అందుకే భక్తులు కాలినడకన తిరుమల చేరుకుని స్వామిని దర్శించుకుంటారు. ఈ క్రమంలోనే సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ నుంచి సుమారు 30 మంది భక్తులు పసుపు దుస్తులు ధరించి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

జగనన్న ఆరోగ్య సురక్ష


శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం గొటివాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది


అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లులో వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


కృష్ణా జిల్లా కంకిపాడు మండలం నెప్పల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్


ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం పెదయిర్లపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలంపాడులో జగనన్న సురక్ష క్యాంపులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సైతారుపేటలో బీపీ, షుగర్ టెస్టులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా...

బాబు కాళ్ల వద్ద కాపుల తాకట్టు

'కాపునేస్తం'లో పవన్‌పై ధ్వజమెత్తిన ఉప ముఖ్యమంత్రి కొట్టు



తాడేపల్లిగూడెం అర్బన్: కాపు సామాజిక వర్గ ముఖ్యనేత రంగా హత్యలో ప్రధానపాత్ర పోషించిన చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్న పవన్‌కళ్యాణ్.. కాపుల ఆత్మాభిమానాన్ని బాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టాడని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. తీవ్ర అవినీతి ఆరోపణలతో జైలులో ఉన్న చంద్రబాబుని కలిసి సాష్టాంగ నమస్కారం చేసి.. కాపులను గంపగుత్తగా బాబుకు బానిసలను చేసేందుకు సిద్ధమయ్యాడని మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని లక్ష్మీప్రియ ఎస్టేట్ మున్సిపల్ పార్కులో గురువారం నిర్వహించిన కాపునేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాపు సామాజిక వర్గం కోసం పోరాడుతున్న ముద్రగడ పద్మనాభాన్ని ఎన్నో ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ఆయనపైనా ఉద్యమంలో పాల్గొన్న కాపు సామాజిక వర్గీయులపై కేసులు పెట్టిన చంద్రబాబుకు మద్దతు పలకడమంటే కాపు సామాజిక వర్గాన్ని కించపర్చడమేనన్నారు. ముద్రగడ పద్మనాభం, కాపులపై పెట్టిన కేసులను ఎత్తివేసి కాపు సామాజిక వర్గానికి మేలు చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు.

టీడీపీ నేత చంద్రమౌళి ఇంట్లో ఐటీ సోదాలు


చంద్రమౌళి నివాసం వద్ద ఐటీ అధికారి

కాకినాడ రూరల్ : కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడలో టీడీపీ నేత గుణ్ణం చంద్రమౌళి నివాసం, కార్యాలయంలో ఇన్‌కం ట్యాక్స్ (ఐటీ) అధికారులు గురువారం దాడులు చేశారు. కాకినాడ రెండో డివిజన్ పరిధి సిద్ధార్థనగర్‌లోని నివాసంతో పాటు కాకినాడ రూరల్ రాయుడుపాలెం జంక్షన్ వద్ద కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సోదాలు నిర్వహించారు. తొలుత నివాసంలో సోదాలు చేసి, అక్కడ నుంచి ఆయనను కార్యాలయానికి తీసుకెళ్లి సోదాలు జరిపారు. చంద్రమౌళి నారా లోకేశ్‌కు సన్నిహితుడుగా గుర్తింపు పొందారు. గతంలో కాకినాడ స్మార్ట్ సిటీలో ఆయన తన కాంట్రాక్టు సంస్థ ద్వారా ఎక్కువ వర్కులు చేపట్టారు. సోదాల్లో హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చిన ఐటీ అధికారులు పాల్గొన్నట్టు తెలిసింది.

బాలల హక్కుల కమిషన్‌లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన కార్యాలయంలో లీగల్ కౌన్సిలర్, సోషల్ వర్కర్ పోస్టులకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు గురువారం ఓ ప్రకటనలో సూచించారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి 42 ఏళ్లలోపు వయసు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నెలకు రూ.19వేలు గౌరవ వేతనం ఇస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులు apscpcr2018@gmail.comకు మెయిల్ చేయవచ్చని, కార్యదర్శి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ప్లాట్ నెంబర్ 511, ఎంజీఎం క్యాపిటల్ బిల్డింగ్, చినకాకాని, మంగళగిరి, గుంటూరు జిల్లా- 522503 అనే చిరునామాలో అందజేయవచ్చని తెలిపారు.

టీడీపీ కట్టిన ఇళ్లకు రంగులేస్తున్నారు

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మించగా, వాటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ పార్టీ రంగులు వేసుకుని గొప్పలు చెబుతోందని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో పేదలకు ఎన్ని ఇళ్లు కట్టిచ్చారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజమండ్రిలోని లోకేశ్ శిబిరం వద్ద యనమల గురువారం విలేకరులతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి విహారయాత్రలే తప్ప అభివృద్ధి లేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయనే నిర్మాణం పూర్తికాని ఇళ్లను ప్రారంభిస్తున్నారని, సామర్లకోటలోనూ అదే పరిస్థితి అని ఆరోపించారు.

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుకు ఎదురుదెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

ఆ కేసుల్లో వేర్వేరుగా అరెస్ట్ చేసి విచారించేందుకు అనుమతించాలని కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పీటీ వారెంట్ పిటిషన్లు దాఖలు చేసింది. ఫైబర్‌నెట్ కుంభకోణంలో పీటీ వారెంట్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదులు.. చంద్రబాబు ప్రధాన కుట్రదారుగా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని వివరించారు. పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరమే ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. సీఐడీ న్యాయవాదుల వాదనలతో సంతృప్తి చెందిన న్యాయస్థానం చంద్రబాబుపై పీటీ వారెంట్‌ను అనుమతిస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది. ఆ సమయంలో చంద్రబాబు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారించనుందని చెప్పారు. అందుకే చంద్రబాబును సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించినట్టు న్యాయాధికారి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు చంద్రబాబును విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు శుక్రవారం నిర్ణయానికి లోబడే తమ తీర్పు ఉంటుందని చెప్పారు.

ప్రత్యేక పీపీపై దాడికి యత్నించిన టీడీపీ న్యాయవాదులు

ఫైబర్‌నెట్ కుంభకోణంలో చంద్రబాబుపై పీటీ వారెంట్‌కు అనుమతించడంతో చంద్రబాబు న్యాయవాదులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. దాంతో వారు దాఖలు చేసిన కాల్ రికార్డ్స్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదిగా ఉన్న ప్రత్యేక పీపీ వివేకానందపై ఒకదశలో దాడికి తెగబడటం న్యాయస్థానాన్ని విస్మయానికి గురిచేసింది. ఒకనొక దశలో తీవ్ర వాగ్వాదంతో న్యాయస్థానం దద్దరిల్లింది. టీడీపీ న్యాయవాదుల వైఖరితో న్యాయాధికారి నిశ్చేష్టురాలయ్యారు. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు విచారిస్తున్న, చంద్రబాబును అరెస్ట్ చేసిన సీఐడీ అధికారుల కాల్ రికార్డులను భద్రపరిచేలా ఆదేశించాలని కోరుతూ టీడీపీ న్యాయవాదులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీఐడీ తరఫున ప్రత్యేక పీపీ వివేకానంద వాదనలు వినిపించారు. సీఐడీ అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగానే కేసు దర్యాప్తు చేయడంతోపాటు పూర్తి ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఆయన అరెస్ట్ సక్రమమని గుర్తించే న్యాయస్థానం రిమాండ్ విధించిందని గుర్తుచేశారు. కానీ కేవలం రాజకీయ దురుద్దేశంతో సీఐడీ అధికారుల కాల్ రికార్డులు భద్రపరచాలని టీడీపీ న్యాయవాదులు కోరుతున్నారని చెప్పారు. అలా చేయడం సీఐడీ అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని న్యాయస్థానానికి నివేదించారు. గతంలో కొన్ని న్యాయస్థానాలు ఇచ్చిన ఇటువంటి ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టేసిన విషయాన్ని కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వివేకానంద వాదనలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది. పిటిషన్ వేసి ఇప్పటికే నెల రోజులైందని టీడీపీ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. అసలు పిటిషన్‌కే అర్హత లేదని ప్రత్యేక పీపీ వివేకానంద బదులిచ్చారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ న్యాయవాది లక్ష్మీనారాయణ ఒక్కసారిగా ప్రత్యేక పీపీ వివేకానందపైకి దూసుకెళ్లారు. సీఐడీ తరఫున లీగల్ సబ్మిషన్లు చెబుతున్న ఆయనపైకి దూసుకెళ్లి అత్యుత్సాహంతో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసినవారికి బెయిల్ ఇస్తారని ఈ కేసుతో సంబంధంలేని అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఈ కేసులో మీరు ఎందుకు ఇలా చేస్తున్నారని లక్ష్మీనారాయణను న్యాయాధికారి ఆగ్రహంగా ప్రశ్నించారు. లక్ష్మీనారాయణ తీరుపై వివేకానంద కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల న్యాయవాదుల వాగ్వాదంతో న్యాయస్థానం కాసేపు దద్దరిల్లింది. న్యాయస్థానంలో అతిగా ప్రవర్తిస్తున్న వారిపేర్లను నమోదు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నాగరాజు అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్స్‌లో ఉన్నారా.. అని న్యాయాధికారి ప్రశ్నించారు. వారిద్దరూ ఆ జాబితాలో లేరని చంద్రబాబు న్యాయవాదులు సమాధానం చెప్పారు. అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్‌లో ఉన్నవాళ్లు తప్ప అందరూ బయటకు వెళ్లాలని ఆదేశించిన న్యాయాధికారి .. ఈ విధంగా ఉంటే తాను ఈ కేసు విచారించలేనని పేర్కొంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ బెంచ్‌దిగి వెళ్లిపోయారు.

అంగళ్లు విధ్వంసం కేసులో బాబు ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు



సాక్షి, అమరావతి: యుద్ధభేరి పేరుతో ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు సాగించిన విధ్వంసంపై ముదివీడు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంలో గురువారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం నిర్ణయాన్ని వెలువరిస్తామన్నారు. అంతకుముందు చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. అధికార పార్టీకి చెందిన వారే అలజడి సృష్టించాలన్న ఉద్దేశంతో ర్యాలీపై రాళ్లదాడి చేశారని చెప్పారు. తమపై దాడిచేసి ఆ తరువాత నాలుగు రోజులకు తప్పుడు ఫిర్యాదు చేశారని, పోలీసులు సైతం వాస్తవాలు తెలుసుకోకుండానే కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో ఇతర నిందితులందరికీ హైకోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసిందన్నారు.

చంద్రబాబు ప్రోద్బలంతోనే విధ్వంసం

పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు ప్రోద్బలంతోనే అంగళ్లు విధ్వంసం జరిగిందని చెప్పారు. పార్టీ శ్రేణులను రెచ్చగొట్టారన్నారు. అంగళ్లు వద్ద మొదలైన విధ్వంసం చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు కొనసాగిందని, ఈ ఘటనలో పోలీసులు పెద్దసంఖ్యలో గాయపడ్డారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రిగా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వ్యక్తి పూర్తి బాధ్యతారాహిత్యంతో వ్యవహరించారని చెప్పారు. చంద్రబాబు ప్రోద్బలంతో జరిగిన ఈ దాడిలో పిటిషనర్, ఇతరులు గాయపడ్డారని తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు బెయిల్‌కు అర్హులు కాదని, అందువల్ల ఈ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును శుక్రవారం వెలువరిస్తానని తెలిపారు.

నారాయణ అల్లుడిని రెండోరోజు విచారించిన సీఐడీ

ఐఆర్ఆర్ కేసులో పునీత్‌ను ప్రశ్నించిన అధికారులు

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇన్నర్ రింగ్‌రోడ్డు(ఐఆర్ఆర్) కుంభకోణంలో మాజీమంత్రి పి.నారాయణ అల్లుడు పునీత్‌ను సీఐడీ అధికారులు వరుసగా రెండోరోజు గురువారం కూడా విచారించారు. ప్రధానంగా నారాయణ విద్యాసంస్థలకు అనుబంధంగా ఎన్‌స్పైరా అనే కంపెనీని ఏర్పాటు చేసి నిధుల మళ్లింపుపై ఆయన్ని ప్రశ్నించినట్టు సమాచారం. ఇన్నర్ రింగ్‌రోడ్డు కుంభకోణంలో కీలకమైన నిధుల వ్యవహారం అంతా ఎన్‌స్పైరా కంపెనీ ద్వారానే సాగిందని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. నారాయణ కుమార్తె, అల్లుడు డైరెక్టర్లుగా ఆ కంపెనీని ఏర్పాటు చేశారు. ఎన్‌స్పైరా కంపెనీ నిధుల అంశంపైనే పునీత్‌ను సీఐడీ అధికారులు ప్రధానంగా ప్రశ్నించారు. ఎన్‌స్పైరా అనే కంపెనీలోకి నిధులు ఎలా వచ్చాయి, వాటిని రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాల్లోకి ఎందుకు బదిలీ చేశారు, అలా బదిలీ చేసిన నిధులను రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ నగదుగా డ్రా చేసి నారాయణ విద్యాసంస్థల ఉద్యోగులకు ఎందుకు ఇచ్చింది, ఆ నిధులతో అసైన్డ్ భూముల కొనుగోలు, ఆ భూముల కౌలు ప్యాకేజీ నిధులు మళ్లీ నారాయణ సంస్థలకు చేరడం గురించి పునీత్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. వాటికి పునీత్ సూటిగా సమాధానాలు చెప్పలేకపోయారని తెలిసింది. పునీత్ వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న సీఐడీ అధికారులు అవసరమైనప్పుడు మళ్లీ పిలుస్తామని ఆయనకు చెప్పారు.

స్కిల్ కుంభకోణంలో లోకేశ్ నిందితుడు కాదు

- నిందితుడిగా చేరిస్తే చట్టప్రకారం నోటీసు ఇస్తాం
- హైకోర్టుకు నివేదించిన అదనపు పీపీ దుష్యంత్‌రెడ్డి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీమంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఇప్పటివరకు నిందితుడిగా చేర్చలేదని సీఐడీ గురువారం హైకోర్టుకు నివేదించింది. ఒకవేళ లోకేశ్‌ను నిందితుడిగా చేరిస్తే చట్టప్రకారం అతడికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు జారీచేస్తామని సీఐడీ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.దుష్యంత్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. ఈ మేరకు సీఐడీ అధికారులు సమర్పించిన లిఖితపూర్వక మెమోను కోర్టు ముందుంచారు. ఈ వివరాలను పరిశీలించిన న్యాయస్థానం వాటిని రికార్డ్ చేసింది. ఈ మెమో నేపథ్యంలో లోకేశ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తదుపరి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని స్పష్టం చేస్తూ.. ఆ పిటిషన్‌ను మూసేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ లోకేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తనను నిందితుడిగా చేర్చి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అరెస్ట్‌చేసే ప్రమాదం ఉందని, అందువల్ల తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని లోకేశ్ కోర్టును కోరారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది.

'స్కిల్' కేసులో బాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

మన ప్రభుత్వం వచ్చాకే ఫార్మసి కౌన్సిల్‌కు పూర్తిస్థాయి కమిటీ

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్ : వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఏపీ ఫార్మసి కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చదువులో సత్తా చాటిన ఫార్మసి విద్యార్థులు, బోధనలో ప్రతిభ చూపిన ఫార్మసి కళాశాలల ప్రిన్సిపాల్స్, కోవిడ్ సమయంలో కష్టపడి పనిచేసిన ఫార్మాసిస్టులకు గురువారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా వంద మంది ఫార్మసి విద్యార్థులు, వంద మంది ప్రిన్సిపాల్స్, 40 మంది ఫార్మసిస్టులను సన్మానించారు. కార్యక్రమానికి మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని, మన దేశంలోనూ ఇప్పుడిప్పుడే ఫార్మసిస్టులకు తగిన గుర్తింపు దక్కుతోందని తెలిపారు. ఏపీ ఫార్మసి కౌన్సిల్‌కు పూర్తి స్థాయి కమిటీ గత 15 ఏళ్లుగా లేదని, గత ప్రభుత్వం కౌన్సిల్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక పూర్తిస్థాయి కమిటీని నియమించినట్టు తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 53,200 మంది సిబ్బందిని నియమించిన గొప్ప ప్రభుత్వం తమదేనన్నారు. వారిలో ఏకంగా 600 మంది ఫార్మసిస్టు పోస్టులు కూడా ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్, ఏపీ ఫార్మసి కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలియం కేరి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ప్రసంగించారు.


విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇస్తున్న మంత్రి రజిని

బాబు కోసమే పురందేశ్వరి ప్రయత్నాలు

ప్రజాధనం దోచుకోవడం తప్పు అని, చంద్రబాబు అదే చేశారని మంత్రి విడదల రజిని చెప్పారు. సన్మానం కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి... చంద్రబాబు ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని, ఆయనను కాపాడేందుకే లోకేశ్‌ను బీజేపీ అగ్రనేతలతో మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రతివార్డు సచివాలయంలోనూ క్యాంపులు

సీఎం జగన్ ఆదేశాల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పట్టణ ప్రాంతాల్లోనూ వార్డు సచివాలయాల వారీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రజిని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పొన్నూరు రోడ్డులోని ఆనందపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 10,574 వైద్య శిబిరాలు నిర్వహించాలని తొలుత భావించామని, కార్యక్రమానికి ప్రజల నుంచి సంచలన రీతిలో స్పందన వస్తుండటంతో అర్బన్ ఆస్పత్రి పరిధిలో కాకుండా ప్రతి వార్డు సచివాలయానికి ఒక వైద్య శిబిరం నిర్వహించాలని సీఎం జగన్ నిర్ణయించినట్టు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రంలో మరో నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు క్యాంపులు పెరిగే వీలుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12 రోజుల్లో ఏకంగా 18,59,123 ఓపీ సేవలు నమోదయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 5,200 వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు.

కేసులతో ఇబ్బంది పెడుతున్నారని చెప్పా

- సీఐడీ నన్ను ఎందుకు పిలిచిందో అమిత్ షా అడిగారు
- రాజకీయ కక్ష సాధింపు జరుగుతోంది.. జోక్యం చేసుకోవాలని కోరాను
- మీడియాతో నారా లోకేశ్ చిట్‌చాట్

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీలో రాజకీయ కక్ష సాధింపు జరుగుతోందని.. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. ఢిల్లీలో గురువారం టీడీపీ ఎంపీలు కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావులతో కలిసి ఎంపిక చేసిన మీడియా ప్రతినిధులతో లోకేశ్ చిట్‌చాట్ చేశారు. ఆయన ఏమన్నారంటే.. 'నిన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశా. కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని చెప్పా. సీఐడీ నన్ను ఎందుకు పిలిచింది.. చంద్రబాబు ఆరోగ్యం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జైల్లో నక్సలైట్లు ఉన్నారని.. రక్షణపరంగా ఇబ్బందులు ఉన్నాయని తెలిపాను. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాల్‌చేసి అమిత్ షా నిన్ను కలవాలని అంటున్నారని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో నీ పాత్ర ఏంటి? నిన్ను ఎందుకు పిలిచారు అని అమిత్ షా అడిగారు. చంద్రబాబు కేసుల విషయంపై రాష్ట్రాన్ని వివరణ కోరతామని ఆయన హామీ ఇచ్చారు. కేసులు, లీగల్ అంశాలపై దృష్టి పెట్టేందుకే పాదయాత్ర ఆపాను. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎటువంటి ఆధారాల్లేవు. కేసులకు సంబంధంలేని మా అమ్మ ఐటీ రిటర్న్స్ అడుగుతున్నారు. నా అకౌంట్స్, క్రెడిట్ కార్డు బిల్లులు అన్నీ చెక్ చేస్తున్నారు. లింగమనేని ఇంటికి మేం రెంట్ కడితే క్విడ్ ప్రోకో అంటున్నారు. మొదటి రోజు 50 ప్రశ్నలు అడిగారు.. 5 ప్రశ్నలు నాకు తెలీదని చెప్పాను. రెండోరోజు నాకు సంబంధం లేని ప్రశ్నలు అడిగారు. ఇక చంద్రబాబు కేసులో సోమవారం సుప్రీంకోర్టులో తుది ఉత్తర్వులు వస్తాయని భావిస్తున్నా. సీఐడీ దర్యాప్తు వ్యవహారంపై సీబీఐకి ఫిర్యాదు చేస్తాం. జైలులో అసౌకర్యంగా ఉందని కోర్టుకు తెలపమని ములాఖత్‌కి వెళ్లినప్పుడు చంద్రబాబు చెప్పారు. దానిని కోర్టు దృష్టికి తీసుకువెళ్తాం. ఎన్డీఏ, ఇండియా కూటములకు సమదూరంలో ఉన్నాం' అని అన్నారు.

చంద్రబాబుకు స్కిన్ అలర్జీ

- ఎండ వేడిమి, ఉక్కపోతే కారణం
- ఇద్దరు చర్మవ్యాధి నిపుణులతో వైద్య పరీక్షలు
- బాబు ఆరోగ్యం బాగుందని జైలు అధికారుల వెల్లడి

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్ అనుభవిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తీవ్ర ఎండ, ఉక్కపోత కారణంగా అలర్జీతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని చంద్రబాబు జైలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన జైలు అధికారులు రాజమండ్రిలోని బోధనాస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ మహాలక్ష్మికి సమాచారం ఇచ్చారు. వైద్యులను పంపాలని లేఖలో కోరారు. వెంటనే స్పందించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇద్దరు చర్మ సంబంధిత వ్యాధి నిపుణులను కేటాయించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సూర్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.సునీతాదేవి సెంట్రల్ జైలుకు వెళ్లి చంద్రబాబుకు వైద్య పరీక్షలు చేపట్టారు. పరీక్షల అనంతరం వైద్యులు ఎలాంటి వివరాలు వెల్లడించకుండా తిరిగి జీజీహెచ్‌కు వెళ్లిపోయారు. వైద్య పరీక్షల్లో వెల్లడైన ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్టు సమాచారం. సెంట్రల్ జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబుకు అలర్జీ ఉందని చెప్పడంతో చర్మ వైద్యుల్ని పిలిపించి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. అవసరమైన మందులు సూచించినట్టు వెల్లడించారు. వైద్యులు చెప్పిన మందులను చంద్రబాబుకు అందజేసినట్టు చెప్పారు.

హెల్త్ బులెటిన్ విడుదల

చంద్రబాబు చర్మ వ్యాధి బారినపడిన నేపథ్యంలో జైలు అధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. బీపీ 140/80 ఎంఎంహెచ్‌జీ, టెంపరేచర్ నార్మల్‌గా ఉందన్నారు. పల్స్ రేట్ 87 (నిమిషానికి) ఉందని, ఊపిరితిత్తుల్లో ఎలాంటి సమస్య లేదని వెల్లడించారు. చంద్రబాబు ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అసైన్డ్ భూదోపిడీలో కొత్త కోణం.. గుట్టుగా జీఓ–41 జారీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత తమ బినామీల ద్వారా వాటిని అతి తక్కువ ధరకు కొనుగోలు చేయిస్తూ సేల్‌డీడ్ల ద్వారా రిజిస్టర్ చేయించుకునేందుకు దరఖాస్తు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని తెలిసి కూడా దరఖాస్తు చేయడం వెనుక పెద్ద గూడుపుఠాణి ఉంది. సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ తిరస్కరిస్తూ నెంబర్ కేటాయించిన తర్వాత ఆ భూములన్నీ 1954కు ముందు కేటాయించినవేనని బుకాయిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు.. టీడీపీ నేతల ఒత్తిడితో ఆ భూములన్నీ 1954కు ముందు కేటాయించినవేనని సీఆర్డీఏ అధికారులు గుర్తించి టీడీపీ నేతలు, వారి బినామీ పేర్లను సీఆర్డీఏ రికార్డుల్లో నమోదుచేసి ప్యాకేజీ ప్రకటించారు. భూములన్నీ తమ హస్తగతమయ్యాక అసైన్డ్ భూములకూ భూసమీకరణ ప్యాకేజీని ప్రకటిస్తూ జీఓ–41ను టీడీపీ ప్రభుత్వం జారీచేసింది. ఈ కుట్ర ద్వారా 950 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టిన విషయం తెలిసిందే. ఈ భూదోపిడీకి మూలమైన జీఓ–41 జారీ వెనుక అసలు కుట్ర తాజాగా బయటపడింది.

కేబినెట్ ఆమోదం లేకుండానే జీఓ..

అమరావతిలో అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు ఈ జీఓ–41 జారీచేయడం వెనుకనున్న కుట్ర కోణం సిట్ దర్యాప్తులో తాజాగా వెలుగులోకి వచ్చింది. నిజానికి.. రాజధాని అమరావతి ఏర్పాటుకోసం చంద్రబాబు ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం ప్రకారం సీఆర్‌డీఏ పరిధిలో భూవ్యవహారాలకు సంబంధించి ఎలాంటి నిర్ణయమైనా కేబినెట్ ఆమోదం తప్పనిసరి. కానీ, అసైన్డ్ భూముల పరిరక్షణ చట్టం –1977కు వ్యతిరేకంగా చంద్రబాబు ప్రభుత్వం జీఓ–41ను తీసుకొచ్చింది. అందుకు కేబినెట్ ఆమోదం తీసుకోలేదు. కేబినెట్‌లో చర్చించకుండానే ఏకపక్షంగా జీఓ–41ను అడ్డదారిలో జారీచేసేసింది. ఎందుకంటే కేబినెట్‌లో తీర్మానం చేయాలంటే అందుకు నిబంధనలు అంగీకరించవు. అందుకే కేబినెట్‌ను బైపాస్ చేసి జీఓ జారీచేసింది. తద్వారా.. మంత్రివర్గం ఆమోదంతోనే భూవ్యవహారాలపై నిర్ణయాలు తీసుకోవాలన్న సీఆర్‌డీఏ చట్టాన్ని సైతం ఉల్లంఘించింది.

నారా, నారాయణే కుట్రదారులు..


ఇక నిబంధనలకు విరుద్ధంగా జీఓ–41ను అప్పటి పురపాలక–సీఆర్‌డీఏ శాఖ మంత్రి పి.నారాయణ 2016, ఫిబ్రవరి 29న ఆమోదించారు. అనంతరం 2016, మార్చి 22న సీఎం హోదాలో చంద్రబాబు పోస్ట్–ఫాక్టో–రాటిఫికేషన్ చేసి మరీ ఆమోదించారు. అంటే.. అసైన్డ్ భూములు కొల్లగొట్టేందుకు జీఓ–41 కుట్ర పూర్తిగా చంద్రబాబు, నారాయణ కనుసన్నల్లోనే సాగింది. ఈ కీలక అంశాలను అప్పటి ఉన్నతాధికారులు సిట్ దర్యాప్తులో వెల్లడించినట్లు సమాచారం. ఈ మేరకు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్, సీఆర్‌డీఏ, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు వాంగ్మూలాలు ఇచ్చారు. అసైన్డ్ చట్టానికి విరుద్ధమైనప్పటికీ చంద్రబాబు, నారాయణ ఒత్తిడితోనే జీఓ–41 జారీచేయాల్సి వచ్చిందని స్పష్టంచేశారు. అలా జారీచేసిన జీఓ–41తో అమరావతి పరిధిలోని 950 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు ముఠా కొల్లగొట్టింది. తమ భూదాహం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతుల పొట్టకొట్టింది.



ఫ్యాషన్

దాండియా నృత్యానికి కళ తెచ్చే దుస్తుల జాబితాలో
ముందు వరసలో ఉండేది లెహెంగా చోలీ.
చనియా చోలీగా గిరిజన సంప్రదాయ కళ
ఓ వైపు అబ్బురపరుస్తుంది
మనవైన చేనేతల గొప్పతనం మరోవైపు కళ్లకు కదుతుంది.
అద్దకం కొత్తగా మెరిసిపోతుంటుంది.
ఎరుపు, పచ్చ, పసుపు...
రంగుల ప్రపంచంలో మునిగిపోయినట్టుగా ఉంటుంది.
లెహంగా అంచులు నృత్యంతో పోటీపడుతుంటే
ఆనందానికి ఆకాశమే హద్దు అవుతుంది.









నవరాత్రి ఉత్సాహం

రాజస్థానీ కళ

గిరిజన సంప్రదాయ కళ ఉట్టిపడే ఎంబ్రాయిడరీ చనియా చోలీలు ఇప్పుడు నగరాల్లో జరిగే దాండియా వేడుకలలో తెగ వెలిగిపోతున్నాయి. వాటిని ధరించిన అమ్మాయిలు ఆటపాటల కోలాటంలో తమని తాము కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు.

మనవైన ఫ్లోరల్స్

నృత్యం ఎప్పుడూ ఆనందాన్ని రెట్టింపు చేస్తూనే ఉంటుంది. ఆ ఆనందంతో పోటీ పడే దుస్తుల్లో ఫ్లోరల్స్ కూడా తమ స్థానాన్ని గుర్తుచేస్తూనే ఉంటాయి. సంప్రదాయ కళతో పాటు కొద్దిగా ఆధునికత కూడా ఉట్టిపడాలనుకునేవారు ఫ్లోరల్ గాగ్రా చోలీలు ఎంచుకోవచ్చు.

బ్లాక్ ప్రింట్స్

కలంకారీ, గుజరాతీ బ్లాక్ ప్రింట్స్ గాగ్రా చోలీలు దాండియాలో తమ వైభవాన్ని చాటడానికి పోటీపడుతుంటాయి. టాప్ టు బాటమ్ ఒకే కలర్, ప్రింట్స్‌తో ఉండే ఈ డ్రెస్సులు గ్రాండ్‌గా కనిపిస్తుంటాయి.

అది వద్దు, ఇది వద్దు అని
తెగ మారాం చేస్తుంటారు పిల్లలు.
పెద్దలు కూడా తామేమీ తక్కువ కాదన్నట్టు..
రోజూ ఇదేనా.. అని వంకలు పెడుతూ సరిగా తినరు.
వీళ్లు సైతం 'మరో రెండు వెయ్యండి' అని అడిగే రుచులతో
ఈ వారం వంటిల్లు మీ ముందుకొచ్చింది.

వంటిల్లు

ఇంకోటి ఇవ్వమ్మా!

సగ్గుబియ్యం టిక్కీ



కావలసినవి: సగ్గుబియ్యం – కప్పు; వేయించిన పల్లీలు – కప్పు; బంగాళ దుంపలు – రెండు; అల్లం – రెండు అంగుళాల ముక్క; పచ్చిమిర్చి – రెండు; జీలకర్ర – టీస్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; నిమ్మకాయ – అరచెక్క; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: • సగ్గుబియ్యాన్ని దోరగా వేయించి, చల్లారాక పొడిచేసి పెట్టుకోవాలి • పల్లీలను బరకగా గ్రైండ్ చేసి సగ్గుబియ్యం పొడిలో కలపాలి • బంగాళ దుంపలను తొక్కతీసి ముక్కలుగా తరగాలి. • పచ్చిమిర్చి, అల్లం కూడా ముక్కలుగా తరగాలి. • ఇప్పుడు బంగాళదుంప ముక్కలు, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, కొత్తిమీర తరుగు వేసి గ్రైండ్ చేయాలి • నలిగిన మిశ్రమాన్ని, సగ్గుబియ్యం పొడిలో వేసి, రుచికి సరిపడా ఉప్పు, నిమ్మచెక్కను పిండి రసం వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. • పదిహేను నిమిషాల తరువాత పిండిని టిక్కీల ఆకారంలో వత్తుకుని డీప్‌ఫ్రై చేస్తే సగ్గుబియ్యం టిక్కీలు రెడీ • కొత్తిమీర చట్నీతో ఈ టిక్కీలు చాలా రుచిగా ఉంటాయి.

క్రిస్పీ రోల్స్



కావలసినవి: చపాతీలు – మూడు ; కొత్తిమీర తరుగు – అరకప్పు ; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; కారం – అరటీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; గరం మసాలా – రెండు టీస్పూన్లు ; పచ్చిమిర్చి – రెండు; ఉల్లిపాయ – ఒకటి; చాట్ మసాలా – ఒకటిన్నర టీస్పూన్లు; గోధుమ పిండి –అర కప్పు; బియ్యప్పిండి – స్పూను; కార్న్‌ఫ్లోర్ – మూడు టీ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా

తయారీ: • చపాతీలను సన్నగా పొడవుగా తరిగి, రుచికి సరిపడా ఉప్పు, కారం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమంపై కొద్దిగా నీళ్లుచల్లి మరోసారి కలపాలి • ఇప్పుడు మెత్తగా మారిన చపాతీ మిశ్రమంలో కార్న్‌ఫ్లోర్, బియ్యప్పిండి కలిపి పక్కన పెట్టుకోవాలి. • ఉల్లిపాయ, పచ్చిమిర్చిని సన్నని ముక్కలుగా తరగాలి. • బంగాళదుంపలు తొక్కతీసి చిదుముకోవాలి. దీనిలో ధనియాల పొడి, గరం మసాలా; పచ్చిమిర్చి, ఉల్లి తరుగు, ఛాట్ మసాలా, రుచికి సరిపడా ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. • ఇప్పుడు చేతులకు కొద్దిగా నూనె రాసుకుని దుంప మిశ్రమాన్ని రోల్స్‌గా చుట్టుకోవాలి •గోధుమపిండిలో రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా కలపాలి • ఇప్పుడు దుంపరోల్స్‌ను గోధుమపిండిలో ముంచి, తరువాత చపాతీ మిశ్రమాన్ని రోల్‌కు అద్దాలి • ఇప్పుడు రోల్‌ను మరుగుతోన్న నూనెలో వేసి, గోల్డెన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీయాలి • ఇలా రోల్స్ అన్నింటిని వేయిస్తే క్రిస్పీ రోల్స్ రెడీ.

కొబ్బరి ఖీమా బాల్స్



కావలసినవి: కొబ్బరి – ఒక చిప్ప; కారం – అర టీ స్పూను; పసుపు – చిటికెడు; గరం మసాలా – అరటీస్పూను; ధనియాల పొడి – అర టీ స్పూను; కొత్తిమీర తరుగు – మూడు టీస్పూన్లు శనగ పిండి – రెండు టీస్పూన్లు; పచ్చిమిర్చి – రెండు స్పూన్లు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: • పచ్చిమిర్చిని సన్నగా తరిగి పెట్టుకోవాలి • కొబ్బరి చిప్పలోని కొబ్బరిని తురుముకోవాలి • కొబ్బరి తురుముని గిన్నెలో వేసి.. కారం, పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, కొత్తిమీర తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి • చివరిగా శనగపిండివేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఉండలుగా చుట్టుకోవాలి • బాణలిలో నూనె వేసి వేడెక్కిన తరువాత ఉండలను వేసి వేయించాలి • ఉండలు వేగిన తరువాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి మూడు నిమిషాలు వేయించితే కొబ్బరి ఖీమా బాల్స్ రెడీ • ఉల్లిపాయ ముక్కలు, నిమ్మరసంతో సర్వ్‌చేసుకోవాలి.

రవ్వ వడలు



కావలసినవి: బియ్యప్పిండి – కప్పు; సూజీ రవ్వ – కప్పు; గోధుమ పిండి – కప్పు; ఉల్లిపాయలు – మూడు; పచ్చిమిర్చి – ఐదు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; నువ్వులు – టేబుల్ స్పూను; పీనట్ బటర్ – టేబుల్ స్పూను; అల్లం తురుము – టేబుల్ స్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: • పచ్చిమిర్చి, ఉల్లిపాయలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి • పెద్దగిన్నెలో ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, కొత్తిమీర తరుగు రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి • ఇప్పుడు బియ్యప్పిండి, గోధుమ పిండి, సూజీ రవ్వ, నువ్వులు, పీనట్ బటర్, అల్లం తురుము వేసి కలపాలి • అవసరాన్ని బట్టి కొద్దిగా నీళ్ల పోసుకుంటూ ముద్దలా కలపాలి • ముద్దను చిన్నచిన్న ఉండలుగా చేసి వడల్లా వత్తుకోవాలి • ఈ వడలను బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రవ్వ చెక్కలు రెడీ • వేడివేడి వడలు చట్నీతో సర్వ్ చేసుకోవాలి.

న్యూస్ మేకర్

రాధమ్మ విజయం

రాధ వెంబు విజయాన్ని చూసిన తరువాత 'ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది' అనే సుపరిచిత మాటకు అదనంగా మరో మాట చేర్చవచ్చు అనిపిస్తుంది.

'ప్రతి పరిశ్రమ విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది'

సాధారణ ఉద్యోగిగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ 'జోహో కార్పోరేషన్'లోకి అడుగు పెట్టిన రాధ వెంబు క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి గెలుపు పాఠాలు తయారు చేసుకుంది. ప్రతిభావంతులైన సిబ్బందికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి బలమైన సైన్యాన్ని తయారు చేసింది.



మీడియాలో, సోషల్ మీడియాలో ఎక్కువగా కనిపించని రాధ వెంబు 'ఇన్‌విజిబుల్ ఫోర్స్'గా పేరు తెచ్చుకుంది. తాజాగా '360 వన్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2023' లో చోటు సంపాదించి, బ్యూటీ అండ్ లైఫ్ స్టైల్ రిటైల్ కంపెనీ నైకా ఫౌండర్ ఫల్గుణీ నాయర్‌ని దాటేసి మన దేశంలోని సంపన్న మహిళగా వార్తల్లో నిలిచింది....

'ఎన్నో విజయాలు సాధించిన రాధ వెంబు గురించి నేనెందుకు విన లేకపోయాను అనేది ఆశ్చర్యంగా అనిపిస్తుంది' అంటూ ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రాశాడు జోహో కార్పొరేషన్ కన్సల్టెంట్ ఇంగ్లాండ్‌కు చెందిన ఆడిసన్. ఈ కన్సల్టెంట్‌కు మాత్రమే కాదు దేశంలో చాలామందికి ఆమె విజయాల గురించి తప్ప వ్యక్తిగత వివరాల గురించి తెలియదు.

'సెల్ఫ్–మేడ్ ఉమన్' అనేది ఆమె పేరు ముందు కనిపించే విశేషణం.

'కామ్ అండ్ టాస్క్–ఓరియెంటెడ్' అని సన్నిహితులు రాధ గురించి చెబుతుంటారు.

చెన్నైలో పుట్టి పెరిగింది రాధ. తండ్రి మద్రాస్ హైకోర్టులో స్టెనోగ్రాఫర్. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(మద్రాస్)లో ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్‌లో పట్టా పుచ్చుకుంది రాధ. ఆమె సోదరుడు శ్రీధర్ వెంబు ఆమెకు స్నేహితుడు, గురువు. టెక్ ఇండస్ట్రీ గురించి గంటల కొద్దీ మాట్లాడుకునేవారు. మన కంపెనీలను విదేశీ కంపెనీలతో పోల్చుతూ విశ్లేషించుకునేవారు.

తన సోదరులతో కలిసి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ 'జోహో కార్పొరేషన్' మొదలు పెట్టింది రాధ వెంబు. అంతకుముందు ఉన్న శ్రీధర్ వెంబు కంపెనీ 'అడ్వెన్ నెట్' జోహో కార్పోరేషన్‌లో విలీనమైంది.

మొదట్లో ఒక సాధారణ ఉద్యోగిగా ఆ సంస్థలో చేరింది రాధ వెంబు.

క్షేత్రస్థాయి పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయడానికి ఇది తనకెంతో ఉపయోగపడింది.

ఆ తరువాత జోహో మెయిల్ ప్రాడక్ట్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించింది. వేగంగా ఉన్నత హోదాలోకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ చాలా సంవత్సరాల పాటు ప్రాడక్ట్ మేనేజర్‌గానే పనిచేసింది. పెద్ద పెద్ద సంస్థలతో పోటీ పడుతూ తమ కంపెనీని ముందు వరుసలో నిలిచేలా చేసింది.



'కంపెనీకి సంబంధించిన సాంకేతికతను శక్తిమంతం చేయడానికి, కస్టమర్‌లను ఆశ్చర్యానందాలకు గురి చేయడానికి సంబంధించి ఎప్పుడూ ఆలోచిస్తుంటాను' అంటుంది రాధ.

'పని చేసే ప్రదేశంలో పక్షపాతానికి చోటు లేదు. ఆడా మగా అనే తేడా లేదు. ప్రతిభ ఒక్కటే ప్రమాణం' అని నమ్మడమే కాదు ఆచరణలో నిరూపించింది రాధ.

జోహో వర్క్‌కల్చర్ బాగా పాపులర్ అయింది. ఒక స్థాయికి చేరిన తరువాత టెక్ కంపెనీల హెడ్‌క్వార్టర్స్ విదేశాల బాట పడితే 'జోహో' మాత్రం మన దేశంలోని చిన్న పట్టణాలను ఎంచుకుంది.

టెక్ రంగంలో పురుషాధిక్యతే ఎక్కువగా కనిపించే పరిస్థితులలో రాధా వెంబు ఎన్నో మూస ఆలోచనలను బద్దలు కొట్టింది. ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది.

'నువ్వు కనిపించడం కాదు నీ ప్రాడక్ట్ కనిపించాలి. నువ్వు మాట్లాడడం కాదు నీ ప్రాడక్ట్ మాట్లాడాలి' అనేది రాధ వెంబు నమ్మిన సిద్ధాంతం.

పబ్లిసిటీ లేకపోతే పని జరగదు అని నమ్మే ఈ కాలంలోనూ ఆమె నమ్మిన సిద్ధాంతం నిలిచి గెలిచింది.

తీరిక సమయాల్లో తోటపని చేసే రాధ వెంబుకు సామాజిక సేవాకార్యక్రమాలు అంటే ఇష్టం.

'సంపన్నురాలిగా మారాలని టెక్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టలేదు. నాకంటూ కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని ఆచరణలోకి తీసుకువచ్చి ఆ ఫలితాలతో సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో వచ్చాను' అంటుంది రాధ వెంబు.

వేడుక సమయం

ఆరోగ్య తాండవం

నవరాత్రి సందర్భంగా దాండియా ఆడటం సంప్రదాయం. చేతిలో కోలాటం కర్రలతో ఆడటమే 'దాండియా'. కాని కర్రలు లేకుండా చేసే నృత్యం కూడా గుజరాత్‌తో పాటు ఉత్తర భారతంలో అంతే ప్రముఖమైనది. దాని పేరు 'గర్బ'. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు చేసే ఈ నృత్యం కేవలం పారవశ్య తాండవమే కాదు ఆరోగ్య తాండవం అని కూడా అంటున్నారు ఆరోగ్య నిపుణులు.



'గర్బ' అనే మాట 'గర్భ' నుంచి వచ్చింది. స్త్రీ శక్తికి చిహ్నం గర్భధారణం. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జీవశక్తికి ప్రాణం పోసే స్త్రీ శక్తిని సూచించేందుకు గుజరాత్ అంతా 'గర్బ' నృత్యం చేస్తారు. దాండియా అంత విస్తృతంగానే గర్బ కూడా ఆడతారు. అందులో కర్రలు ఉంటాయి. ఇందులో ఉండవు. కాని గర్బ నృత్యం శరీరానికి చాలా మేలు చేస్తుంది అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా 9 రోజుల పాటు స్త్రీలు ఈ నృత్యం చేయడం వల్ల వారి ఆరోగ్యం మెరుగవుతుంది అంటున్నారు.

కేలరీల ఖర్చు

గంటసేపు గర్బ డాన్స్ చేయడం వల్ల 300 నుంచి 500 కేలరీలు ఖర్చవుతాయి. అంతే కాదు, శరీరాంగాలకు ఇందులో గొప్ప వ్యాయామం లభిస్తుంది. ఈ నృత్య భంగిమల వల్ల భుజాలు, మెడ, వీపు, మోకాళ్లు బాగా కదిలి కండరాలన్నీ చైతన్యంలోకి వస్తాయి. సునీల్ బఫ్నా అనే ఆరోగ్య నిపుణుడి ప్రకారం గంట సేపు గర్బ చేస్తే మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గి ఒక ప్రశాంత స్థితి వస్తుంది. గర్బ చేసే సమయంలో శరీరం ఎండార్ఫిన్స్‌ను విడుదల చేయడమే ఇందుకు కారణం. అదీగాక ఇది బృందంతో చేసే నృత్యం కాబట్టి మనతో పాటు ఒక సమూహం ఉంది అనే భరోసా మనసుకు లభించి మంచి అనుభూతి కలుగుతుంది. అందుకే నవరాత్రుల సమయంలోనే కాదు సంవత్సరం పొడుగునా గర్బా డ్యాన్స్ చేయమని ఫిట్‌నెస్ నిపుణులు కూడా చెబుతున్నారు.


గుండెకు మంచిది

గర్బలో ఆధ్యాత్మికత ఉంది. నృత్యం ద్వారా చేసే ఆరాధన కనుక దీనిని చేయడం వల్ల శరీరానికి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. ఇందులో చప్పట్లతో, సంగీతానికి తగినట్టుగా లయ కలిగిన కదలికలు ఉంటాయి కనుక అవన్నీ గుండెకు, నృత్య సందర్భంగా ఉచ్ఛ్వాస నిశ్వాసల వేగం పెరుగుతుంది కనుక ఊపిరితిత్తులకు చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు.

కాబట్టి గర్బ ఆధ్యాత్మిక, ఆరోగ్య తాండవం.

పంచతంత్రం

రాజస్తాన్‌లో స్వింగ్ ఎటు?



రాజస్తాన్‌లో ప్రజలు వరుసగా రెండుసార్లు ఏ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టిన దాఖలాలు లేవు. కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరాటంతో చెరో అయిదేళ్లు అధికారాన్ని పంచుకుంటున్నాయి. పార్టీ విజయాల్లో స్వింగ్ స్థానాలే కింగ్ మేకర్స్‌గా మారి అధికారంలోకి ఎవరు రావాలో నిర్ణయిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో ఈ స్వింగ్ స్థానాల్లో ఏ పార్టీకి ఎలా ఉంది? ఈ సారి ఓటర్లు ఎవరి వైపు ఉండబోతున్నారు?

రాజస్తాన్‌లో 200 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 166 నియోజకవర్గాల్లో ఓటరు నాడి పట్టుకోవడం కష్టంగా మారింది. ప్రతీసారి ఆ నియోజకవర్గాల్లో ప్రజలు పార్టీని మార్చేస్తూ ఉంటారు. ఈ నియోజకవర్గాల్లో గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్‌పై బీజేపీ తన పట్టు ప్రదర్శిస్తోంది. ప్రజల రాజకీయ ప్రాధాన్యాలేంటో తలపండిన రాజకీయ నాయకులకి కూడా అంతుపట్టడం లేదు. 2008లో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించినా 2018లో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకున్నప్పటికీ స్వింగ్ స్థానాలు మాత్రం రాజస్తాన్ రాజకీయాల్లో వైల్డ్ కార్డులుగా మారాయి. 2018లో స్వింగ్ స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీలు కూడా తమ ఉనికిని చాటాయి. ఎవరి ఊహకు అందని విధంగా 12 నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధిస్తే, బీఎస్పీ రెండు స్థానాలు, సీపీఎం ఒక్క స్థానాన్ని దక్కించుకున్నాయి.

స్వింగ్ ఎందుకు కింగ్?

స్వింగ్ స్థానాల్లో ఓటరు ఒక్కోసారి ఒక్కో రకంగా తీర్పు ఇస్తూ ఉండడంతో ఆ నియోజకవర్గాలపై దృష్టి పెట్టడం రాజకీయపార్టీలకు అనివార్యంగా మారింది. ఎన్నికల వ్యూహాలన్నీ ఆ స్థానాల ప్రాధాన్యాలకనుగుణంగానే రచిస్తున్నాయి. ఆ నియోజకవర్గాల్లో ఓటర్లను ఆకట్టుకునేలా వ్యూహాలు రచించడం అత్యంత కీలకంగా మారింది. ఈ స్థానాల్లో వచ్చే ఫలితాలే రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పుతుంటాయి. 2008, 2013, 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే భారతీయ జనతా పార్టీ 28 నియోజకవర్గాల్లో వరుసగా నెగ్గుతూ వస్తోంది. కాంగ్రెస్ పార్టీకి అయిదు స్థానాల్లో వరుసగా విజయం సాధిస్తూ వచ్చింది. 2008లో స్వింగ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా నిలిస్తే 2013 ఎన్నికల నాటికి బీజేపీ పూర్తిగా తన పట్టు బిగించింది. ఇంచుమించుగా క్లీన్ స్వీప్ చేసింది. గత ఎన్నికల నాటికి కాంగ్రెస్ మళ్లీ పుంజుకున్నప్పటికీ స్వతంత్ర అభ్యర్థులు అధికంగా విజయం సాధించడం చూస్తుంటే ఓటర్లు స్థానిక అంశాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీ ఈ సారి ఈ స్వింగ్ స్థానాల్లో పట్టు బిగించి కింగ్‌లా మారాలని తహతహలాడుతున్నాయి.

స్వింగ్ స్థానాల్లో విజయం సాధించిన పార్టీలు ఇలా..?

మొత్తం స్థానాలు	200
స్వింగ్ స్థానాలు	166

	2008	2018	2013
కాంగ్రెస్	91	95	16
బీజేపీ	50	45	135
ఇతరులు	25	26	15

- సాక్షి, నేషనల్ డెస్క్

అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు

సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో మిజోరంపై చర్చ

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల్ని ఖరారు చేయడానికి గురువారం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ గురువారం న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇంకా అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు. బీజేపీ ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో చాలా సీట్లలో అభ్యర్థుల్ని ప్రకటించింది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నాయకులు హాజరయ్యారు. సమావేశానంతరం ఖర్గే సోషల్ మీడియా వేదికగా ఒక పోస్టు పెట్టారు. మిజోరం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థులపై చర్చించామని వెల్లడించారు. ''మిజోరంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. మిజోరం ప్రజలు మాకు ఒక్క అవకాశం ఇస్తారన్న నమ్మకం కూడా ఉంది'' అని పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ మరోసారి సమావేశమై ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అభ్యర్థుల్ని ఎంపికను ఒక కొలిక్కి తీసుకురానుంది.

రాజస్తాన్ సీఎం రేసులో లేను

కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్



జైపూర్: రాజస్తాన్ ముఖ్యమంత్రి పదవి రేసులో ఉన్నట్లు వస్తున్న వార్తలను జోధ్‌పూర్ ఎంపీ, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కొట్టి పారేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి అభ్యర్థి అంటూ బీజేపీ ఇప్పటి వరకు ఎవరినీ ప్రకటించలేదని మంత్రి షెకావత్ గుర్తు చేశారు. అయితే, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. తమ పార్టీలో ఎలాంటి గ్రూపులూ లేవన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మాజీ సీఎం వసుంధరా రాజే, మంత్రి షెకావత్‌లలో ఒకరు సీఎం కావొచ్చని వార్తలు వస్తున్నాయి. సీఎం గెహ్లోత్ పోటీ చేస్తున్న జోధ్‌పూర్ జిల్లా సదర్‌పురా నుంచి బరిలోకి దిగుతానంటూ పార్టీ అధిష్టానాన్ని మంత్రి కోరినట్లు కూడా చెబుతున్నారు. ఈ వార్తలపై ఆయన పైవిధంగా స్పష్టతనిచ్చారు.

ఎలక్షన్ బీట్...

అదొక ఫ్యామిలీ పోలింగ్ బూత్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో అతి చిన్న పోలింగ్ కేంద్రం అది. ఆ పోలింగ్ బూత్‌లో ఓటర్ల సంఖ్య కేవలం 44. వారంతా రక్తసంబంధీకులు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండే ఆ గ్రామాన్ని కాపాడుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ని ఏర్పాటు చేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బాలాఘట్ జిల్లాలోని సోనెవాని గ్రామానికి 55 కి.మీ. ట్రెక్కింగ్ చేసి వెళ్లాలి. ఇప్పటివరకు ఎన్నికలు జరిగినప్పుడు సోనెవాని గ్రామంలో నివసిస్తున్న ఆ పెద్ద కుటుంబంలోని 44 మంది కొండలు, గుట్టలు, నదులు దాటుకొని 20 కి.మీ. దూరంలో నవేగావ్ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి ఓటు వేసేవారు. ఈ ఏడాది ఎన్నికల సంఘం ఆ గ్రామంలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్న ఒక పాఠశాలని పోలింగ్ కేంద్రంగా మార్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ స్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటు వేయడానికి ఇకపై ప్రయాస పడనక్కర్లేదని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు చెప్పారు.

కౌంటింగ్ తేదీని మార్చాలి

అయిజ్వాల్: మిజోరంలో ఓట్ల లెక్కింపుని డిసెంబర్ 3కి బదులుగా మరో రోజు నిర్వహించాలని క్రిస్టియన్లు అధికంగా ఉండే మిజోరం రాష్ట్రానికి చెందిన వివిధ రాజకీయ పక్షాలు కోరుతున్నాయి. డిసెంబర్ 3 ఆదివారం క్రిస్టియన్లకు పరమ పవిత్రమైన దినమని చర్చిలో ప్రార్థనలకు వెళ్లాలి కాబట్టి కౌంటింగ్ తేదీని మార్చాలని బీజేపీ, కాంగ్రెస్, అధికార ఎంఎన్ఎఫ్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశాయి. రాష్ట్రంలో ప్రధాన చర్చిలు కూటమితో పాటు జోరమ్ పీపుల్ మూవ్‌మెంట్, పీపుల్స్ కాన్ఫరెన్స్‌లు కూడా తేదీని మార్చాలని డిమాండ్ చేశాయి. ఆ రోజంతా చర్చిలో సేవలు చేయడంలో ప్రజలందరూ నిమగ్నమై ఉంటారని కౌంటింగ్ తేదీని మార్చాలని కోరుతున్నాయి. మిజోరంలో 87% మంది క్రిస్టియన్లే ఉన్నారు. మిజోరంతో పాటు తెలంగాణ, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడు కౌంటింగ్ తేదీని డిసెంబర్3గా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లోని రెండు గిరిజన గ్రామాలు ఎన్నికల బహిష్కరణ

రాయపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో రెండు గిరిజన గ్రామాలు ఈ సారి ఎన్నికల్ని బహిష్కరిస్తున్నట్టుగా ప్రకటించాయి. ఇప్పటికీ గ్రామాల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదని, విద్యుత్ సదుపాయం లేక అంధకారంలో మగ్గిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రామ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న సర్దియా, బగ్దారిదండ్ గ్రామాల్లో ప్రజలు తమకు కనీస సదుపాయాలు కూడా కల్పించకపోతే ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్ని బహిష్కరించాలంటూ పాంప్లెంట్లు పంచుతూ, బ్యానర్లు కట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తుండగా రామ్‌పూర్‌లో తొలివిడత నవంబర్ 7న పోలింగ్ జరగనుంది.



మాండ్లా ర్యాలీలో ప్రియాంకా గాంధీ

12వ తరగతి వరకు ఉచిత విద్య

మధ్యప్రదేశ్ ఎన్నికల ర్యాలీలో ప్రియాంక హామీ

మాండ్లా: మధ్యప్రదేశ్‌లో విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని, స్కూలు పిల్లలకు అలవెన్స్‌లు కూడా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు. ఆదివాసీ ప్రాంతంలో ఉన్న మాండ్లా జిల్లాలో గురువారం ఎన్నికల ర్యాలీలో ప్రియాంక పాల్గొన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే పఢో–పఢావో పథకం కింద 12వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకి నెలకి రూ.500, 9–10 తరగతి విద్యార్థులకి నెలకి వెయ్యి రూపాయలు, 11, 12 తరగతి విద్యార్థులకి నెలకి రూ.1500 ఇస్తామన్నారు. రాష్ట్రంలో కులగణన చేపడతామని ప్రియాంక గాంధీ పునరుద్ఘాటించారు. ఆదివాసీలు, ఇతర వెనుక బడిన వర్గాల వారికి జనాభాలో తమ నిష్పత్తి ఆధారంగా ఉద్యోగాలు రావడం లేదన్నారు. అందుకే కులగణన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ''బిహార్‌లో ఇటీవల రాష్ట్రంలో కులగణన నిర్వహిస్తే జనాభాలో 84% ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు ఉన్నారని తేలింది. కానీ ఉద్యోగాలు చేస్తున్న వారిలో వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా కులగణన జరగాల్సి ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు'' అని ప్రియాంక అన్నారు.

బీజేపీలోకి మిజోరం స్పీకర్!

అయిజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) కు షాక్ తగిలింది. పార్టీ ఎమ్మెల్యే, రాష్ట్ర స్పీకర్ లాల్‌రినియానా సైలో పార్టీకి గుడ్ బై కొట్టేశారు. పార్టీ ఆయనకు టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో సైలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బీజేపీలోకి వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కుతుందని చెప్పారు. మిజోరం అధికార పక్షమైన ఎంఎన్ఎఫ్‌కి ఇప్పటివరకు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్ బై కొట్టేశారు. స్పీకర్ కూడా రాజీనామా చేయడంతో పార్టీని వీడిన ఎమ్మెల్యేల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి బీజేపీ పెద్దలతో కొన్ని డిమాండ్లు చేశానని, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు వారు అంగీకరించారని సైలో వెల్లడించారు.

ఎన్నికల్లో ఫేస్‌బుక్, గూగుల్ తటస్థంగా వ్యవహరించాలి

న్యూఢిల్లీ: దేశంలో ప్రజల మధ్య మతపరమైన విద్వేషాలకు సోషల్ మీడియా వేదికలు కారణమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో ఫేస్‌బుక్, గూగుల్ వంటి సామాజిక మాధ్యమాలు తటస్థంగా వ్యవహరించాలని కోరింది. పక్షపాత ధోరణి సరైంది కాదని అభిప్రాయపడింది. ఈ మేరకు ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా' సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కి తాజాగా లేఖలు రాసింది. ఇండియాలో ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటివి అధికార బీజేపీకి, ప్రధాని మోదీ అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, పక్షపాతం ప్రదర్శిస్తున్నాయని వాషింగ్టన్ పోస్టు పత్రికలో కథనం వెలువడింది. ఈ నేపథ్యంలోనే 'ఇండియా' కూటమి జుకర్‌బర్గ్, సుందర్ పిచాయ్‌కి లేఖలు రాసింది. ఈ లేఖలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో షేర్ చేశారు.

సినిమా

కన్నప్పలో శివ రాజ్‌కుమార్



● శివ రాజ్‌కుమార్

శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న తాజా మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌లాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌లోకి కన్నడ యాక్టర్ శివ రాజ్‌కుమార్ పేరు చేరింది. ఓ కీలక పాత్రకు శివ రాజ్‌కుమార్‌ని తీసుకున్న విషయాన్ని గురువారం యూనిట్ తెలియజేసింది. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయి మాధవ్, తోట ప్రసాద్ వంటి వారు రచనా సహకారం చేశారు.

ఆన్ ది రోడ్



● సూర్య, రామదాసు, రామ్‌గోపాల్ వర్మ

రోడ్ ట్రిప్ ప్లాన్ చేసుకున్న ఓ జంటకు, వారి మార్గ మధ్యంలో ఎదురైన ఓ వ్యక్తి కారణంగా ఎలాంటి అవాంతరాలు ఎదురయ్యాయి? అనే ప్రధానాంశంతో రూపొందిన చిత్రం 'ఆన్ ది రోడ్'. రాఘవ్ తివారీ, స్వామి మెహ్రా జంటగా స్వీయ దర్శకత్వంలో సూర్య లక్కోజు నిర్మించిన చిత్రం ఇది. నిర్మాత ముత్యాల రామదాసు ఈ సినిమా విడుదలకు సహాయం చేస్తున్నారు. లడఖ్ ప్రాంతంలో తెరకెక్కించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శక–నిర్మాత రామ్‌గోపాల్ వర్మ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''పూర్తిగా లడఖ్ ప్రాంతంలో తెరకెక్కించిన మొదటి భారతీయ చిత్రం 'ఆన్ ది రోడ్'. తెలుగు, హిందీ, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

రెగ్యులర్ కథలు చేయను - శివ కంఠమనేని



శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా మల్లికార్జున్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఫిల్మ్ 'మధురపూడి గ్రామం అనే నేను'. ముప్పా వెంకయ్య చౌదరి సారథ్యంలో జి.రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివ కంఠమనేని మాట్లాడుతూ– ''ఒంగోలు బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ డ్రామా ఈ చిత్రం. మొరటుగా ఉండే సూరి పాత్రలో కనిపిస్తాను. తన మిత్రుడు బాబ్జీ ఎమ్మెల్యే కావడం కోసం సూరి ఏం చేస్తాడు? ఈ క్రమంలో అతని ప్రేమకథ ఏ విధంగా ప్రభావితమైంది? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. కమర్షియల్ పంథాలోనే ఈ సినిమా కథనం సాగుతుంది. ప్రేమ అనేది శరీరానికి కాదు.. మనసులకు సంబంధించినదనే సందేశం అంతర్లీనంగా ఉంటుంది. నేను రెగ్యులర్ కథలు చేయను. నేను చేసిన 'అక్కడొకడుంటాడు'లో నా పోస్టర్స్ చూసి 'మధురపూడి..' సినిమా కథకు నన్ను ఎంపిక చేసుకున్నారు మల్లికార్జున్‌గారు. దాదాపు 150కిపైగా థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. నా తర్వాతి చిత్రాలు 'మణిశంకర్, రాఘవరెడ్డి' త్వరలో రిలీజ్ కానున్నాయి. మంచు లక్ష్మిగారి 'ఆదిపర్వం' చిత్రంలో పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నాను'' అన్నారు.

ఫిదా అవుతారు




● కార్తీక్ రత్నం

''ఆనంద్ కొత్తవాడైనా అనుభవం ఉన్న డైరెక్టర్‌లా 'లింగొచ్చా' తీశారు. నిర్మాతలు కూడా ఈ సినిమాని అనుకున్న విధంగా తీసేలాగా సపోర్ట్ చేశారు. ఇప్పుడు రిలీజ్ చేసిన 'ఫిదా..' పాటలాగే సినిమాని చూసి ప్రేక్షకులు ఫిదా అవుతారు'' అని కార్తీక్ రత్నం అన్నారు. ఆనంద్ బడా దర్శకత్వంలో కార్తీక్ రత్నం, సుప్యర్థ సింగ్ జంటగా నటించిన చిత్రం 'లింగొచ్చా'. జె. నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. బికాజ్ రాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఫిదా...' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో కార్తీక్ రత్నం బాగా చేశాడు'' అన్నారు ఆనంద్ బడా. ''మా సినిమాకి మంచి విజయం చేకూరాలి'' అని యాదగిరి రాజు అన్నారు. హీరో సోహైల్ అతిథిగా పాల్గొన్నారు.

కథ రెడీ..



● 'ఇండియన్ 2'లో కమల్‌హాసన్



● 'ఆయిరత్తిల్ ఒరువన్ 2' పోస్టర్



● 'ఖైదీ'లో కార్తీ



● 'తుప్పరివాలన్'లో విశాల్

ఒక కథ హిట్టయితే... ఆ కథని కంటిన్యూ చేస్తే బాగుంటుందని ఆ కథలోని హీరో, ఆ కథని తెరకెక్కించిన దర్శకుడు, తీసిన నిర్మాత, చూసే ప్రేక్షకులు అనుకోవడం సహజం. కానీ ఆ కథను కొనసాగించడానికి స్కోప్ ఉంటేనే ఇంకో కథ రెడీ అవుతుంది. అలా కొనసాగింపుకి ఆస్కారం ఉన్న కొన్ని కథలు రెడీ అయ్యాయి. ఇలా తమిళంలో పదికి పైగా రానున్న చిత్రాల రెండో భాగం విశేషాలు తెలుసుకుందాం.

సేనాపతి తిరిగొస్తున్నాడు

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు' – 1996) బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. ఎప్పట్నుంచో ఈ సినిమాకు సీక్వెల్ తీయాలని ప్లాన్ చేస్తున్న శంకర్ 2017లో 'ఇండియన్ 2'ని ప్రకటించారు. షూటింగ్ సెట్‌లో జరిగిన ప్రమాదం, నిర్మాణపరంగా నెలకొన్న సమస్యలను అధిగమించుకుని, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. లైకా ప్రొడక్షన్‌తో కలిసి ఉదయనిధి స్టాలిన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 1920 నేపథ్యంలో సాగే 'ఇండియన్ 2' వచ్చే ఏడాది విడుదల కానుంది.

మూడు సీక్వెల్స్‌లో ధనుష్

పుష్కరకాలం క్రితం విడుదలైన 'ఆయిరత్తిల్ ఒరువన్ ('యుగానికి ఒక్కడు' – 2010) సంచలన విజయం సాధించింది. కార్తీ, రీమా సేన్, ఆండ్రియా, పార్తిబన్ లీడ్ రోల్స్ చేయగా, సెల్వ రాఘవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కాగా ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఆయిరత్తిల్ ఒరువన్ 2'ను ప్రకటించి, హీరోగా తన తమ్ముడు ధనుష్ నటిస్తారని, 2024లో ఈ సినిమాను విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నామని తెలిపారు సెల్వ రాఘవన్. ఇంకా ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం కాలేదు. అలాగే హీరో ధనుష్–దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన 'అసురన్', 'వడ చెన్నై' చిత్రాలకు వీరి కాంబినేషన్‌లోనే సీక్వెల్స్‌కి ప్లాన్ జరుగుతోందని సమాచారం.

రెండు సీక్వెల్స్‌లో కార్తీ

'ఖైదీ' (2019)గా కార్తీ సూపర్ హిట్టయ్యారు. లోకేశ్ కనగరాజ్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రానికి సీక్వెల్ తీయాలనుకుంటున్నారు. మరో వైపు పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించిన 'సర్దార్' కూడా హిట్ ఫిల్మ్. 'సర్దార్ 2' కూడా దాదాపు ఖరారైంది. కార్తీ ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తి కాగానే 'సర్దార్ 2' మొదలవుతుంది. ఈలోపు రజనీకాంత్ హీరోగా తెరకెక్కించనున్న చిత్రాన్ని పూర్తి చేసి, 'ఖైదీ 2' సీక్వెల్ కథ రెడీ చేస్తారట లోకేశ్. అలాగే భవిష్యత్‌లో 'జైలర్ 2', కమల్‌హాసన్‌తో 'విక్రమ్ 2', 'బీస్ట్ 2' చిత్రాలను తెరకెక్కించే ఆలోచన కూడా లోకేశ్ కనగరాజ్‌కి ఉందట.



● 'సార్పట్ట'లో ఆర్య

మళ్లీ డిటెక్టివ్.

విశాల్ కెరీర్‌లో ఉన్న ఓ డిఫరెంట్ హిట్ ఫిల్మ్ 'తుప్పరివాలన్' ('డిటెక్టివ్' – 2017). మిస్కిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో హిట్ సాధించింది. ఆ తర్వాత విశాల్, మిస్కిన్‌ల కాంబినేషన్‌లోనే 'డిటెక్టివ్'కు సీక్వెల్‌గా 'డిటెక్టివ్ 2'ను ప్రకటించారు. నిజానికి 'డిటెక్టివ్ 2' ఈపాటికే విడుదల కావాల్సింది. కానీ ఈ సీక్వెల్ స్క్రిప్ట్, బడ్జెట్ విషయాల్లో విశాల్‌కు, మిస్కిన్‌కు భేదాభిప్రాయాలు తలెత్తడంతో 'డిటెక్టివ్ 2' షూటింగ్ నిలిచిపోయింది. 'డిటెక్టివ్ 2'కు తానే దర్శకత్వం వహించి, నటిస్తానని పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు విశాల్. ఈ సినిమా షూటింగ్ ప్రధానంగా విదేశాల్లో జరగనుంది.



● 'తని ఒరువన్'లో నయనతార, 'జయం' రవి



● 'మాయవన్'లో సందీప్ కిషన్

ఎనిమిదేళ్ల తర్వాత...


'జయం' రవి కెరీర్‌లో 'తని ఒరువన్' (ఈ సినిమా తెలుగు రీమేక్ 'ధ్రువ'లో రామ్‌చరణ్ హీరోగా నటించారు) బ్లాక్‌బస్టర్. 'జయం' రవి అన్నయ్య, దర్శకుడు మోహన్ రాజా ఈ సినిమాను తెరకెక్కించారు. 2015లో విడుదలైన ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించాలని ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నారు మోహన్ రాజా. ఫైనల్‌గా 'తని ఒరువన్' విడుదలై, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 28న సీక్వెల్‌ను ప్రకటించారు. తొలి భాగంలో నటించిన 'జయం'రవి, నయనతారలే మలి భాగంలోనూ నటిస్తారు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది.

మరో మాయవన్

ఐదేళ్ల క్రితం సందీప్ కిషన్ హీరోగా సీవీ కుమార్ దర్శకత్వంలో 'మాయవన్' అనే సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాకు మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు 'మాయవన్'కు సీక్వెల్‌గా 'మాయవన్ 2' తీస్తున్నారు మేకర్స్. సందీప్ కిషన్, సీవీ కుమార్ కాంబినేషన్‌లోనే ఈ చిత్రం రూపొందుతోంది.



● 'డబుల్ ఎక్స్'లో లారెన్స్



● చేతన్ శ్రీను



● '7/జి...'లో రవికృష్ణ

పరంపర కొనసాగుతోంది

టెడ్డీ, సార్పట్ట పరంపర.. ఆర్య కెరీర్‌లో ఈ రెండూ సూపర్ హిట్ సినిమాలే. అయితే ఈ రెండు చిత్రాలూ డైరెక్ట్‌గా ఓటీటీలోనే విడుదల అయ్యాయి. అయితే ఈ రెండు సినిమాల సీక్వెల్స్‌ను మాత్రం వెండితెరపైనే చూపించనున్నారు. 'సార్పట్ట పరంపర'కు దర్శకత్వం వహించిన పా. రంజిత్‌తోనే ఇటీవల 'సార్పట్ట పరంపర 2'ను ప్రకటించారు ఆర్య. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది. ఇక దర్శకుడు శక్తి సౌందర్ రాజన్‌తోనే 'టెడ్డీ' సినిమా సీక్వెల్‌ను ఆర్య ప్లాన్ చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం.

బృందావన కాలనీ ప్రేమ

దాదాపు 20 ఏళ్ల క్రితం వచ్చిన '7/జి బృందావన కాలనీ' (2004) యూత్‌ని బాగా ఆకట్టుకున్న విషాద ప్రేమకథ. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన ఈ చిత్రం సూపర్ హిట్. కాగా, '7/జి బృందావన కాలనీ'కి సీక్వెల్ ప్లాన్ చేశారు సెల్వ రాఘవన్. తొలి భాగంలో హీరోగా నటించిన రవికృష్ణ మలి భాగంలోనూ నటిస్తారు. కథానాయిక పాత్ర కోసం ఇవానా, దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ పేర్లను పరిశీలిస్తున్నారట. తొలి భాగాన్ని నిర్మించిన ఏఎమ్ రత్నం సీక్వెల్‌ని కూడా నిర్మించనున్నారు.

జిగర్తాండ 2

కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 2014లో విడుదలైన సినిమాల్లో హిట్‌గా నిలిచినవాటిలో 'జిగర్తాండ' ఒకటి. సిద్ధార్థ్, బాబీ సింహా, లక్ష్మీ మీనన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జిగర్తాండ డబుల్ ఎక్స్' తెరకెక్కింది. రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా దీపావళి సందర్భంగా విడుదల కానుంది.

జెంటిల్‌మేన్ మారారు

దర్శకుడు శంకర్ తెరకెక్కించిన తొలి చిత్రం 'జెంటిల్‌మేన్' (1993). యాక్షన్ కింగ్ అర్జున్ హీరోగా నటించారు. ఈ చిత్ర నిర్మాత కేటీ కుంజుమోన్ ఇటీవల 'జెంటిల్ మేన్ 2'ని ప్రారంభించారు. అయితే ఈ సీక్వెల్‌కి దర్శకుడు, హీరో మారారు. ఏ. గోకుల్ కృష్ణ దర్శకత్వంలో చేతన్ శ్రీను హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీత దర్శకుడు.

అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో అరుళ్ నిధి హీరోగా రూపొందిన 'డిమాంటీ కాలనీ'కి సీక్వెల్ వీరి కాంబినేషన్‌లోనే రానుంది. ఇంకా సీక్వెల్ లిస్ట్‌లో మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.

సాక్షి బిజినెస్

శుక్రవారం
13-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
65	17
66,408	19,794

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,543	▽	116
డోజోన్స్	33,512	▽	293
ఎఫ్‌టీఎస్ఈ 100	7,643	△	25
డాక్స్	15,425	▽	35
షాంఘై	3,108	△	29
నికాయ్	32,495	△	558

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
58,144	△	284
బంగారం (22 క్యారెట్)		
57,911	△	283
వెండి (కిలో)		
69,699	△	205

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌బిఐ	82.42	84.09
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌బిఐ	100.87	104.21
€	యూరో	ఎన్‌బిఐ	86.90	90.00
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌బిఐ	54.95	56.66
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌బిఐ	52.33	54.63
S$	సింగపూర్ డాలర్	ఎన్‌బిఐ	60.15	62.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.36

'ఫోర్బ్స్' కుబేరుల్లోనూ అంబానీకే పట్టం

- 92 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానం
- 68 బిలియన్ డాలర్లతో రెండో ర్యాంకులో అదానీ



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ దేశీ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. 2023 సంవత్సరానికి గాను భారత్‌లోని 100 మంది సంపన్నులతో ఫోర్బ్స్ రూపొందించిన జాబితాలో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆయన సంపద 92 బిలియన్ డాలర్లుగా ఉంది. మరోవైపు గతేడాది అంబానీని కూడా దాటేసిన అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ ఈసారి 68 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిల్చారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల దెబ్బతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లు కుదేలవడంతో ఆయన సంపద 82 బిలియన్ డాలర్ల మేర కరిగిపోవడం ఇందుకు కారణం. ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ నాడార్ 29.3 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను విడగొట్టి, లిస్టింగ్ చేయడంతో పాటు తన ముగ్గురు సంతానానికి రిలయన్స్ బోర్డులో చోటు కల్పించడం ద్వారా ముకేశ్ అంబానీ వారసత్వ ప్రణాళికను పటిష్టంగా అమలు చేసినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లకు భారత్ ఒక హాట్‌స్పాట్‌గా ఉంటోందని తెలిపింది. కుబేరుల సంపద మరింతగా పెరగడంతో, టాప్ 100 లిస్టులోకి చేరాలంటే కటాఫ్ మార్కు 2.3 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆసియా వెల్త్ ఎడిటర్ నాజ్‌నీన్ కర్మాలీ వివరించారు. భారత్‌లోని 100 మంది కుబేరుల మొత్తం సంపద ఈ ఏడాది 799 బిలియన్ డాలర్లుగా ఉంది.

వ్యక్తి	ర్యాంకు	సంపద (బి.డాలర్లలో)
ముకేశ్ అంబానీ	1	92
గౌతమ్ అదానీ	2	68
శివ నాడార్	3	29.3
సావిత్రి జిందాల్	4	24
రాధాకిషన్ దమానీ	5	23
సైరస్ పూనావాలా	6	20.7
హిందుజా కుటుంబం	7	20
దిలీప్ సంఘ్వి	8	19
కుమార బిర్లా	9	17.5
షాపూర్ మిస్త్రీ, కుటుంబం	10	16.9

తెలుగువారిలో

వ్యక్తి	ర్యాంకు	సంపద (బి.డాలర్లలో)
మురళి దివి	33	6.3
పి.పి. రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి	54	4.05
'డాక్టర్ రెడ్డీస్' కుటుంబం	75	3
ప్రతాప్ రెడ్డి	94	2.48
పీవీ రామ్‌ప్రసాద్‌రెడ్డి	98	2.35

ధరలు అదుపు.. పరిశ్రమల పరుగు!

- ఎకానమీకి సానుకూల గణాంకాలు
- సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5%
- మూడు నెలల కనిష్ట స్థాయి
- ఆగస్టులో పారిశ్రామిక వృద్ధి 10.3%
- 14 నెలల గరిష్టానికి హైజంప్



న్యూఢిల్లీ: భారత్ తాజా ఆర్థిక గణాంకాలు పూర్తి ఊరటనిచ్చాయి. అధికారికంగా విడుదలైన సమాచారం ప్రకారం, ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ పాలసీ సమీక్షా నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 5.02 శాతంగా నమోదయ్యింది. గడచిన మూడు నెల్లో ఇంత తక్కువ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదుకావడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం మైనస్ 2 లేదా ప్లస్ 2తో 6 శాతం వద్ద ఉండాలి. అయితే తమ లక్ష్యం 4 శాతమేనని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఇటీవలి తన పాలసీ సమీక్ష సందర్భంగా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇక పారిశ్రామిక రంగ వృద్ధికి సంబంధించిన సూచీ (ఐఐపీ) ఆగస్టులో 10.3 శాతం వృద్ధిని చూసింది. గడచిన 14 నెల్లో ఈ స్థాయి వృద్ధి రేటు ఎన్నడూ నమోదుకాలేదు. 2023–24లో సగటును 5.4 శాతం ద్రవ్యోల్బణం ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనా.

రిటైల్ ధరల తీరు చూస్తే...

■ ఒక్క ఆహార ధరల విషయానికి వస్తే, రెండంకెల్లో (గత ఏడాది సెప్టెంబర్‌తో పోల్చి) ధరలు పెరిగిన వస్తువుల్లో తృణధాన్యాలు (10.95 శాతం), పప్పులు (16.38 శాతం), సుగంధ ద్రవ్యాలు (23.06 శాతం) ఉన్నాయి. మాంసం, చేపలు (4.11 శాతం), గుడ్లు (6.42 శాతం), పాలు, పాల ఉత్పత్తులు (6.89 శాతం), పండ్లు (7.30 శాతం), కూరగాయలు (3.39 శాతం), చక్కెర, సంబంధిత ఉత్పత్తులు (4.52 శాతం), నాన్–ఆల్కాహాలిక్ బేవరేజెస్ (3.54 శాతం), ప్రిపేర్డ్ మీల్స్, స్నాక్స్, స్వీట్స్ (4.96 శాతం), ఫుడ్ అండ్ బేవరేజెస్ (6.30 శాతం) ఉత్పత్తుల్లో పెరుగుదల రేటు ఒకంకెకు పరిమితమైంది. కాగా, ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ధరలు పెరక్కపోగా 14.04% తగ్గడం గమనార్హం.

రంగాల వారీగా పారిశ్రామిక ఉత్పత్తి పురోగతి

ఆగస్టు నెలల్లో తయారీ రంగం 9.3 శాతం పురోగతి (2022 ఆగస్టు నెలతో పోల్చి) సాధించింది. విద్యుత్ రంగం 15.3 శాతం, మైనింగ్ 12.3%, భారీ పెట్టుబడులకు, యంత్ర సామాగ్రి కొనుగోళ్లకు ప్రతిబింబంగా ఉండే క్యాపిటల్ గూడ్స్ విభాగంలో 12.6 శాతం వృద్ధి నమోదయ్యింది. అయితే రిఫ్రిజరేటర్లు, ఎయిర్‌కండీషర్లకు సంబంధించి కన్జూమర్ డ్యూరబుల్స్ విభాగంలో మాత్రం వృద్ధి లేకపోగా 5.7 శాతం క్షీణత నెలకొంది. ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులకు సంబంధించిన కన్జూమర్ నాన్–డ్యూరబుల్స్ రంగంలో మాత్రం వృద్ధి రేటు 9 శాతంగా ఉంది.

ఐటీ షేర్లు పడేశాయ్

సూచీల రెండు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: స్టాక్ సూచీల రెండో రోజు ర్యాలీకి ఐటీ షేర్లు అడ్డుకట్ట వేశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ సంస్థల క్యూ2 ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగా నమోదవడంతో ఈ రంగ షేర్లలో తలెత్తిన అమ్మకాలు సూచీలను లాభాల్లోంచి నష్టాల్లోకి నడిపించాయి.



దేశీయ, అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఉదయం లాభాల్లో మొదలైన స్టాక్ సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో స్తబ్దుగా కదలాడాయి. ఇంట్రాడేలో 239 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 65 పాయింట్లు స్వల్ప నష్టంతో 66,408 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17 పాయింట్లు నష్టపోయి 19,800 స్థాయి దిగువన 19,794 వద్ద నిలిచింది. క్యూ2లో టీసీఎస్ ఆదాయం 8% వృద్ధిని కనబరిచినా.. నిరాశజనక అవుట్‌లుక్ వ్యాఖ్యలతో షేరు 2% నష్టపోయి రూ.3542 వద్ద స్థిరపడింది. ఫలితాల విడుదలకు ముందు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 2% పతనమయ్యాయి. టెక్‌మహీంద్రా 3%, ఎల్‌టీఐఎం 2%, కోఫోర్జ్ 1%, విప్రో 1% చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సూచీ 1.50% నష్టపోయింది.

ఇన్ఫోసిస్..ఫ్ఫ్!



- క్యూ2లో నికర లాభం రూ.6,215 కోట్లు, 3.1 శాతం వృద్ధి
- మొత్తం ఆదాయం 6.7 శాతం అప్; రూ.38,994 కోట్లు.
- ఆదాయ వృద్ధి అంచనాలకు కోత;
- రూ. 18 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. ఆదాయ అంచనాలకు భారీగా కోత విధించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో క్లయింట్లు తమ వ్యయాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుండటం దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (2023–24, క్యూ2)లో రూ. 6,215 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ. 6,026 కోట్ల లాభంతో పోలిస్తే 3.1 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం 6.7 శాతం వృద్ధితో రూ.36,538 కోట్ల నుంచి రూ. 38,994 కోట్లకు ఎగిసింది.

ఆదాయ గైడెన్స్ 1 శాతం కట్...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తి ఏడాది ఆదాయ వృద్ధి అంచనాలను ఇన్ఫీ 1 శాతం తగ్గించింది. ఆదాయం 1–3.5 శాతం మేర వృద్ధి చెందొచ్చని గతంలో అంచనా వేయగా, దీన్ని ఇప్పుడు 1–2.5 శాతానికి పరిమితం చేయడం గమనార్హం. బలహీన ఆర్థిక వాతావరణం నేపథ్యంలో దేశీ ఐటీ కంపెనీలకు రానున్న రోజుల్లో డిమాండ్ మరింత తగ్గొచ్చనేందుకు ఇన్ఫీ తాజా గైడెన్స్ కోత నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశీ ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా క్యూ2 ఫలితాల సందర్భంగా రాబోయే రోజుల్లో ఐటీ రంగం డిమాండ్‌పై ఆర్థిక అనిశ్చితి ప్రభావం ఉంటుందని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఉద్యోగులు తగ్గారు..

ఇన్ఫీలో ఉద్యోగుల సంఖ్యకు కూడా కోత పడింది. క్యూ2లో నికరంగా 7,530 మంది కంపెనీని వీడటంతో సెప్టెంబర్ చివరి నాటికి మొత్తం సిబ్బంది సంఖ్య 3,28,764కు చేరింది. గతేడాది తాము 50,000 మంది ఫ్రెషర్లను నియమించుకున్నామని, వారిని ఇంకా పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం లేదని ఇన్ఫీ సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్ చెప్పారు. ప్రస్తుతం ఫ్రెషర్లకు జెన్ ఏఐ వంటి టెక్నాలజీల్లో శిక్షణనిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి క్యాంపస్ నియాకాల గురించి ఆలోచించడం లేదని, భవిష్యత్తు అంచనాకు అనుగుణంగా ప్రతి క్వార్టర్లోనూ పరిస్థితులను బేరీజు వేసి నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఇప్పటికే ఆఫర్లు ఇచ్చినవారందరినీ తీసుకుంటామని, ప్రాజెక్టులు సాకారం అయ్యేకొద్దీ వారిని విధుల్లోకి తీసుకుంటామని కంపెనీ పేర్కొంది. నవంబర్ 1 నుండి సిబ్బంది వేతనాల పెంపు ఉంటుందని తెలిపింది.

> భారీ స్థాయి ప్రాజెక్టులు, విచక్షణతో కూడిన ప్రాజెక్టులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కొత్త కాంట్రాక్టుల విషయంలో సంస్థలు ఆచితూచి నిర్ణయం తీసుకోనున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా పూర్తి ఏడాది ఆదాయ గైడెన్స్ తగ్గించాల్సి వచ్చింది. అన్ని రంగాలు, భౌగోళిక ప్రాంతాల వ్యాప్తంగా 7.7 బిలియన్ డాలర్ల విలువైన భారీ స్థాయి మెగా డీల్స్‌ను సాధించాం. ఆర్థికంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ ఇది మా పనితీరుకు, క్లయింట్లు మాపై చూపుతున్న నమ్మకానికి నిదర్శనం.
>
> – సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈఓ

ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ2లో కంపెనీ 7.7 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది. కంపెనీ చరిత్రలోనే ఇవి అతిపెద్ద మెగా డీల్స్ కావడం సానుకూలాంశం.
- కంపెనీ నిర్వహణ మార్జిన్లు క్యూ2లో 0.4 శాతం వృద్ధి చెంది 21.2 శాతంగా నమోదయ్యాయి.
- రూ. 5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 18 చొప్పన మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి అక్టోబర్ 25 రికార్డు తేదీగా, నవంబర్ 6 చెల్లింపు తేదీగా పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ.1,464 వద్ద ముగిసింది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 3,833 కోట్లు • షేరుకి రూ. 12 డివిడెండ్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 10 శాతం పుంజుకుని రూ. 3,833 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 3,487 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతం వృద్ధితో రూ. 26,672 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 24,686 కోట్ల టర్నోవర్ నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. కొత్త కాంట్రాక్టులు 67 శాతం జంప్‌చేసి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 4 బిలియన్ డాలర్లను తాకినట్లు వెల్లడించారు.

ఇతర విశేషాలు...

- ఈ ఏడాది తొలి ఆరు నెలల పనితీరు నేపథ్యంలో పూర్తి ఏడాదికి ఆదాయ అంచనాలను 5–6 శాతానికి తగ్గించింది. తొలుత 6–8 శాతం వృద్ధి అంచనాలను ప్రకటించిన సంగతి తెలిసిందే.
- సెప్టెంబర్ చివరికి సిబ్బంది సంఖ్య 1% తగ్గి 2,21,139కు చేరింది.
- ఈ ఏడాది 10,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలివ్వనున్నట్లు కంపెనీ సీపీవో రామచంద్రన్ సుందరరాజన్ వెల్లడించారు. గతేడాది 27,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించినట్లు ప్రస్తావించారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 2 శాతం నష్టంతో రూ. 1,223 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



రష్యా ఒలింపిక్ కమిటీపై నిషేధం

ఒలింపిక్ నియమావళిని ఉల్లంఘించినందుకు రష్యా ఒలింపిక్ కమిటీపై అంతర్జాతీయ ఒలింపిక్ కౌన్సిల్ (ఐఓసీ) నిషేధం విధించింది. ముంబైలో గురువారం జరిగిన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రష్యాపై నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని... తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుంది. అయితే ఈ నిర్ణయంవల్ల రష్యా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని ఐఓసీ తెలిపింది. అంతర్జాతీయ ఈవెంట్స్‌లో, వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రష్యా క్రీడాకారులు స్వతంత్ర క్రీడాకారులుగా పోటీపడవచ్చని ఐఓసీ వివరణ ఇచ్చింది.

మలేసియాతో భారత్ పోరు నేడు

మెర్డెకా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. కేవలం మూడు జట్లు నాకౌట్ పద్ధతిలో పాల్గొంటున్న ఈ టోర్నీలో నేడు కౌలాలంపూర్‌లో మలేసియా జట్టుతో భారత్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు 17న జరిగే ఫైనల్లో తజికిస్తాన్‌తో తలపడుతుంది.

సఫారీ దెబ్బకు 'కంగారు'



కమిన్స్



రబడ

ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు వరుసగా రెండో పరాజయం

- దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ 'షో'
- 134 పరుగుల తేడాతో మాజీ చాంపియన్‌పై ఘనవిజయం
- 'శత'క్కొట్టిన డికాక్
- పడగొట్టిన రబడ, జాన్సెన్, కేశవ్



డికాక్ సెంచరీ అభివాదం

లక్నో: మళ్లీ కంగారే! వన్డే వరల్డ్‌కప్‌లో 'ఫైవ్ స్టార్' చాంపియన్ ఆస్ట్రేలియా ఈ కప్‌లో ఓ కూనలా విలవిలలాడుతోంది. పసలేని బౌలింగ్, బాధ్యతలేని బ్యాటింగ్‌తో ఆస్ట్రేలియాకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. బవూమా సారథ్యంలోని దక్షిణాఫ్రికా జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 134 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను బోల్తా కొట్టించి ఈ మెగా టోర్నీలో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 311 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (106 బంతుల్లో 109; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) వరుసగా రెండో సెంచరీతో కదం తొక్కాడు. మార్క్‌రమ్ (44 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, మ్యాక్స్‌వెల్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. లబుషేన్ (74 బంతుల్లో 46; 4 ఫోర్లు) టాప్‌స్కోరర్ కాగా, స్టార్క్ (27; 3 ఫోర్లు), కెప్టెన్ కమిన్స్ (22; 4 ఫోర్లు) 20 పరుగులు మించారంతే! రబడ (3/33) ఆసీస్‌ను చావుదెబ్బ తీయగా, జాన్సెన్, కేశవ్, షమ్సీ తలా 2 వికెట్లు పడగొట్టారు.

ఓపెనర్ జోరు...

దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ టాపార్డర్‌తో కలిసి పటిష్టమైన భాగస్వామ్యాలు నమోదు చేశాడు. జట్టు భారీ స్కోరుకు బాటవేశాడు. బవుమా (55 బంతుల్లో 35; 2 ఫోర్లు)తో తొలి వికెట్‌కు 108 పరుగులు, డసెన్ (30 బంతుల్లో 26; 2 ఫోర్లు)తో రెండో వికెట్‌కు 50 పరుగులు జోడించాడు. 90 బంతుల్లో సెంచరీ పూర్తయ్యాక డికాక్ జట్టు స్కోరు 197 పరుగుల వద్ద నిష్క్రమించాడు. అనంతరం మార్క్‌రమ్ అర్ధసెంచరీ సాధించడం, క్లాసెన్ (27 బంతుల్లో 29; 3 ఫోర్లు), జాన్సెన్ (22 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇలా క్రీజులో వచ్చిన వారంత స్కోరు పెరిగేందుకు దోహదం చేయడంతో సఫారీ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 300 పైచిలుకు స్కోరు చేసింది. లంకపై తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఏకంగా 428 పరుగులు చేసిన సంగతి తెలిసిందే!

కంగారూ... కంగారూ...

జోరు మీదున్న ప్రత్యర్థి, కొండంత లక్ష్యం ముందరుంటే ... మిచెల్ మార్ష్ (7), వార్నర్ (13), స్మిత్ (19)...ఆస్ట్రేలియా టాపార్డర్ స్కోరిది! ఇదికాస్తా 10 ఓవర్లలోపే కంగారూ, బేజారు కలగలిసి ఆసీస్ పరాజయానికి బీజం పడేలా చేసింది. రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో అప్పటికే అనుభవజ్ఞుడైన స్మిత్‌ను అవుట్ చేసి తర్వాత జోష్ ఇంగ్లిస్ (5), స్టొయినిస్ (5)లను పట్టుమని పది పరుగులైనా చేయనివ్వలేదు. దీంతో ఆస్ట్రేలియా 70 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. లబుషేన్ నిలబడటంతో ఆస్ట్రేలియా ఆమాత్రం స్కోరు చేసింది. అంతేగానీ గెలిచేందుకు ఏ దశలో ఆడలేదు. భారత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ ఓడిన ఆస్ట్రేలియా తమ తదుపరి మ్యాచ్‌లో సోమవారం శ్రీలంకతో ఆడుతుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) మ్యాక్స్‌వెల్ 109; బవుమా (సి) వార్నర్ (బి) మ్యాక్స్‌వెల్ 35; డసెన్ (సి) సబ్–అబాట్ (బి) జంపా 26; మార్క్‌రమ్ (సి) హాజల్‌వుడ్ (బి) కమిన్స్ 56; క్లాసెన్ (సి) ఇంగ్లిస్ (బి) హాజల్‌వుడ్ 29; మిల్లర్ (బి) స్టార్క్ 17; జాన్సెన్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 26; రబడ (నాటౌట్) 0; కేశవ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 311. వికెట్ల పతనం:** 1–108, 2–158, 3–197, 4–263, 5–267, 6–310, 7–311. **బౌలింగ్:** స్టార్క్ 9–1–53–2, హాజల్‌వుడ్ 9–0–60–1, మ్యాక్స్‌వెల్ 10–1–34–2, కమిన్స్ 9–0–71–1, జంపా 10–0–70–1, మార్ష్ 1–0–6–0, స్టొయినిస్ 2–0–11–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి) బవుమా (బి) జాన్సెన్ 7; వార్నర్ (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 13; స్మిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రబడ 19; లబుషేన్ (సి) బవుమా (బి) కేశవ్ 46; ఇంగ్లిస్ (బి) రబడ 5; మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) కేశవ్ 3; స్టొయినిస్ (సి) డికాక్ (బి) రబడ 5; స్టార్క్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 27; కమిన్స్ (సి) మిల్లర్ (బి) షమ్సీ 22; జంపా (నాటౌట్) 11; హాజల్‌వుడ్ (సి) రబడ (బి) షమ్సీ 2; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (40.5 ఓవర్లలో ఆలౌట్) 177. వికెట్ల పతనం:** 1–27, 2–27, 3–50, 4–56, 5–65, 6–70, 7–139, 8–143, 9–175, 10–177. **బౌలింగ్:** ఇన్‌గిడి 8–2–18–1, జాన్సెన్ 7–0–54–2, రబడ 8–1–33–3, కేశవ్ 10–0–30–2, షమ్సీ 7.5–0–38–2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
న్యూజిలాండ్	2	2	0	4	1.958
భారత్	2	2	0	4	1.500
పాకిస్తాన్	2	2	0	4	0.927
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	2	1	1	2	-0.653
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X బంగ్లాదేశ్
వేదిక: చెన్నై


మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

క్వార్టర్ ఫైనల్లో సింధు



వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు మరో అలవోక విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 21–11, 21–10తో ప్రపంచ 22వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ)పై గెలుపొందింది. ఈ ఏడాది వెన్ చి సుపై సింధుకిది వరుసగా మూడో విజయం కావడం విశేషం. ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో వెన్ చి సుపై సింధు వరుస గేముల్లో నెగ్గింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 26వ ర్యాంకర్ థయ్ లిన్ ఎన్గుయెన్ (వియత్నాం)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 1–0తో ఆధిక్యంలో ఉంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఓడిపోయారు. శ్రీకాంత్ 15–21, 12–21తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో... కిరణ్ జార్జి (భారత్) 10–21, 20–22తో లు గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు.

'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' నామినీల్లో నీరజ్ చోప్రా



మోంటెకార్లో (మొనాకో): ఈ ఏడాది 'ప్రపంచ పురుషుల ఉత్తమ అథ్లెట్' పురస్కారం రేసులో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా నిలిచాడు. 2023 సంవత్సరానికిగాను 'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య 11 అథ్లెట్లను నామినీలుగా ప్రకటించింది. నీరజ్ చోప్రా ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలువడంతోపాటు ఆసియా క్రీడల్లో తన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. మూడు పద్ధతుల్లో ఓటింగ్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఈ-మెయిల్ ద్వారా వరల్డ్ అథ్లెటిక్స్ కౌన్సిల్, వరల్డ్ అథ్లెటిక్స్ ఫ్యామిలీ సభ్యులు... ఆన్‌లైన్ విధానంలో అభిమానులు ఓటింగ్‌లో పాల్గొనవచ్చు. అక్టోబర్ 28వ తేదీతో ఓటింగ్ ప్రక్రియ ముగుస్తుంది. నవంబర్ 13, 14 తేదీల్లో టాప్–5 ఫైనలిస్టులను... డిసెంబర్ 11న తుది విజేతలను ప్రకటిస్తారు.

క్వార్టర్స్‌లో రష్మిక

బ్యాంకాక్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్మిక 6–2, 7–5తో యానన్ హు (చైనా)పై నెగ్గింది. తొలి రౌండ్‌లో రష్మిక 6–3, 6–0తో సౌమ్య (భారత్)పై గెలిచింది.

సెమీస్‌లో బోపన్న జోడీ



న్యూఢిల్లీ: షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్–1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చైనాలో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–4, 6–2తో అరెవాలో (ఎల్‌సాల్వడార్)–జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటపై గెలిచింది. 61 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ పది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

హైదరాబాద్ టి20 జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ జాతీయ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పాల్గొనే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. భారత యువ క్రికెటర్ తిలక్ వర్మకు తొలిసారి హైదరాబాద్ జట్టు పగ్గాలు అప్పగించారు. ఈ టోర్నీ అక్టోబర్ 16 నుంచి దేశంలోని వివిధ నగరాల్లో జరుగుతుంది.

హైదరాబాద్ టి20 జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), సీవీ మిలింద్ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, రాహుల్ సింగ్, రాహుల్ బుద్ధి, రాహుల్ రాధేశ్, రోహిత్ రాయుడు, చందన్ సహని, భవేశ్ సేథ్, రవితేజ, రక్షణ్ రెడ్డి, సంకేత్, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, శొనక్ కులకర్ణి, అమన్ రావు.

క్లుప్తంగా...

భోగాపురం ఎయిర్‌పోర్టుకు నిధుల సేకరణ

- రుణ రూపంలో రూ.4,000 కోట్లు సేకరిస్తున్న జీఎంఆర్

సాక్షి, అమరావతి: భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంలో మరో అడుగు ముందుకు పడింది. ఎయిర్‌పోర్టు నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకున్న జీఎంఆర్ గ్రూప్ రూ.4,000 కోట్లను రుణాల ద్వారా సేకరిస్తోంది. ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్(ఐఐఎఫ్‌సీఎల్) నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీతో పాటు పలు పబ్లిక్ రంగ బ్యాంకులు కన్సార్టియంగా ఏర్పడి రుణం ఇవ్వనున్నాయి. నిధుల సేకరణకు నాయకత్వం వహిస్తున్నామని.. ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే భోగాపురం ప్రాజెక్టులో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఐఐఎఫ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ఆర్.జయశంకర్ చెప్పారు. ఇప్పటికే కాంపౌండ్ వాల్, భూమి చదను తదితర పనులు జరుగుతున్నాయని.. కీలక నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయని జీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు.

రైతుభరోసా 15 వరకు నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా అర్హత సాధించిన రైతులకు వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పథకంలో నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరి హరికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు మేలు చేసేందుకు నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం నాలుగేళ్లుగా ఏడాదికి రూ.13,500 ఆర్థికసాయం అందజేస్తోందని గుర్తుచేశారు. ఐదో ఏడాది 2023–24 తొలివిడతలో 52.57 లక్షలమంది రైతులకు రూ.3,942.95 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. అర్హత ఉండి మొదటి విడతలో లబ్ధి పొందని భూ యజమానులు, అటవీభూమి సాగుదారులు, కౌలురైతులు సంబంధిత భూపత్రాలు, పంట సాగుదారు హక్కుపత్రాలు, ఆధార్ కార్డుతో రైతుభరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

'అపుస్మ'కు జ్యూరీ అవార్డు

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి




సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక ఎడ్యుకేషనల్ వరల్డ్ గ్రాండ్ జ్యూరీ అవార్డు–2023కు ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మ) ఎంపికైందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ ప్రైమరీ, సెంకడరీ విద్యను అందించడంతోపాటు 25 ఏళ్లుగా అపుస్మ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. కరోనా సహాయనిధికి రూ.50లక్షలను సీఎం వైఎస్ జగన్‌కు అందించామని అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతోపాటు రక్తదాన శిబిరాలు నిర్వహించామని, ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 2,500 మందికిపైగా ప్రయివేట్ టీచర్లకు బెస్ట్ టీచర్ అవార్డులు ప్రదానం చేసి సన్మానించామని వివరించారు. ఈ నెల 14వ తేదీన ఢిల్లీలో అపుస్మ ప్రతినిధులు అవార్డును స్వీకరించనున్నారని రామచంద్రారెడ్డి చెప్పారు.

ఇంటికి చేరువలోనే విద్యుత్ సేవలు

14 రకాల పనులు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పూర్తి

- వినియోగదారులు మీ–సేవా కేంద్రాలకు వెళ్లనవసరం లేదు
- ప్రజలకు అందుబాటులో 7,883 మంది ఎనర్జీ అసిస్టెంట్లు
- ప్రతి ఎనర్జీ అసిస్టెంట్ 1,500 విద్యుత్ కనెక్షన్లకు బాధ్యుడు
- ఇకపై మరింత త్వరగా విద్యుత్ సమస్యలు పరిష్కారం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువలోకి విద్యుత్ సేవలను తీసుకువచ్చింది. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లోనే విద్యుత్ సంబంధిత సేవలు దాదాపు అన్నింటిని అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఇన్నాళ్లూ విద్యుత్ బిల్లుల చెల్లింపు మినహా మీ–సేవా కేంద్రాల్లో పొందిన సేవలు ఇకపై వినియోగదారుల ఇంటికి చేరువలోనే లభించే ఏర్పాటు చేసింది. ఇక గ్రామాల్లో కరెంటు బిల్లులు కట్టడానికి సచివాలయాలకు వెళితే సరిపోతుంది. తాజాగా అమల్లోకి వచ్చిన ఈ సేవలతో రాష్ట్రంలోని దాదాపు 1.92 కోట్ల వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

ఎనర్జీ అసిస్టెంట్లకు బాధ్యతలు

పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు అంతరాయాలు లేకుండా విద్యుత్ అందించడంలో ఎనర్జీ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. సచివాలయ వ్యవస్థలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,883 మంది ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ శాఖ ద్వారా నియమించారు. వీరికి అవసరమైన శిక్షణను ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు అందించాయి. భవిష్యత్‌లో వీరికి లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్ సూపర్‌వైజర్, ఫోర్‌మెన్‌గా పదోన్నతులు పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి ఎనర్జీ అసిస్టెంట్‌ను గరిష్టంగా 1,500 విద్యుత్ కనెక్షన్లకు బాధ్యుడిని చేశారు. కనీసం 30 నుంచి 40 ట్రాన్స్‌ఫార్మర్లను ఇతను నిరంతరం పర్యవేక్షిస్తాడు. 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో లైన్‌పై చెట్లు పడినా, జంపర్లు తెగిపోయినా బాగు చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, చెడిపోయినా, మీటర్లు ఆగిపోయినా కొత్తవి బిగించడం వంటి విధులతో పాటు మరే ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తినా బాగు చేస్తారు. వారి స్థాయి కానప్పుడు పైఅధికారులకు వెంటనే సమాచారం అందించడం ద్వారా సాంకేతిక నిపుణులు త్వరగా వచ్చేలా చూస్తారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యుత్ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చిన సేవలు

1. గృహ, వాణిజ్య సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు
2. వ్యవసాయ సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు
3. అదనపు లోడ్ దరఖాస్తు
4. కేటగిరి మార్పు
5. సర్వీసు కనెక్షన్ పేరు మార్పు
6. మీటరు టెస్టింగ్‌కు సంబంధించి
7. మీటరు కాలిపోవటంపై ఫిర్యాదు
8. బిల్లులకు సంబంధించిన సమస్యలు
9. ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఫిర్యాదులు
10. వోల్టేజ్ హెచ్చుతగ్గులపై ఫిర్యాదులు
11. లైన్ షిఫ్టింగ్
12. పోల్ షిఫ్టింగ్
13. మీటరు ఆగిపోవడం, నెమ్మదిగా తిరగడంపై ఫిర్యాదులు
14. విద్యుత్ బిల్లులు చెల్లింపు

విద్యుత్ సరఫరాకు సంబంధించి వలంటీర్ల ద్వారాగానీ ప్రజలు నేరుగాగానీ గ్రామ సచివాలయానికి ఫిర్యాదు చేసేత్ క్షణాల్లో సమస్యలను పరిష్కరిస్తారు. ఇకపై వీరు విద్యుత్ రంగానికి సంబంధించిన అన్ని సేవలను సచివాలయాల ద్వారా ప్రజలకు అందేలా చూస్తారు.

ప్రజలకు మరింత సౌకర్యంగా..



గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలు పొందేందుకు ప్రజలకు అవకాశం కల్పించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సూచనలతో విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిస్కంలను కొన్ని నెలల క్రితం జరిగిన సమీక్షలో ఆదేశించారు. ఆ మేరకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను పూర్తి చేసి తాజాగా అన్ని సేవలను సచివాలయాల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చాం. డిజిటలైజేషన్ నేపథ్యంలో ఆన్‌లైన్ పేమెంట్ యాప్స్(యూపీఐ)ల ద్వారా, డిస్కంల సొంత యాప్స్ ద్వారా చాలా మంది విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. కొందరు అందుబాటులో ఉన్న నగరాలు, పట్టణాల్లో ఎనీటైమ్ పేమెంట్ (ఏటీపీ)మెషిన్స్, విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో బిల్లులు కడుతున్నారు. గ్రామాల్లో నెలకోసారి దండోరా వేయించి సంస్థ ప్రతినిధి వెళ్లి బిల్లులు కట్టించుకుంటున్నారు. ఇకపై సచివాలయాల్లో కూడా కరెంటు బిల్లులు చెల్లించే సౌకర్యాన్ని కల్పించాం.

–ఐ.పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్.

నాగకేసరి చెట్ల నుంచి జీవ ఇంధనం

గిరిజన బిడ్డ అద్భుత పరిశోధన • ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆసక్తి, విషయ పరిజ్ఞానం, సాధించాలనే తపన ఉంటే దేనినైనా సాధించవచ్చని నిరూపించింది ఓ గిరిపుత్రిక. తల్లిదండ్రులు తనని చదివించలేని పరిస్థితుల్లో ఉన్నా, మొక్కవోని దృఢ సంకల్పంతో ఉన్నత చదువుల్లో ప్రతిభ చూపారు రాజేంద్రపాలేనికి చెందిన దిబ్బ చంద్రవతి. ఆమె తల్లిదండ్రులు దిబ్బ సుందర్రావు, సింగారమ్మ కూలీలు. చంద్రవతి పదో తరగతి మండలంలోని పెదమాకవరం పాఠశాలలోను, ఇంటర్ పాడేరు బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ విశాఖలో చదివారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో రెండేళ్లు ఎంఫిల్ చేశారు. పీహెచ్‌డీలో భాగంగా 'నాగ కేసరి చెట్ల నుంచి జీవ ఇంధన తయారీ'పై పరిశోధనకు శ్రీకారం చుట్టారు. యూనివర్సిటీ ఆచార్యులు ఎస్‌బీ పడాల్ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. దీనిపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురణలు జరగడంతో ఆమెను డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో విలువైన ఔషధాలు ఉన్నాయని తెలిపారు. ఆదిమజాతి గిరిజనులు వృక్షాలతో అన్యోన్యంగా ఉంటారని, వివిధ రకాల రోగాలకు వారి పరిసరాల్లో పెరిగే మొక్కలు, చెట్లను ఉపయోగిస్తారని చెప్పారు. అడవిలో పెరిగే నాగ కేసరి చెట్ల నుంచి సేకరించిన విత్తనాలను నూనెగా మార్చి జీవ ఇంధనంగా తయారు చేశామని ఆమె వివరించారు. తక్కువ ఖర్చుతో ఇంధనాన్ని తయారు చేయవచ్చునని తెలిపారు. పరిశోధన పూర్తి కావడంతో ఏయూ ఉప కులపతి పీవీజీడీ ప్రసాద్ రెడ్డి నుంచి ఈనెల తొమ్మిదిన డాక్టరేట్ అందుకున్నట్టు ఆమె తెలియజేశారు.



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న చంద్రవతి. పక్కన పడాల్

విశాఖకు కృష్ణాబోర్డు

- కార్యాలయం కోసం భవనం కేటాయింపు

సాక్షి, అమరావతి: కృష్ణాబోర్డు కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అన్ని వసతులతో కూడిన భవనాన్ని సిద్ధం చేసింది. తక్షణమే హైదరాబాద్ నుంచి విశాఖకు కార్యాలయాన్ని తరలించాలని బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ లేఖ రాశారు. కృష్ణా, గోదావరి నదీజలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు రాకుండా చూసేందుకు కృష్ణా, గోదావరి బోర్డులను విభజన చట్టం ద్వారా కేంద్రం ఏర్పాటుచేసింది. కృష్ణాబోర్డు కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోను, గోదావరి బోర్డు కార్యాలయం తెలంగాణలోను ఏర్పాటుచేయాలని నిర్దేశించింది. ప్రస్తుతం రెండు బోర్డుల కార్యాలయాలు హైదరాబాద్ కేంద్రంగానే పనిచేస్తున్నాయి. 2020లో కృష్ణాబోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రి ఆదేశించారు. కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్నారో అక్కడ భవనం, వసతులు కల్పిస్తే హైదరాబాద్ నుంచి తరలిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి కృష్ణాబోర్డు తెలిపింది. విశాఖపట్నంలో నార్త్‌కోస్ట్ సీఈ కార్యాలయం ప్రాంగణంలో నిర్మించిన భవనంలో ఒక అంతస్తును కృష్ణాబోర్డు కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించి, బోర్డుకు తెలిపింది.

రాష్ట్రంలో మహిళలే ఎక్కువ

దేశంలో అత్యధిక మహిళలున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి వెయ్యి మంది పురుషులకు మహిళలు 1,030 మంది ఉన్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ స్త్రీ, పురుష నిష్పత్తిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. 2022-23 లేబర్ ఫోర్స్ సర్వే నివేదికను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ బుధవారం విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా చూస్తే 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పురుషల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది. మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పురుషుల సంఖ్యే ఎక్కువ.




- సాక్షి, అమరావతి

గ్రామాల్లోనే పెద్ద కుటుంబాలు

- రాష్ట్రంలో 2022–23లో మొత్తం 1,44,52,800 కుటుంబాలుండగా.. వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1,00,19,600, పట్టణ ప్రాంతాల్లో 44,33,200 కుటుంబాలున్నాయి.
- రాష్ట్రంలో సగటు కుటుంబ పరిమాణం 3.2 కాగా.. గ్రామీణ ప్రాంతాల్లో 3.3, పట్టణ ప్రాంతాల్లో 3.2గా ఉందని నివేదిక తెలిపింది.


దేశంలో పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి ఇదీ..



ఏపీలో పరిస్థితి ఇదీ..



2022-23లో దేశంలో ప్రతి వెయ్యి మంది పురుషులకు మహిళలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు..



స.హ. చట్టం అమల్లో ఏపీకి మూడో స్థానం

రాష్ట్ర సమాచార కమిషనర్ హరిప్రసాదరెడ్డి వెల్లడి

నరసరావుపేట: సమాచార హక్కు చట్టం అమలు చేయడంలో దేశంలో ఏపీ మూడవ స్థానంలో ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ హరిప్రసాదరెడ్డి చెప్పారు. అక్టోబర్ 12న ఆర్టీఐ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఆర్టీఐ నేషనల్ సమ్మిట్‌కు ఆయన హాజరయ్యారు. పల్నాడు రోడ్డులోని మున్సిపల్ బాలుర హైస్కూలు నుంచి విద్యార్థులు, ఎన్‌సీసీ, స్కౌట్ క్యాడెట్లతో ప్రారంభమైన ఆర్టీఐ ర్యాలీకి జేసీ ఏ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి టౌన్‌హాల్ వరకు జై ఆర్టీఏ అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో కొనసాగిన ర్యాలీలో వారితో పాటు డీఆర్వో కె.వినాయకం, అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి కొనసాగారు. అనంతరం టౌన్‌హాలులో హరిప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ఎప్పటి రికార్డులు అప్పుడు పూర్తి చేసుకొంటే చట్టం ప్రకారం సమాచారమివ్వడం సులభం అవుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని, అలా చేయని చోట అధికారులే స్వచ్ఛందంగా ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. ఇంకా బోర్డులు పెట్టని కార్యాలయాల వివరాలు రాష్ట్ర కమిషన్ కార్యాలయంలో తెలిపితే వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. తహశీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, మునిసిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, ఆర్టీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న హరిప్రసాదరెడ్డి తదితరులు

అక్షర దివిటీ!

"మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది.. ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థమందులో ఉంది.. అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది... '' ఈ సినీ గేయంలోని ప్రతి అక్షరం ఓ జీవిత పాఠం. విద్యార్థిగా ఉన్న సమయం నుంచి ఉపాధ్యాయులు, ఆ తర్వాత అధ్యాపకులు తమ జ్ఞానాన్ని పంచి విద్యార్థి బంగారు భవితకు బాటలు వేస్తారు. తల్లిదండ్రులు తమ స్వేదం చిందించి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తారు. ఒక వయస్సుకు వచ్చిన తర్వాత దారీతెన్నూ తెలియని పరిస్థితుల్లో గ్రంథాలయం అక్షర దివిటీ వెలిగిస్తుంది. అక్కడి నిశ్శబ్దం జీవితానికి వెలుగు బాట వేస్తుంది. వేల సంఖ్యలోని పుస్తకాల్లోని ప్రతి పేజీ లక్ష్యాన్ని ఏర్పరచడంతో పాటు గెలుపు తీరాలకు చేరుస్తుంది. పరిచయం లేకపోయినా ఒకరికొకరు స్ఫూర్తిగా నిలుస్తూ.. గంటలకొద్దీ సమయం క్షణాల్లా గడిచిపోతుంది. నిత్య విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తోంది.

- సాక్షి, కర్నూలు డెస్క్

స్ఫూర్తి నిలయం.. గ్రంథాలయం

- జీవితాలను తీర్చిదిద్దుతున్న నిశ్శబ్దం
- అలవడుతున్న ఏకాగ్రత
- ఉద్యోగాలు సాధిస్తున్న యువత
- నిత్య విద్యార్థులుగా పుస్తకాలతో స్నేహం
- మలి వయస్సులో పత్రికల తోడు

ఏకాగ్రత కుదురుతుంది



నాకు ఏడేళ్లుగా లైబ్రరీతో అనుబంధం ఉంది. ఇక్కడకు రావడంతోనే ఉద్యోగం సాధించే అవకాశం దక్కింది. ఇతర వ్యాపకాలకు దూరంగా అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఈ దేవాలయం ఒక వరమని చెప్పాలి. అవసరమైన సమాచారం దొరకడంతో పాటు ప్రతి ఒక్కరూ ఇతరులను చూసి స్ఫూర్తి పొందుతుంటారు. ప్రశాంతమైన వాతావరణం కావడంతో ఏకాగ్రత కుదురుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరో 10వ తరగతి, మరొకరు 7వ తరగతి చదువుతున్నారు. సెలవు రోజుల్లో వాళ్లను తప్పకుండా ఒక్కడికి తీసుకొస్తా. పిల్లలను లైబ్రరీకి అలవాటు చేయడం వల్ల మానసికంగా దృఢంగా ఉంటారు.

– సునీత, జూనియర్ అసిస్టెంట్, ఖజానా శాఖ, కర్నూలు

తప్పక విజయం సాధిస్తా



బి.కాం పూర్తయింది. ఉద్యోగ అన్వేషణలో ఉన్నా. కోచింగ్ సెంటర్లకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఆరేళ్లుగా లైబ్రరీకి వస్తున్నా. ఇక్కడైతే కోరుకున్న సమాచారం, అవసరమైన పుస్తకాలు, అంతకు మించి సమయం అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఎస్ఐ పరీక్షలకు సిద్ధమవుతున్నా. తప్పక విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

– పి.నజీర్, హోసూరు గ్రామం, పత్తికొండ మండలం

ఎంతో ప్రభావితం చేస్తుంది



ఫార్మసీ పూర్తయింది. గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నా. ఐదేళ్లుగా ఇక్కడకు వస్తున్నా. లైబ్రరీకి వచ్చినప్పటి నుంచి నాలో ఎంతో మార్పు వచ్చింది. చుట్టుపక్క వాళ్లను చూస్తే మనం కూడా బాగా చదవాలనే ఉత్సాహం కలుగుతుంది. ఇక్కడికి వచ్చే వాళ్లు ఎంతో మంది మంచి ఉద్యోగాలు సాధించారు. వాళ్లలో కొందరు ఇప్పటికీ రోజూ వచ్చిపోతుండటం చూస్తే లైబ్రరీ ఎంతగా వాళ్లను ప్రభావితం చేసిందో అర్థమవుతుంది. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు చక్కటి అవకాశంగా భావిస్తున్నా.

– శ్వేత, కర్నూలు

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయింది. అవసరం ఉన్నా, లేకపోయినా ఈ వస్తువు లేనిదే పూట గడవని పరిస్థితి. చివరకు చిన్న పిల్లలకు భోజనం తినిపించాలన్నా సెల్‌ఫోన్‌లో బొమ్మలు పెడితే కానీ ముద్ద దిగనంతగా ప్రభావితం చేస్తోంది. కొంత వరకు తెలియని విషయాలు తెలుసుకునేందుకు ఈ సాధనం ఉపయోగపడుతున్నా.. ఇది లేనిదే బతకలేమన్నంతగా జీవితంలో ఇమిడిపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పరిస్థితుల్లోనూ గ్రంథాలయాలు మనుగడ సాగిస్తున్నాయి. ఎన్నో జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా ఎంతో మంది రోజూ ఇక్కడికి వచ్చి వెళ్తుండటం చూస్తే ఈ భవనం అక్షర యజ్ఞాన్ని తలపిస్తుంది. మొబైల్ ఫోన్లు వచ్చినా, ట్యాబ్‌లు అందుబాటులో ఉన్నా.. ల్యాప్‌ట్యాప్‌లు రాజ్యమేలుతున్నా.. పుస్తకం చేతిలో ఉంటే వంద మంది తోడుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. పేజీలు తిప్పిన కొద్దీ కొత్త జీవితం మొదలవుతుంది.



స్ఫూర్తి: గ్రంథాలయంలోని నిశ్శబ్ద వాతావరణంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

నిత్య విద్యార్థులు

ప్రపంచం చేతిలో ఇమిడిపోతున్నా తెలియని విషయాలు ఎన్నో ఉంటున్నాయి. నిత్య విద్యార్థిగా మారినప్పుడే జ్ఞానం పెంపొందుతుంది. ప్రస్తుతం గ్రంథాలయానికి వస్తున్న వాళ్లను పరిశీలిస్తే బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంఏ బీఎడ్, ఎంపెడ్, ఎంటెక్.. ఇలా ఉన్నత చదువులు చదివినా ఇప్పటికీ పుస్తకాలతో కుస్తీ పడుతూనే ఉన్నారు. వీళ్లే కాదు.. ఇంటర్మీడియట్, ఆ కింది చదువుల విద్యార్థులు సైతం ఇక్కడికి వచ్చి చక్కగా చదువుకుంటున్నారు. తమకంటే పెద్దవాళ్లు కుదురుగా కూర్చొని పుస్తకాల్లో దూరిపోవడం చూసి మనం కూడా ఆస్థాయికి చేరుకోవాలనే భావన పెంపొందించుకుంటున్నారు.

శాశ్వత సభ్యత్వం రూ.100

ప్రస్తుతం గ్రంథాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలను బయట కొందరు వ్యాపార ధోరణిగా కూడా మలుచుకున్నారు. ఒక భవనాన్ని అద్దెకు తీసుకొని కొన్ని కంప్యూటర్లు, కుర్చీలు ఏర్పాటు చేసి చదువుకునే ఏర్పాటు చేసి నెలకు సుమారు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. పైపై సౌకర్యం కల్పించేందుకు మరికొంత అదనపు డబ్బు తీసుకుంటున్నారు. అయితే ఇలాంటి సౌకర్యాలన్నీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసినా ఇక్కడ శాశ్వత సభ్యత్వంగా రూ.100 మాత్రమే తీసుకుంటున్నారు. పని చేస్తున్న ఉద్యోగులంతా మానవతా దృక్పథంతో ఉన్నవారే కావడం, ఉద్యోగాలు వస్తే జీవితంలో స్థిరపడతారనే భావన ఉండటంతో తమ పిల్లలుగానే ప్రోత్సహిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణం ఉండటం, సెల్‌ఫోన్‌లను ప్రోత్సహించకపోవడంతో విద్యార్థులు తమ లక్ష్యంపైనే దృష్టి సారిస్తున్నారు.

స్ఫూర్తికి ప్రోత్సాహం

ఎన్ని మార్కులు తెచ్చుకున్నా, ఎంత చదువులు చదివినా ఇంట్లో కూర్చుని పుస్తకాలు తిరగేస్తే ఏదో ఒక ఆటంకం ఎదురవుతూనే ఉంటుంది. ఎవరో ఒకరు మాట్లాడించడం, ఏదో ఒక పని చెప్పడంతో ఏకాగ్రత లోపిస్తుంది. ఈ కారణంగా కూడా చాలా మంది గ్రంథాలయానికి చేరుకుంటున్నారు. ఉదయం 8 గంటలకు తలుపులు తెరవక మునుపే అక్కడ చేతిలో పుస్తకాలతో వాలిపోతున్నారు. రాత్రి 8 గంటలకు తలుపులు మూసేస్తున్నా.. మరికొంత సమయం తీసుకొని పేజీలు తిప్పేస్తున్న తీరు ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఇలాంటి వాళ్లను గ్రంథాలయ నిర్వాహకులు కూడా ప్రోత్సహిస్తున్నారు.

పుస్తకం పట్టనిదే పూట గడవదు

ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కనిపిస్తున్నా, గ్రంథాలయానికి వచ్చే వాళ్లు పుస్తకం పట్టనిదే పూట గడవని విధంగా తమను తాము మలుచుకున్నారు. ఒకప్పుడు కొత్త నవల మార్కెట్‌లోకి వచ్చీ రాగానే అమ్ముడైపోయేవి. అయితే ఇప్పటికీ గ్రంథాలయంలో లభిస్తున్న నవలలు, వీక్లీలు, ఇతరత్రా పుస్తకాలను శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్యులు ఇళ్లకు తీసుకెళ్లి చదువుతున్నారు. ఖరీదైన పుస్తకాలను కాస్త డబ్బు డిపాజిట్ చేసి తీసుకెళ్తున్నారు. ఇక ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులు మధ్యాహ్నానికి అవసరమైన భోజనం కూడా తెచ్చుకొని ఇక్కడి పుస్తకాలతో పాటు తమ వెంట తెచ్చుకున్న పుస్తకాలను అవపోసన పడుతున్నారు. అవసరమైన సమాచార సేకరణకు కంప్యూటర్లు కూడా ఉండటంతో ఎంతో ఉత్సాహం కనపరుస్తున్నారు. గంటకు రూ.10 చొప్పున మాత్రమే కంప్యూటర్ వినియోగానికి వసూలు చేస్తుండటం విశేషం.



బాధ్యత: బ్రెయిలీ లిపి భారతం పుస్తకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క



విజయం: ఇటీవల కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన రాఘవేణి, వసంత

ప్రశాంతతను వెతుక్కుంటూ..

విద్యార్థులే కాదు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సైతం గ్రంథాలయానికి నిత్య విద్యార్థులుగా వస్తుండటం విశేషం. ఇక్కడికి రావడమే కాదు.. ముఖ ద్వారంలో ఏర్పాటు చేసిన ఓ పుస్తకంలో తమ పేరు, వివరాలను రాస్తుండటం చూస్తే క్రమశిక్షణకు అద్దం పడుతోంది. ఇక్కడ సుమారు 15 వరకు దినపత్రికలను అందుబాటులో ఉంచడంతో ప్రతి రోజూ 120 నుంచి 140 మంది వరకు ప్రపంచాన్ని చుట్టివచ్చినట్లుగా అక్షరం అక్షరాన్ని వడబోస్తున్నారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న వాళ్లు శేష జీవితంలో ప్రశాంతతను వెతుక్కుంటూ పుస్తకాలతో స్నేహం చేస్తున్నారు. ప్రతి రోజూ ఈ గడప తొక్కనిదే తమకు ఏమీ తోచదని చెప్పడం చూస్తే ఈ పుస్తకాలు వాళ్ల జీవితంలో ఎలా భాగమయ్యాయో అర్థమవుతుంది. అంతేకాదు.. కొందరు దాతలు తాము ఎంతో ప్రేమగా దాచుకున్న పుస్తకాలను విరాళంగా ఇచ్చి పుస్తక ప్రియులకు ప్రోత్సహిస్తున్నారు. అంధులను దృష్టిలో ఉంచుకొని ఓ గదిని ప్రత్యేకంగా తీర్చిదిద్దడంతోపాటు బ్రెయిలీ లిపిలోని భారతం కూడా అందుబాటులో ఉంచారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.